ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

రాజమహేంద్రవరం

: fb.com/vaartha Digital

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

30-8-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 211 పేజీలు: 8+4 వెల: 8.00


**ఉద్యోగం పోతే అమెరికాను వీడాల్సిందే**

**నేపాల్ వరదల్లో ఇన్ఫోసిస్ ఎగ్జిక్యూటివ్ గల్లంతు**

5లో

## గిరిజనుల అభివృద్ధికి

# పంచసూత్ర ప్రణాళిక

ప్రయోగాత్మకంగా సంజీవని పథకం ప్రారంభించిన సీఎం చంద్రబాబు

పేదరికం లేని గిరిజన కుటుంబాలే లక్ష్యం

జిఒ నం.3కి ప్రత్యామ్నాయం త్వరలోనే..




శనివారం గన్నెల పంచాయితీ కేంద్రంలో ఏర్పాటు చేసిన 'సంజీవని' పథకం ప్రారంభ సభలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

**పాడేరు/అరకులోయ, ఆగస్టు29,ప్రభాతవర్త:** అల్లూరి సీతా రామరాజు జిల్లాలోపవిత్రమైన సంజీవని కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని..మంచి ప్రదేశం..ఎంత ఆహ్లాదకరమైన ప్రదేశం అంటే కొత్త శక్తి...ఉత్సాహం వస్తుంది..ఇటు చూసినా పచ్చదనం..ఇటుచూసినా కొండలు..స్వచ్ఛమైన గాలి.. వాతావరణం ఈ ప్రాంతం సొంతం..ఇటువంటి ప్రాంతంలో పవిత్రమైన సంజీవని ప్రారంభిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు.అరకువ్యాలీ మండలం గన్నెల పంచాయితీ కేంద్రం గిరిజన ప్రాంతంలో ప్రయోగాత్మకంగా అమలు చేయనున్న 'సంజీవని' పథకం ప్రారంభోత్సవ సభ అల్లూరి జిల్లా కలెక్టర్ టి.నిశాంతి అధ్యక్షతన జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబుయుడు గిరిజనులను ఉద్దేశించి ప్రసంగించారు. గిరిజన ప్రాంతాల ప్రజలు పాపులేషన్ మేనేజ్మెంట్‌లో కూడా ముందున్నారనీ ఇది అభినందనీయమన్నాడు.. పిల్లలే మనసంపద అనే సిద్ధాంతాన్ని మన గిరిజన ప్రజలు ఆచరిస్తున్నారనీ ఇది గర్వకారణ మని సిఎం అన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఏ కుటుంబమూ పేదరికంలో ఉండకూడదన్నదే మా ఆలోచన గిరిజన ప్రాంతాల్లో ఉద్యోగాలన్నీ స్థానికులకే దక్కేలా జిఒ నంబర్ 3 మేమే తీసుకువచ్చామణి సిఎం గుర్తు చేశారు. గత పాలకులు నిర్లక్ష్యంతో సుప్రీం కోర్టు దానిని రద్దు చేసిందన్నారు.ఈ అంశంపై అందరికీ ఆమోదయోగ్యమైన ప్రత్యామ్నాయాన్ని త్వరలోనే తీసుకువస్తామని సిఎం చంద్రబాబు హామీ ఇచ్చారు.

ఐదు సూత్రాలతో గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు చేశామన్నాడు.అడవితల్లి బాట పేరుతో రూ.1000 కోట్లతో 900 కిలోమీటర్ల రహదారులు వేశామన్నారు.1.60 లక్షల ఇళ్లకు కుళాయి ద్వారా నీరు, సోలార్ రూఫ్ టాప్‌ను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఉపాధి పెరిగేలా అరకుకాఫీని మరో లక్షఎకరాల్లో సాగు చేసేలా ప్రోత్సహిస్తున్నామన్నారు.అరకు ప్రాంతానికి పర్యాటకుల సంఖ్య పెరిగింది. హోమ్ స్టేల ద్వారా ఆతిథ్యం ఇస్తే గిరిజన కుటుంబాలకు ఆదాయం వస్తుందన్నారు. మన ప్రాంతానికి వచ్చే పరిశ్రమల్లో గిరిజన యువత ఉద్యోగాలు సాధించేలా నైపుణ్యాభివృద్ధి కల్పిస్తామన్నాడు. వచ్చేమూడేళ్లలో లక్షమంది యువతకు నైపుణ్యశిక్షణ కల్పించాలన్నదే మా ఆలోచన అన్నారు. అత్యవసర వైద్య సేవలను అందించేందుకు జిల్లాలో

>>2



## తాష్కెంట్‌లో ప్రధాని మోడీ

**ప్రోటోకాల్ పక్కనపెట్టి ఎయిర్‌పోర్టులో మోడీకి స్వాగతం పలికిన అధ్యక్షుడు**

**అనంతరం ఒకే కారులో ఇరువురు అధినేతల ప్రయాణం**

**తాష్కెంట్, ఆగస్టు 29:** ప్రధాని మోడీ రెండు రోజుల పర్యటన కోసం శనివారం ఉజ్బెకిస్థాన్ రాజధాని తాష్కెంట్‌కు చేరుకున్నారు. అక్కడ ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయెవ్ స్వయంగా విమానాశ్రయానికి చేరుకుని మోడీకి ఘన స్వాగతం పలికారు. భారత్ ఉజ్బెకిస్థాన్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా మోడీ ఈ పర్యటన చేపట్టారు. తాష్కెంట్ చేరుకున్న అనంతరం ప్రధాని మోడీ ఎక్స్‌వేదికగా స్పందిస్తూ అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయెవ్ నుంచి ఆత్మీయ స్వాగతం లభించింది. ఆయన చూపించిన ప్రత్యేక ఆతిథ్యానికి కృతజ్ఞతలు. ఉజ్బెకిస్థాన్‌కు ఇది నా నాలుగో పర్యటన. ఇది ఇరు దేశాల మధ్య సంబంధాల లోతు, వాటిలో పెరుగుతున్న వేగానికి నిదర్శనం" అని పేర్కొన్నారు. పర్యటనలో భాగంగా ప్రధాని మోడీ, అధ్యక్షుడు మిర్జియోయెవ్‌తో ప్రతినిధుల స్థాయి చర్చలు జరపనున్నారు. ఇరు దేశాలమధ్య వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, డిజిటల్ కనెక్టి

>>2




శనివారం శ్రీకాకుళంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రామ్మోహన్ నాయుడు

## చెంచుల అభివృద్ధికి చర్యలు

**రూ. 8 లక్షల బ్యాంక్ రుణాల చెక్కును వారికి అందించిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు**

**శ్రీకాకుళం, ఆగస్టు 29 ప్రభాతవార్త :** గిరిజనుల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎప్పుడూ కట్టుబడి ఉన్నాయని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శనివారం శ్రీకాకుళం కలెక్టరేట్‌లో చెంచు తెగకు సంబంధించిన జిల్లా సంఘం ఉన్నతి సభ్యులకు సున్నా వడ్డీతో బ్యాంక్ లింకేజ్ రుణం 8లక్షల రూపాయల చెక్కును అందించారు. చెంచు వృత్తి చేసుకునేవారు వారి సాంప్రదాయ వస్త్రాలను కొనుగోలు చేసేందుకు, ఇతర అవసరాల కోసం ఈ మొత్తాన్ని వినియోగించుకోవాలని కోరారు. కేంద్ర మంత్రి ఆదేశాల ప్రకారం ఉన్నతి సంఘం సభ్యులకు 8 లక్షల రూపాయల బ్యాంక్ లింకేజ్ రుణం చెక్కులు శనివారం అందజేశారు. వడ్డీ లేకుండా ఈ మొత్తం వస్తూ ఉండటంతో దీనిపై ఉన్నతి సంఘం సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. రామ్మోహన్ నాయుడు కృషికి ధన్యవాదాలు తెలిపారు.

**కీలక అభివృద్ధి ప్రాజెక్టులపై సమీక్ష :**

శ్రీకాకుళం పార్లమెంట్ పరిధిలో ఇటీవల చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలు, వివిధ కంపెనీల సిఎస్ఆర్ నిధులతో చేపడు

>>2

## వడివడిగా ఇన్నర్ రింగ్‌రోడ్డు

**శిల్పారామం-పెదపలకలూరు వరకు 4.25 కి.మీ రహదారి నిర్మాణం : కేంద్రమంత్రి పెమ్మసాని**



**విజయవాడ,ఆగస్టు 29, ప్రభాతవార్త ప్రతినిధి:** శిల్పారామం- పెద పలకలూరు వరకు చేపడుతున్న మహాత్మా గాంధీ ఇన్నర్ రింగ్ రోడ్ ఫేజ్-3 రహదారి అభివృద్ధి పనులను కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ స్థానిక ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, స్థానిక నాయకులతో కలిసి పనుల పురోగతిని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా డా. పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ:.. శిల్పారామం నుంచి పెదపలకలూరు వరకు సుమారు 4.25 కిలోమీటర్ల మేర ఇన్నర్ రింగ్ రోడ్ ఫేజ్ -3 పనులను చేపడుతున్నామని తెలిపారు. ఈ ప్రాజెక్టును గతంలోనే ప్రారంభించాలనే ఆలోచన ఉన్నప్పటికీ, వైసీపీ హయాంలో పనులు ముందుకు సాగలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానిక ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, స్థానిక నాయకుల సహకారంతో రహదారి పరిధిలోని ఆక్యుపెంట్లను రిహాబిలిటేట్ చేసి, సమస్యలను పరిష్కరించి పనులకు మార్గం సుగమం చేశామని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకారంతో ఈ పనులకు రూ.48 కోట్లు మంజూరు చేసి పనులు ప్రారంభించామని పేర్కొన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పనుల పురోగతిని పరిశీలించేందుకు వచ్చామని, పనుల్లో ఎదురవుతున్న సమస్యలను కూడా సంబంధిత అధికారులతో చర్చిస్తున్నామని తెలిపారు. రహదారి నిర్మాణంలో కొన్ని ప్రాంతాల్లో హైట్ పెరగడంతో హైటెన్స్ వైర్‌ను మార్చాల్సిన అవసరం ఏర్పడిందని, ఇందుకు అదనంగా సుమారు రూ. 2 నుంచి 3 కోట్ల వ్యయం అయ్యే అవకాశం ఉందని చెప్పారు. అదేవిధంగా ఎన్ఎస్‌పి కెనాల్ క్రాసింగ్స్ వద్ద భవిష్యత్తులో నీటి ప్రవాహానికి ఇబ్బంది లేకుండా అదనపు కల్వర్టులు నిర్మించాల్సిన అవసరం ఉందని, ఒక్కో కల్వర్టుకు సుమారు రూ.10 నుంచి రూ. 15 లక్షల అదనపు వ్యయం అవుతుందని తెలిపారు.భవిష్యత్తులో సమస్యలు రాకుండా ఉండేందుకు ప్రస్తుత ప్రాజెక్టులోనే వీలైనంత వరకు ఈ అదనపు పనులు చేపట్టాలని కాంట్రాక్టర్‌ను కోరినట్లు తెలిపారు.

**పేరేచర్ల జంక్షన్ వరకు విస్తరణకు ప్రతిపాదన**

ప్రస్తుత ఇన్నర్ రింగ్ రోడ్‌ను భవిష్యత్తులో కొత్తగా నిర్మించనున్న రైల్వే వోవరుబ్రిడ్జిమీదుగా పేరేచర్ల జంక్షన్ వరకు విస్తరించాల్సిన అవసరం ఉందని డా.పెమ్మసాని తెలిపారు. ఈ విస్త

>>2



## నేపాల్‌కు తొలగని ముప్పు!

**మరో రెండు హిమానీనదుల నుంచి వరదలు!**

**700 దాటిన మృతులు, 2500 మందికి పైగా ఆచూకీ గల్లంతు**

**కఠ్మాండు, ఆగస్టు 29:** నేపాల్‌లో వరదల నుంచి కోలుకోక ముందే మరో షాకింగ్ విషయం వెలుగు వచ్చింది. ప్రమాదానికి కారణమైన భోటే కోషి త్రిశూలి నదీ వ్యవస్థ సమీపంలోనే మరో రెండు హిమానీనద సరస్సులు ఏర్పడ్డాయని జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ అధిపతి కృష్ణ వాత్సా తెలిపారు. అయితే వీటి నుంచి ఎంత మేర వరదనీరు బయటకు వచ్చే అవకాశం ఉందన్న దానిపై ప్రస్తుతం స్పష్టమైన అంచనాలు లేవని ఆయన వెల్లడించారు. ఒక సరస్సు 19.80 హెక్టార్లు, మరొకటి 7.28 హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్నట్లు పేర్కొన్నారు. సరస్సుల్లోని నీటి పరిమాణంపై ఇప్పటివరకు ఎలాంటి అంచనా లేదని ఆయన చెప్పుకొచ్చారు. అయితే అక్కడ హిమానీనదాలు కదులుతున్నప్పుడు పేరుకుపోయే రాళ్లు, మట్టి, ఇతర శిథిలాల కుప్పలు ఉన్నాయని కృష్ణ వాత్సా వెల్లడించారు. నేపాల్‌లో ఏర్పడిన ఈ సహజ సరస్సుల పరిస్థితిని భారత్ నేరుగా పరిశీలించే అవకాశం పరిమితంగా ఉండటంతో నిరంతరం పర్యవేక్షించాల్సిన అవసరం ఉందన్నారు. సహజంగా ఏర్పడే ఇలాంటి సరస్సులు భవిష్యత్తులో ఎలా మారతాయో పూర్తిగా అంచనా వేయడం సాధ్యం కాదని పేర్కొన్నారు. మరోవైపు, ఇదే ప్రాంతంలో కొత్తగా ఏర్పడిన సరస్సును నోయిడాకు చెందిన సుహోరా టెక్నాలజీస్ గుర్తించింది. ఆగస్టు 27న తీసిన అత్యంత

>>2

## స్థానిక పోరుకు జనసేన సిద్ధం



**యువత, మహిళా సాధికారత పార్టీ ప్రధాన అంశాలు**

**జనసైనికుల ఆత్మగౌరవం నిలబెట్టేలా ఎన్నికలు: మంత్రి నాదెండ్ల**

**విజయవాడ,ఆగస్టు29,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో నెల రోజులపాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ అనుసరించాల్సిన ప్రణాళికను పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పార్టీ పవన్ కల్యాణ్ సిద్ధం చేశారని రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖమాత్యులు, జెస్పీ పిఎసి ఛైర్మన్‌నాదెండ్ల మనోహార్ పేర్కొన్నారు. దీన్ని మనమంతా తు.చ. తప్పకుండా పాటించాలి. ప్రజల్లోకి తీసుకెళ్లాలని స్థానిక సంస్థలఎన్నికల్లో ఏకగ్రీవాలు జరిగితే నాయకులకు వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ ఇవ్వనని చెబుతున్న జగన్మోహన్ రెడ్డి 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా ఏకగ్రీవాల కోసం చేయని ఆకృత్యం లేదన్నారు. వ్యవస్థలను, అధికారాన్ని అడ్డం పెట్టుకొని 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీని టార్గెట్ చేశారని చెప్పారు. అప్పట్లో సిద్ధం చెప్పినవ్యక్తే... నేడు యుద్ధంఅంటున్నారని అన్నారు. జనసేనపార్టీ ఎప్పుడూ యుద్ధానికి సిద్ధమని తేల్చి చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై జనసేన పార్టీ ఆత్మీయ సమావేశం శుక్రవారం మంగళగిరిలో జరిగింది. సమావేశంలో 2021లో జనసేన పార్టీ తరఫున స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీలో ఉన్నవారిని పవన్ కళ్యాణ్ సూచనల మేరకు సమావేశం ప్రారంభంలోనే ఆత్మీయంగా మనోహర్ సన్మానించారు. 1000 మందికి సభావేదికపై సన్మానాలు చేశారు. అనంతరం జరిగినసమావేశంలో నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ అప్పట్లో పవన్ కళ్యాణ్

>>2

## తెలుగులోనే ఇక ఉత్తర్వులు

**- సమాచార కమిషనర్ గాజుల ఆదెన్న**



**విజయవాడ,ఆగస్టు29, ప్రభాతవార్తప్రతినిధి:** ప్రముఖ తెలుగు భాషావేత్త, వ్యావహారిక భాషోద్యమ నాయకుడు, సంఘ సంస్కర్త గిడుగు వేంకట రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని ప్రతి యేటా ఆగస్ట్ 29 న మనం నిర్వహించుకునే తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార కమిషనర్ గాజుల ఆదెన్న తన పరిధిలోని ఆర్టీఐ అర్జీదారులకు, అధికారులకు, ప్రజలకు మరింత చేరువయ్యే కీలక నిర్ణయం తీసుకున్నారు. సమాచార హక్కు చట్టం అర్జీదారులకు, అధికారులకు సంబంధించిన ఆర్టీఐ కేసులపై తన పరిధిలో జారీ చేసే తీర్పుల ఉత్తర్వులను సామాన్య పౌరులకు సులభంగా అర్థమయ్యే విధంగా తెలుగులో అందించేందుకు నిర్ణయించారు.ప్రజల జీవితాలను ప్రభావితం చేసే నిర్ణయాలు, ఉత్తర్వులు వారికి అర్థం కాని భాషలో ఉంటే, తమ కేసులో అసలు ఏం జరిగిందో తెలుసుకోవడానికి ఇతరులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. అందుకే ప్రజలకు సంబంధించిన ఉత్తర్వులు మన తెలుగు మాతృభాషలో అందుబాటులో ఉండటం ద్వారా న్యాయం, పారదర్శకత అర్జీదారులు, అధికారులు, ప్రజలకు మరింత చేరువవుతాయని గాజుల అదెన్న పేర్కొన్నారు. కమీషన్ ఇచ్చే తీర్పుల

>>2

## ఎంబిబిఎస్, బిడిఎస్ ఫీజులు 10% పెంపు

**విజయవాడ, ఆగస్టు29, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో వైద్య విద్యా కోర్సులకు ప్రైవేట్ అన్ ఎయిడెడ్ కళాశాలలో వసూలు చేయాల్సిన ఫీజులను ప్రభుత్వ ప్రకటించింది. తొలి విడత కౌన్సెలింగ్ నిర్వహణకు దీనితో మార్గం సుగమమైంది. గతేడాదితో పోలిస్తే ఎంబిబిఎస్, బిడిఎస్ కోర్సులకు 10 శాతం, పిజి మెడికల్ కోర్సులకు 15 శాతం, సూపర్ స్పెషాలిటీ కోర్సులకు 15 శాతం పెంచుతూ ఉత్తర్వులు ఇచ్చింది. ఈమేరకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ కార్యదర్శి వీరపాండ్యన్ ఆదేశాలిచ్చారు.ఎంబిబిఎస్ కన్వీనర్ కోటా ఎకేటగిరి రూ. 18,150, బి కేటగిరి (మేనేజిమెంట్ కోటా) రూ.14.52 లక్షలు, సికేటగిరి (ఎన్నారై కోటా) రూ.43.56 లక్షలు ఫీజులను నిర్ణయించారు. బిడిఎస్ కన్వీనర్ కోటా ఎకేటగిరి రూ.15,730, బికేటగిరి రూ.4.84లక్షలు, సి కేటగిరి రూ.14.52 లక్షలుగా నిర్ణయించారు. మెడికల్ పీజీ కోర్సులకు క్లినికల్ డిగ్రీ ఎకేటగిరి రూ.5,71,320, బి కేటగిరి రూ.11,42,640, సికేటగిరి రూ.66,12,500, పారాక్లినికల్ డిగ్రీ, డిప్లమో ఎకేటగిరి రూ.1,78,538, బికేటగిరి రూ.3,57,075, సికేటగిరికి రూ.19,83,750. ప్రీ క్లినికల్ డిగ్రీ ఎ కేటగిరి రూ.80,937, బికేటగిరి రూ. 1,61,874, సికేటగిరి రూ.10,58,000గా నిర్ణయించారు.డెంటల్ క్లినికల్ పిజి డిగ్రీ ఎ కేటగిరి రూ. 3,92,783, బికేటగిరి రూ.7,85,565, సికేటగిరి రూ.15,87,000గా నిర్ణయించారు పారా క్లినికల్ డెంటల్ పిజి ఎ కేటగిరి రూ.3,53,504, బికేటగిరి రూ.5,74,759, సికేటగిరి రూ. 9,25,750 నిర్ణయించారు. సూపర్ స్పెషాలిటీ కోర్సులకు జీఎస్ఎల్, కస్తూరి, నారాయణ,ఎన్నారై, డాక్టర్ సిద్దార్థ మెడికల్ కళాశాలల్లో రూ.19,83,750 ఫీజు ఉంటుందని ఉత్తర్వులో తెలిపారు. ఈ మేరకు మూడు వేర్వేరు జీవోలను విడుదల చేశారు.



శనివారం విజయవాడలో తెలుగు భాషా దినోత్సవ వేడుకల్లో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి కందుల దుర్గేష్

## తెలుగు భాష పరిరక్షణకు ప్రాధాన్యం

**వచ్చే నెల మొదటి వారంలో నంది నాటకోత్సవాలపై కీలక ప్రకటన**

**ఘనంగా గిడుగు జయంతి, తెలుగుభాషా దినోత్సవాలు**

**19 మందికి తెలుగు భాషా పురస్కారాల ప్రదానం**

**విజయవాడ,.ఆగస్టు29,ప్రభాతవార్తప్రతినిధి:** సెప్టెంబర్ మొదటి వారంలో నంది నాటకోత్సవాల నిర్వహణపై కీలక ప్రకటన చేస్తామని, యేడాదిలోనే వీటిని కూటమి ప్రభుత్వం అత్యంత ఘనంగా నిర్వహిస్తుందని సాంస్కృతిక శాఖమంత్రి కందుల దుర్గేష్ స్పష్టంచేశారు. విజయవాడ డా. బి.ఆర్. అంబేద్కర్ కళావేదికలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో తెలుగు వాడుక భాష ఉద్యమ పితామహుడు గిడుగు వేంకట రామమూర్తి పంతులు 163వ జయంతి (తెలుగు భాషా దినోత్సవం) వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ 19 మంది ప్రముఖులకు తెలుగు భాషా పురస్కారాలు-2026 అందజేశారు. పురస్కార గ్రహీతలకు ప్రశంసాపత్రం, జ్ఞాపికతోపాటు రూ. 25,000 నగదు బహూకరించారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన అనంతరం ప్రజలు మాట్లాడే భాషకు విద్యా సాహిత్య రంగాల్లో సమచిత స్థానం కల్పించేందుకు కృషి చేసిన గిడుగు రామమూర్తి పంతులు చిత్రపటానికి పూలమాల వేసి ఘన

>>2



శనివారం ప్రయాగ్‌రాజ్‌లో భారీ వర్షాల కారణంగా ఏర్పడిన లోతైన గుంతలో స్వామి నారాయణ ఆలయ ప్రాంగణంలోని కొంతభాగం కూలిపోయిన తర్వాత అక్కడ మిగిలిన శిథిలాల దృశ్యం

# నేపాల్‌కు తొలగని ముప్పు!

>> స్పష్టమైన ఉపగ్రహ చిత్రాల్లో ఆ సరస్సు నేపాల్‌టిబెట్ సరిహద్దుకు సమీపంలోని ఎత్తైన లెండే ఖోలా ప్రాంతంలో ఉన్నట్లు సంస్థ తెలిపింది. సుమారు 20.25 హెక్టార్ల విస్తీర్ణంలో కొత్త నీటి మడుగు కనిపించిందని సుహోరా పేర్కొంది. ఈనెల 26న సంభవించిన వరదలతో ఈ కొత్త సరస్సు పరిణామాన్ని నిశితంగా గమనించాల్సిన అవసరం ఉందని చెప్పింది. దాని విస్తీర్ణం, స్థిరత్వాన్ని ఉపగ్రహ చిత్రాల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తామని చెప్పుకొచ్చింది.

నేపాల్‌ను అతలాకుతలం చేసిన భారీ ఆకస్మిక వరదలు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. వరదల కారణంగా మృతుల సంఖ్య 700 దాటింది. మరో 2,500 మందికి పైగా ఆచూకీ లేకుండా పోయారు. దీంతో సహాయక చర్యలకు మరో పెద్ద సమస్య ఎదురైంది. వరదల్లో మరణించిన వారి మృతదేహాలను భద్రపరిచేందుకు దేశంలోని మార్చురీల్లో సరిపడా స్థలం లేకపోవడంతో అధికారులు తాత్కాలిక ఏర్పాట్లు చేస్తున్నారు. భారత్, చైనా మధ్య ఉన్న భూపరివేష్టిత దేశమైన నేపాల్‌లోని మార్చురీలన్నింటి కలిపి సామర్థ్యం సుమారు 350 మృతదేహాలు మాత్రమే. మృతుల సంఖ్య ఇప్పటికే 600 దాటడంతో ఆసుపత్రులు, మార్చురీలు మృతదేహాలను భద్రపరచడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.

వరదల తర్వాత కూడా 2,500 మందికి పైగా గల్లంతైనవారు ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. గల్లంతైన వారి కుటుంబ సభ్యులు వచ్చి తమ బంధువులను గుర్తించే వరకు మృతదేహాలను భద్రపరిచేందుకు ప్రభుత్వం తాత్కాలిక కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. నేపాల్ పోలీస్ ఎస్పీ రమేశ్వర్ పౌడెల్ తెలిపిన వివరాల ప్రకారం, సహాయక బృందాలు మృతదేహాలను వెలికితీసిన వెంటనే వాటి క్లోజ్‌అప్ ఫొటోలను తీస్తున్నారు. మృతదేహం స్పష్టంగా కనిపించకపోతే ముందుగా శుభ్రం చేసి, అనంతరం బాడీ బ్యాగ్‌కు ప్రత్యేక గుర్తింపు ట్యాగ్‌ను అమర్చుతున్నారు. ఆ తర్వాత వాటిని తాత్కాలిక భద్రపరిచే కేంద్రాలకు తరలిస్తున్నారు. ఈ తాత్కాలిక కేంద్రాల్లో ఉష్ణోగ్రతను సుమారు 0 డిగ్రీల వద్ద ఉంచేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

**కుటుంబ సభ్యులకు ఫొటోలు చూపించి గుర్తింపు**

గల్లంతైన వారి బంధువులు సమాచారం కోసం వచ్చినప్పుడు, ఇప్పటివరకు వెలికితీసిన మృతదేహాల ఫొటోలను వారికి చూపిస్తున్నారు. కుటుంబ సభ్యులు తమ బంధువును గుర్తిస్తే, అవసరమైన అధికారిక ప్రక్రియలను పూర్తి చేసిన అనంతరం మృతదేహాన్ని వారికి అప్పగిస్తున్నారు. మృతదేహాల గుర్తింపులో ఇబ్బందులు ఎదురవుతున్న కారణంగానే ఈ విధానాన్ని అనుసరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ముఖం గుర్తింపు సాధ్యం కాని మృతదేహాల విషయంలో పోలీసులు ఇప్పుడు వేలిముద్రలు, డిఎన్ఎ నమూనాలను సేకరిస్తున్నారు. బంధువులు వెంటనే గుర్తించలేని పరిస్థితుల్లో కూడా భవిష్యత్తులో శాస్త్రీయ పద్ధతుల ద్వారా మృతదేహాలను గుర్తించేందుకు ఈ నమూనాలు ఉపయోగపడతాయి. కాస్కి జిల్లా పోలీస్ చీఫ్ నబిన్ కార్కి ప్రకారం, బంధువులు లభించకపోయినా లేదా మృతదేహాన్ని గుర్తించలేకపోయినా వాటిని నిరవధికంగా ఉంచడం సాధ్యం కాదు. అందుకే ముందుగానే వేలిముద్రలు, డిఎన్ఎ నమూనాలు సేకరించి, మార్గదర్శకాల ప్రకారం స్థానిక అధికారుల సహకారంతో మృతదేహాలను ట్యాగ్‌లతో నిర్దేశిత ప్రదేశాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# పంచసూత్ర ప్రణాళిక

>> 150 వాహనాలతో ఎమర్జెన్సీ లైఫ్‌లైన్ నెట్‌వర్క్ ఉందన్నారు. ప్రతి గిరిజన బిడ్డ అందరిలా ఆరోగ్యంగా ఎదగాలి...అందుకే సంజీవని తెచ్చామన్నారు.గిరిజన ప్రాంతాల్లో ప్రతి కుటుంబ జీవన ప్రమాణాలు మెరుగుపడాలి. అదే నిజమైన అభివృద్ధి అన్నట్టు.గిరిజన ప్రాంతాలకు మంచి వైద్య సేవలు అందేలా రూ.250 కోట్లతో ట్రైబల్ హెల్త్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కంప్లీషన్ మిషన్ తెస్తున్నామన్నారు. సికిల్ సెల్, తలసేమియా బాధితులకు నెలకు రూ.10,000 పెన్షన్ అందిస్తున్నామని,గిరిజన బిడ్డలు దేశంలోని అత్యుత్తమ విద్యాసంస్థల్లో చదవాలి. అందుకే ఐఐటి మద్రాస్‌తో ఒప్పందం చేసుకున్నామన్నారు.

గిరిజన రైతులు తమ ఉత్పత్తితో ప్రపంచ స్థాయి బ్రాండ్ సృష్టించాలన్నదే మా ప్రభుత్వ ఆలోచన సిఎం చంద్రబాబు అన్నారు. త్వరలో రాష్ట్రంలోని అన్ని మండలాల్లో తక్కువ ధరకే మందులు ఇచ్చే జన ఔషధి కేంద్రాలు ప్రారంభిస్తామని అయన అన్నారు. 104 సర్వీసుల ద్వారా మీ ఇంటి దగ్గరే 42 రకాల వైద్య పరీక్షలు చేసి మీకు అవసరమైన మందులు ఇస్తారు.సెప్టెంబరు 2 తేదీన అనకాపల్లికి పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి నీరు తీసుకువస్తున్నామన్నాడు.తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడే డిఎస్సీ ద్వారా పెద్ద ఎత్తున ఉద్యోగాలు ఇచ్చామని తొలి సంతకంతో 16 వేల ఉద్యోగాలు ఇస్తే లేని పోని ఆరోపణలు చేస్తున్నారనీ చంద్రబాబు విమర్శించారు. గత పాలకులు రాష్ట్రాన్ని విధ్వంసం చేసి వ్యవస్థల్ని అస్తవ్యస్తం చేశారు. జే బ్రాండ్ల ద్వారా, కల్తీ మద్యం ద్వారా కొన్ని వేల మందిని పొట్టన పెట్టుకున్నారు. అందరి ఆరోగ్యాన్ని నాశనం చేశారు. జే బ్రాండ్లను రద్దు చేసి మద్యం విధానాన్ని ప్రక్షాళన చేశామన్నారు.

గతంలో గంజాయి ద్వారా ఏజెన్సీ ప్రాంతానికి చెడ్డ పేరు తెచ్చారనీ ఇప్పుడు దానిని మార్చేలా కాఫీ, మిరియాలు లాంటి ప్రత్యామ్నాయ పంటల ద్వారా గిరిజనులకు ఆదాయ మార్గాలు చూపామన్నారు. గ్రూప్ 1 పరీక్షల్లోనూ గత పాలకులు అవకతవకలు చేశారనీ సిఎం ఆరోపించారు.ఆర్డీఓ స్థాయి అధికారులను ఎంపిక చేసే పరీక్షా పత్రాలను ఓ ఎలక్ట్రీషియన్, ఓ అటెండర్ చేత దిద్దించారు. గ్రూప్ 1 పరీక్షలు రాసిన అభ్యర్థుల జీవితాలతో ఆడుకున్నారు. గత పాలనలో దేవాలయాల ప్రతిష్టను కూడా దెబ్బతీశారు. బలవంతపు మత మార్పిడులు చేశారు. ఓ మాజీ మంత్రి కోడలు కూడా బయటకు వచ్చి ఇంట్లో జరిగిన ఘటనల్ని బయటపెట్టిందన్నారు.బలవంతంగా మతమార్పిడి చేయించే ప్రయత్నం చేశారని చెప్పిందనీ చంద్రబాబు గుర్తు చేశారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా నేషనల్ హెల్త్ మిషన్, 15వ ఆర్థిక సంఘం, ప్రధాని ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ మిషన్ల కింద 1,200 కోట్లతో 4,500 ఆరోగ్య మందిర్ల నిర్మాణాన్ని వేగవంతం చేశామన్నారు.

గిరిజన గ్రామాల నుంచి రక్తం, థైరాయిడ్, కామెర్లు తదితర పరీక్షల శాంపిల్స్‌ను చింతపల్లి, పాడేరు వంటి దూర ప్రాంతాలకు తీసుకెళ్లే అవసరం లేకుండా నేరుగా గ్రామాలకే ఆసుపత్రి సేవలందించేందుకు డ్రోన్ సాంకేతికతను అనుసంధానించామని చెప్పారు. డ్రోన్ల ద్వారా శాంపిల్స్ సేకరించి, పరీక్షలు నిర్వహించి, డిజిటల్ రిపోర్టులను నేరుగా గిరిజనుల వాట్సాప్‌కే పంపే దిశగా ఆధునిక సాంకేతికతను ఉపయోగిస్తున్నామన్నారు. గిరిజన ప్రాంతాల్లో గర్భిణులు, బాలింతల సౌకర్యార్థం డకోటా వాహనాల స్థానంలో 500 కొత్త బ్రాండ్ న్యూ 'తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్' వాహనాలను ఇటీవల ప్రారంభించినట్లు తెలిపారు. సకల సౌకర్యాలతో కూడిన ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి,జిల్లా కలెక్టర్ టి.నిశాంతి, ఆర్టీసీ చైర్మన్‌దొన్ను దొర,జిసిసి చైర్మన్ కిడారీ శ్రావణ్ కుమార్, తణుకు ఎమ్మెల్యే రాధాకృష్ణ,వివిధ శాఖల అధికారులు,టిడిపి ప్రజాప్రతినిధులు,వేలాది సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.

# వడివడిగా ఇన్నర్ రింగ్‌రోడ్డు

>> రణ పూర్తయితే పల్నాడు ప్రాంతం నుంచి వచ్చే ప్రజలకు ఇన్నర్ రింగ్ రోడ్ ద్వారా నేరుగా అమరావతికి మెరుగైన కనెక్టివిటీ అందుబాటులోకి వస్తుందని చెప్పారు. ఈ అదనపు విస్తరణకు సుమారు రూ.15 నుంచి 20 కోట్ల అదనపు వ్యయం అవుతుందని అంచనా వేస్తున్నామని, ఇందుకు ముఖ్యమంత్రికి ఇప్పటికే లేఖ రాసినట్లు తెలిపారు. అయితే ఈ అదనపు పనులకు ఇంకా ఆమోదం లభించలేదని స్పష్టం చేశారు. రహదారికి అవసరమైన డ్రైనేజ్ కవర్లు, సెంటర్ లైటింగ్ వంటి అదనపు సదుపాయాలకు కూడా అదనపు అంచనాలు అవసరమవుతున్నాయని పేర్కొన్నారు. ఇన్నర్ రింగ్ రోడ్ అభివృద్ధి పూర్తయిన వెంటనే చుట్టుపక్కల ప్రాంతాల్లో అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని తెలిపారు. ఇప్పటికే గత ఐదు ఆరు నెలల్లో కొత్త అపార్ట్‌మెంట్లు, ఇతర నిర్మాణాలు రావడం ప్రారంభమయ్యాయని, దీంతో ఈ ప్రాంతంలోని భూముల విలువలు కూడా పెరుగుతున్నాయని చెప్పారు. రాబోయే రెండు మూడు సంవత్సరాల్లో అభివృద్ధి కార్యకలాపాలు మరింత పెరిగితే గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు ఆదాయం పెరగడంతో పాటు సిఆర్‌డిఎ ద్వారా కూడా మరిన్ని అభివృద్ధి అవకాశాలు ఏర్పడతాయని తెలిపారు. సిఎం చంద్రబాబు నాయుడు సహకారంతో, కార్పొరేషన్ మరియు సిఆర్‌డిఎ వనరులను సమన్వయం చేసుకుంటూ ఇన్నర్ రింగ్ రోడ్‌ను సాధ్యమైనంత అద్భుతంగా పూర్తి చేసి, గుంటూరు నగరంతో పాటు అమరావతి, పల్నాడు ప్రాంతాలకు మెరుగైన కనెక్టివిటీ కల్పించేందుకు కృషి చేస్తామని డా. పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.



శనివారం చంద్రబాబు 'సంజీవని' పథకం బహిరంగ సభకు భారీగా తరలి వచ్చిన ప్రజలు

# రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖలో నలుగురు ఉద్యోగులు డిస్మిస్

**విజయవాడ,ఆగస్టు 29,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖలో పెను సంచలనం చోటు చేసుకుంది. అవినీతి అరోపణలు రుజువు కావడంతో అప్పటి డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ (స్టేట్ టాక్స్) కె.సంధ్య, గూడ్స్ సర్వీసు టాక్స్ అధికారి బి.మెహర్ కుమార్, సీనియర్ ఆసిస్టెంట్ కె.వి.చలపతిలను సర్వీసు నుంచి డిస్మిస్ చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు వెలువరించింది. వాణిజ్య పన్నుల శాఖ విజయవాడ1 డివిజన్, జాయింట్ కమిషనర్ (రాష్ట్ర పన్నులు) కార్యాలయంలోని ఇంటెలిజెన్స్ విభాగంలో పనిచేసిన సమయంలో 2023లో ఈ అధికారులు, సిబ్బంది అవినీతి బయటపడింది. వీరిని ఉద్యోగాల నుంచి డిస్మిస్ చేస్తూ రెవెన్యూ విజిలెన్స్ శాఖ ముఖ్యకార్యదర్శి పియూష్ కుమార్ ఉత్తర్వులు ఇచ్చారు.

# తెలుగులోనే ఇక ఉత్తర్వులు

>> వ్యవహారాల్లో ఆంగ్ల భాషకు అధిక ప్రాధాన్యత ఉండటంతో సామాన్య ప్రజలు, అర్జీదారులు తమ కేసులకు సంబంధించిన తీర్పులు, ఉత్తర్వులను స్వయంగా చదివి అర్థం చేసుకోవడం అనేక సందర్భాల్లో కష్టంగా మారుతోందని, ఈ నేపథ్యంలో తెలుగు భాషలో ఉత్తర్వులు అందుబాటులోకి వస్తే, నా కేసులో ఏం జరిగింది? ఏ నిర్ణయం తీసుకున్నారు? అధికారులకు ఏ ఆదేశాలు ఇచ్చారు? అనే విషయాలను అర్జీదారులు స్వయంగా తెలుసుకునే అవకాశం కలుగుతుందని గాజుల అదెన్న అన్నారు.ఇది కేవలం భాషకు సంబంధించిన అంశం మాత్రమే కాదని, పారదర్శకత, జవాబుదారీతనం, పౌర సాధికారతకు సంబంధించిన అంశమని గాజుల ఆదెన్న పేర్కొన్నారు. ఆగస్టు 29న తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా తెలుగులో మాట్లాడతాం.. మన తెలుగు భాషను కాపాడుకుందాం అని ప్రతిజ్ఞ చేయించాలని గాజుల ఆదెన్న విజ్ఞప్తి చేశారు. ఇతర భాషలు నేర్చుకుందాం.. కానీ తెలుగును మరిచిపోవద్దు తెలుగు భాషలో పుట్టి పెరిగిన మనమే నేడు ఆంగ్ల భాషకు అధిక ప్రాధాన్యత ఇస్తూ మాతృభాషను విస్మరిస్తున్న పరిస్థితి బాధాకరమని గాజుల ఆదెన్న అన్నారు.

ఇటీవల కొన్ని ఉత్తర్వులను తెలుగులో ఇచ్చామన్నారు. అప్పీలు సంఖ్య 2263/ఎస్ ఐ సిజి ఏ/ఏపీ ఐ సి/2025లో అప్పీలుదారు తన అప్పీలును ఉపసంహరించుకున్నట్లు తెలియజేయడంతో అప్పీలును ముగిస్తూ తెలుగులో తీర్పును ఇచ్చారు. అదేవిధంగా అప్పీలు సంఖ్య 7366/టి ఎస్ ఐ సి/2018/టి సి6626/2021లో అప్పీలుదారు కోరిన సమాచారంపై పిఐఒకు ఆదేశాలు జారీ చేసి, అనంతరం సమాచారం అందించినట్లు సమర్పించిన పత్రాలను పరిశీలించిన తరువాత అప్పీలును ముగిస్తూ తెలుగులోనే తీర్పును ఇచ్చారు.ఈ ఉత్తర్వులు తెలుగులో అందుబాటులో ఉండటం వల్ల సమాచార హక్కు కోసం పోరాడుతున్న సామాన్య పౌరులు తమ కేసులో తీసుకున్న నిర్ణయాన్ని ఎటువంటి అనువాదం లేదా ఇతరుల వివరణ అవసరం లేకుండా స్వయంగా చదివి తెలుసుకునే అవకాశం పొందుతున్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా తెలుగు భాష అమలు కోసం తన వంతుగా కృషి చేస్తానని ఆయన అన్నారు.

# తాష్కెంట్‌లో ప్రధాని మోడీ

>> విటీ, ఇంధనం, విద్య, ప్రజల మధ్య సంబంధాలపై చర్చించే అవకాశం ఉంది. భవిష్యత్‌లో భారత్ -ఉజ్బెకిస్థాన్ సహకారాన్ని మరింత విస్తరించేందుకు కార్యాచరణ ప్రణాళికపై కూడా ఇరువురు నేతలు చర్చించనున్నారు. ఇటీవలి సంవత్సరాల్లో భారత్-ఉజ్బెకిస్థాన్ వ్యూహాత్మక భాగస్వామ్యంలో గణనీయమైన పురోగతి సాధించామనిమోడీ అన్నారు. వాణిజ్యం, పెట్టుబడులు, డిజిటల్ కనెక్టివిటీ, రక్షణ, ఇంధన రంగాల్లో సహకారాన్ని మరింత పెంచడంపై మిర్జియోయెవ్‌తో చర్చలు జరుపుతామని తెలిపారు. వికసిత్ భారత్, యాంగీ ఉజ్బెకిస్థాన్ లక్ష్యాల విషయంలో ఇరు దేశాల ఉమ్మడి దృక్పథాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ఈ పర్యటన ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. తాష్కెంట్ చేరుకున్న అనంతరం మోడీ యాంగీ ఉజ్బెకిస్థాన్ పార్క్‌ను సందర్శించారు. అక్కడి స్వాతంత్ర్య స్మారకం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళుల ర్పించారు. అధ్యక్షుడు మిర్జియోయెవ్ కూడా మోడీ వెంట ఉన్నారు. ఉజ్బెకిస్థాన్ స్వాతంత్రం సాధించి 30 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈస్మారకాన్ని ఏర్పాటుచేశారు.

మోడీ తనపర్యటనలో భాగంగా తాష్కెంట్లోని శాస్త్రి స్మారకాన్ని, తాష్కెంట్ స్టేట్ యూనివర్సిటీ ఆఫ్ ఓరియంటల్ స్టడీస్‌లోని మహాత్మా గాంధీ కేంద్రాన్ని కూడా సందర్శించనున్నారు. ఉజ్బెకిస్థాన్‌లో రెండు రోజుల పర్యటనను ముగించుకున్న అనంతరం 30న ప్రధాని మోడీ కిర్గిజిస్థాన్ రాజధాని బిష్కెక్‌కు వెళ్లనున్నారు. అక్కడ జరిగే 26వ షాంఘై సహకార సంస్థ సదస్సులో పాల్గొంటారు. ఆగస్టు 30 నుంచి సెప్టెంబర్ 1 వరకు ఈ సదస్సు జరగనుంది. ఎస్‌సిఓ ఏర్పాటై 25 యేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ సమావేశం జరుగుతోంది. భారత్ 2017 నుంచి ఎస్సీవోలో పూర్తి స్థాయి సభ్యదేశంగా కొనసాగుతోంది. ఎస్‌సిఓ సదస్సులో భారత్ తన భద్రత, కనెక్టి విటీ, అవకాశాలు అనే దృక్పథాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తుందని మోడీ తెలిపారు. ఉగ్ర వాదం, వేర్పాటువాదం, తీవ్రవాదానికి తావులేని ప్రాంతం కోసం సభ్యదేశాలతో కలిసి పనిచేయడమే భారత్ లక్ష్యమని పేర్కొన్నారు. బిష్కెక్‌లో కిర్గిజిస్థాన్ అధ్యక్షుడు సదీర్ జపరోవ్‌తో మోడీ ద్వైపాక్షిక సమావేశం నిర్వహించనున్నారు. ఇతర ఎస్సీవో దేశాల నేతలతోనూ ఆయన భేటీ అయ్యే అవకాశం ఉంది. అలాగే 6వ వరల్డ్ నోమాడ్ గేమ్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలోనూ ప్రధాని పాల్గొననున్నారు.

# చెంచుల అభివృద్ధికి చర్యలు

>> తున్న పలు ప్రాజెక్టుల ప్రస్తుత స్థితిపై కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు శనివారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ఈ సమీక్షలో వివిధ శాఖల అధికారులు, గుత్తేదారులు, పలు ప్రాజెక్టుల అధికారులు భాగస్వామ్యం అయ్యారు. ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా సిఎస్ఆర్ నిధులతో శ్రీకాకుళం నగరంలో గుణపాలెం, హుడ్కో కాలనీ, ఎపిజె అబ్దుల్ కలాం పార్క్, ఆర్కె నగర్ పార్క్‌ల ప్రస్తుత స్థితిని అడిగి తెలుసుకున్నారు. కోల్ ఇండియా సంస్థ సి.ఎస్.ఆర్ నిధులతో ఇచ్ఛాపురం, పాతపట్నంలలో నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియంలు, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా సి.ఎస్.ఆర్ నిధులతో జిల్లా కేంద్ర లైబ్రరీ నిర్మాణ పనులు, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా సి.ఎస్.ఆర్ నిధులతో ఆముదాలవలస, మందసలలో నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియంల గురించి ప్రస్తుత పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

ప్రభుత్వ సబ్సిడీ కార్యక్రమాలు, బ్యాంక్ రుణాలు, కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలను సమన్వయం చేసుకుని ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు పూర్తి తోడ్పాటు అందివ్వాలని స్పష్టం చేశారు. కొత్త పారిశ్రామిక వేత్తలను తయారు చెయ్యడం, వ్యాపారంపై అవగాహన కల్పించడం, ఉపాధి అంటే ఉద్యోగమే కాదు అనే అపోహను యువతలో తొలగించడం అనే అంశాలను ఎంచుకుని భవిష్యత్‌లో ఈ కార్యక్రమాన్ని ప్రాచుర్యంలోకి తీసుకురానున్నట్లు రామ్మోహన్ నాయుడు తెలిపారు. అరసవల్లి పుష్కరిణీ అభివృద్ధి కార్యక్రమాలపై ఆరా తీశారు. కోడి రామ్మూర్తి స్టేడియం ఫేజ్ 1 పనుల గురించి ఆరా తీశారు. ఇవి డిసెంబర్ 31తేదీకి పూర్తి చేస్తామని అధికారులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, శిక్షణ కలెక్టర్ హరి ఓం పాండియా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నేపాల్ వెళ్లిన 13 మంది ఆంధ్రప్రదేశ్ వాసుల ఆచూకీ గల్లంతు

**విజయవాడ,ఆగస్టు29,ప్రభాతవార్తప్రతినిధి:** నేపాల్,టిబెట్ వరదల్లో మృతుల సంఖ్య పెరుగుతోంది. నేపాల్ -టిబెట్ సరిహద్దు ప్రాంతాలను అతలాకుతలం చేస్తున్న వరదల్లో మృతుల సంఖ్య 633కు చేరింది. మరో 3 వేలమంది గల్లంతైనట్లు నేపాల్ అధికారులు వెల్లడించారు. గల్లంతైన వారిలో 517 మంది విదేశీయులు ఉండగా, వారిలో 320 మంది భారతీయులు ఉన్నట్లు గుర్తించారు. నేపాల్ పర్యటనకు వెళ్లిన 13 మంది ఆంధ్రప్రదేశ్ వాసుల ఆచూకీ గల్లంతయ్యారు. ఇప్పటివరకు వరదల నుంచి 3,700 మందిని సహాయ సిబ్బంది రక్షించారు. సహాయ చర్యల్లో 11 వేల మంది భద్రతా సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు. విదేశీ బృందాల సాయంతో నేపాల్ ప్రభుత్వం సహాయ చర్యలను ముమ్మరం చేసింది. నేపాల్ వరద బాధిత ప్రాంతాలకు సహాయ సామగ్రిని భారత్ పంపిస్తోంది.

# స్థానిక పోరుకు జనసేన సిద్ధం

>> పిలుపు మేరకు యువత, మహిళలు ముందుకు వచ్చి కష్టాల కోర్చి ఎన్నికల్లో నిలబడి, ప్రజాస్వామ్య విలువలను నిలబెట్టారు. స్థానిక ఎన్నికల్లో నిలబడ్డాం.. కలబడ్డాం.. జనసేన పార్టీ బలం గురించి మాట్లాడే ప్రతి ఒక్కరికీ చెబుతున్నదొక్కటే. మేం లొంగిపోలేదు. పోటీకి గైర్హాజరు కాలేదు. మేం నిలబడ్డాం. కలబడ్డాం. ప్రజాస్వామ్యాన్ని బతికించుకునేందుకు కదం తొక్కాం. పవన్ కల్యాణ్ పోరాట స్ఫూర్తి మనం అందిపుచ్చుకున్నాం. అదే స్ఫూర్తి నేడు రాష్ట్రంలో అద్భుతమైన పరిపాలన తీసుకొచ్చింది. వైసీపీని అధఃపాతాళానికి తొక్కుతామని, రాష్ట్రంలో ప్రజాస్వామ్య పునరుద్ధరణ చేస్తామని చెప్పిన మాటను ప్రజలు నిజం చేశారు. ఆశీర్వదించారు. ఉద్దానం నుంచి ఇసుక కొరతతో ఇబ్బందులుపడుతున్న భవన నిర్మాణ కార్మికుల కోసం, మత్స్యకారుల జీవనానికి శాపంగా నిలిచిన 217 జీవో రద్దు చేయాలని మత్స్యకార భరోసా యాత్ర చేసిన అండగా నిలిచాం. రోడ్ల సమస్య మీద కానీ, ఆత్మహత్యలు చేసుకున్న కౌలు రైతులకు సహాయం చేసే విషయంలోగానీ జనసేన పార్టీ రాజకీయాలకు అతీతంగా ముందుకు వెళ్లింది. రాబోయే రోజుల్లో ఎలా స్థానిక సంస్థలకు సిద్ధమవుదాం అని ఇటీవల జరిగిన సమావేశంలో పవన్ కల్యాణ్ చెప్పింది ఒక్కటే. జనసైనికుల పోరాట స్ఫూర్తిని కొనసాగించేలా, వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టేలా స్థానిక సంస్థల ఎన్నికల్లో ముందుకు వెళ్దామని నిర్ణయించారు. పొత్తులో ఉన్నపుడు కొన్ని విషయాల పట్ల కొన్ని నిర్ణయాలు ఉంటాయి. మనం ఎక్కడ బలంగా ఉన్నామనేది కచ్చితంగా స్థానిక నాయకత్వం తెలుసుకోవాలి. మన బలం ఎంత..? దానికి గల కారణాలు..? సామాజిక అంశాలు, స్థానిక సమస్యలపై ప్రత్యేకంగా ఫోకస్ చేయండి. అక్కడి మన బలాబలాలపై ప్రత్యేకంగా నివేదికలు తెప్పించుకోండి. సర్వేలు చేయించండి. కచ్చితంగా బలంగా ఉన్న చోట మనం పోటీ చేస్తే గెలిచేలా వ్యూహాలు రూపొందించుకోవాలి.

జనసేన పార్టీ యువత కోసం మరో అద్భుతమైన వేదికను తీసుకురాబోతోంది. పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినం సెప్టెంబర్ 2వ తేదీన జనసేన పార్టీ యువజన విభాగాన్ని మొదలుపెట్టబోతున్నాము. సెప్టెంబర్ 2వ తేదీన ప్రతి నియోజకవర్గంలో జనసేన పార్టీ యువజన విభాగం ఆవిష్కరణ చేయబోతున్నాం. యువతను పార్టీలోకి తీసుకురావాలి. స్వచ్ఛమైన రాజకీయాలు చేయాలి. వారికి మంచి వేదికను ఇవ్వాలనే బలమైన లక్ష్యంతో యువజన విభాగం పనిచేస్తుంది. యువత సమస్యలు, వారి రాజకీయ ఆకాంక్షలు, ఆలోచనలకు ప్రతీకగా యువజన విభాగం నిలుస్తుంది. యువజన విభాగం ఏర్పాటుకు సంబంధించి ప్రతి నియోజకవర్గం, మండలం, గ్రామస్థాయిల్లో ర్యాలీలు, ఆవిష్కరణలు చేయాలి. దేశమే ఫస్ట్.. మిగిలినవన్నీ నెక్స్ట్ అనే తరహాలో యువజన విభాగం సేవలు విస్తృతం చేయాలనేది పవన్ కల్యాణ్ ఆలోచన. యువత రాజకీయాల్లోకి రావలసిన అవసరాన్ని గుర్తించి వారి కోసం బలంగా ఈ విభాగం పనిచేస్తుంది. 2029 ఎన్నికల్లో జనసేన పార్టీ మరింత బలంగా ముందుకు వెళ్లాలి. ప్రతి ఒక్కరూ నాయకత్వ నైపుణ్యాలు పెంపొందించుకోవాలి. ఒక దేశ ప్రధాని స్వయంగా పవన్ కల్యాణ్ ఇంటికి వెళ్లి పరామర్శించారు అంటే మన పార్టీ అధ్యక్షుడికి కేంద్ర నాయకత్వం ఇచ్చే గౌరవాన్ని మనం అర్థం చేసుకోవాలి. సోషల్ మీడియాను మంచి కోసం, మంచి పనిని పదిమందికి తెలియజేయడం కోసం ఉపయోగించుకోండి. స్థానిక సంస్థల ఎన్నికలు అంటే వీధి పోరాటాలు, రాజకీయాలు, చైతన్యం. మన ప్రాంతంలో జరిగే రాజకీయ పోరు. దీనిలో జనసేనను అత్యున్నతంగా నిలబెట్టేలా మనమంతా కలిసికట్టుగా పనిచేద్దాం అన్నారు.ఈ సమావేశంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎంపీలు వల్లభనేని బాలశౌరి, లింగమనేని రమేష్,టి ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# తెలుగు భాష పరిరక్షణకు ప్రాధాన్యం

>> నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. గ్రంథాలకే పరిమితమైన తెలుగును ప్రజాక్షేత్రంలోకి తెచ్చిన మహోన్నతుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు అని కొనియాడారు. కందుకూరి, గురజాడ, గిడుగుల కృషి వల్లే వ్యావహారిక భాష ఉద్యమం రూపుదిద్దుకుందన్నారు. సవర భాషకు లిపిని రూపొందించి, బ్రిటిష్ ప్రభుత్వం తనకు ఇచ్చిన పారితోషికాన్ని సైతం ఆదివాసీల విద్యాభివృద్ధికి వెచ్చించిన త్యాగధనుడు, సంఘసంస్కర్త గిడుగు అని గుర్తుచేశారు. తెలుగు భాషా పురస్కారాల ఎంపికకు సంబంధించిన జి.ఒ ను కూడా తెలుగులోనే జారీ చేయడం కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌లు మాతృభాషకు పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. ప్రతి జిల్లాలో వ్యావహారిక భాషా సంఘాల ఏర్పాటుకు సాంస్కృతిక శాఖ తరఫున పూర్తి సహకారం ఉంటుందని, ఈ దిశగా చర్యలు తీసుకోవాలని అధికార భాషా సంఘం చైర్మన్‌కు సూచించారు. ప్రతి ఏటా ఉగాది, కందుకూరి, తెలుగు భాషాపురస్కారాలను క్రమం తప్పకుండా ప్రదానం చేస్తామని వెల్లడించారు.పర్యాటక సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి షంషేర్ సింగ్ రావత్ మాట్లాడుతూ.. ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్‌గా గుర్తింపు పొందిన తెలుగు భాషకు అగ్రతాంబూలం ఇవ్వాల్సిన ఆవశ్యకత ఉందని పేర్కొన్నారు. మండలి వెంకటకృష్ణారావు అధికార భాషా సంఘం చైర్మన్ పూల త్రివిక్రమ్ రావు మాట్లాడుతూ.. వాడుక భాషా పరివ్యాప్తికి గిడుగు రామమూర్తి పంతులు తమ జీవితాన్ని ధారపోశారన్నారు.కందుకూరి, గురుజాడ, గిడుగులతో పాటు సిపి బ్రౌన్, పొట్టి శ్రీరాములు, ఎన్టీఆర్ వంటి మహనీయులు తెలుగుకు అందించిన సేవలు అనన్యమైనవనిగుర్తుచేశారు. 'ఐ లవ్ విజయవాడ' వంటి నామఫలకాలు తెలుగులోనే ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరినట్లు వెల్లడించారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ ప్రాంతంలో పని చేస్తుండటం వల్ల తనకూ తెలుగు భాషపై గౌరవం మరింత పెరిగిందన్నారు. గిడుగు రామమూర్తి పంతులు సాగించిన వ్యావహారిక భాషా ఉద్యమ ఫలితంగానే నేడు సామాన్య ప్రజలకు కూడా భాష ఎంతో చేరువైందని కొనియాడారు.సాంస్కృతిక సృజనాత్మక సమితి చైర్ పర్సన్ తేజస్వి పొడపాటి మాట్లాడుతూ.. తెలుగు భాషా పరిరక్షణకు, ఉనికికి కృషి చేసిన మహనీయుల చరిత్రను భావితరాలకు అందించాలని కోరారు. భాషా వికాసానికి కృషి చేస్తున్న సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, మంత్రి కందుల దుర్గేష్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ మాట్లాడుతూ.. తెలుగు భాషకు పూర్వవైభవం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. నాటకరంగం ద్వారానే భాష ప్రజల హృదయాలకు మరింత చేరువైందని, త్వరలోనే నంది నాటకోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు.

ఈ వేడుకలో గిడుగు వేంకట రామమూర్తి పంతులు మునిమనవడు నాగేశ్వర రావు రచించిన కావ్య మల్లికలు పుస్తకాన్ని మంత్రి కందుల దుర్గేష్ ఆవిష్కరించారు. తెలుగు భాషాపురస్కారాలు అందుకున్న జంధ్యాల కనకదుర్గ, చందలూరి నారాయణరావు, యు.భూదేవి, కె.పుష్ప, ముత్తేవి రవీంద్రనాథ్, బాలాంతపు వెంకట రమణ, అబ్దుల్ హకీమ్ జాని, ఎస్.వి. రాఘవేంద్రరావు, పి.విజయ్ కుమార్, బొగ్గవరపు మాల్యాద్రి, చిలుకూరి శ్రీనివాసరావు, నాగసూరి వేణు గోపాలరావు, జంధ్యాల శరత్‌బాబు, కోయి కోటేశ్వరరావు, కే.వి.ఎల్.ఎన్. శర్మ, ఎం.రామకృష్ణ, వివిఐటియు పుస్తక ప్రచురణ సంస్థ, వేమూరి శ్రీనివాస్, కొల్లి రమావతి లు మాట్లాడుతూ..భాషా వికాసానికి కృషి చేస్తున్న తమను గుర్తించి పురస్కారాలు అందజేసిన మంత్రి కందుల దుర్గేష్‌కు, కూటమి ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అంతకుముందు కళావేదికకు విచ్చేసిన మంత్రి కందుల దుర్గేష్ కు వివిధ జానపద నృత్యాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కళా వేదిక ప్రాంగణంలో ఏర్పాటుచేసిన తెలుగు తల్లి విగ్రహానికి మంత్రి కందుల దుర్గేష్ పూలమాలవేసి నమస్కరించారు20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్, జానపద అకాడమీ చైర్మన్ వంపూరు గంగులయ్య, రాష్ట్ర సాంఘిక సంక్షేమ బోర్డు చైర్మన్ పోతుల బాలకోటయ్య, గిడుగు వెంకట రామమూర్తి పంతులు ముని మనవడు నాగేశ్వరరావు తెలుగు భాషాభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## వారం - వర్జ్యం

30-08-2026, ఆదివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, కృష్ణపక్షం, మఖకార్తె
తి.విదియ ఉ.9.35
న.ఉత్తరాభాద్ర రా.3.44
వ.మ.1.18-మ.2.54
దు.సా.4.38-సా.5.28
రాహు. సా.4.30-సా.6.00
శుభ ఉ.8.00-ఉ.9.00

## వార్తాఫలం

**మేషం :** వైద్యుని మార్పు చేయడం వలన లాభపడ గలుగుతామని భావిస్తారు. ఆధ్యాత్మిక భావాలు కలిగి ఉంటారు.

**వృషభం :** సుపరిచితులు కొందరు మీ సహాయాన్ని అర్థిస్తారు. ప్రతివారిని అనుమానాస్పద దృష్టితో చూస్తారు.

**మిథునం :** వృత్తి, ఉద్యోగాల పరంగా మీ కృషికి తగినటువంటి మంచి ఫలితాలను అందుకోగలుగుతారు. వాహన సౌఖ్యం.

**కర్కాటకం :** అన్ని రంగాల వారికి గతంలో కంటే నేడు ఎంతో కొంత ప్రోత్సాహం లభిస్తుంది. ఆరోగ్యం సాధారణంగా ఉంటుంది.

**సింహం :** పని భారం వలన వత్తిడి అధికంగా ఉంటుంది. సంఘంలో గౌరవం పెరుగుతుంది. ప్రముఖుల పరిచయాలు.

**కన్య :** కీలక విషయాలలో వాయిదాలు వేయకుండా వెనువెంటనే నిర్ణయాలు తీసుకుని లాభ పడ గలుగుతారు.

**తుల :** కార్యాలయంలో ఉన్న పెండింగ్ వర్క్‌ను పూర్తి చేయడానికి ప్రాముఖ్యనిస్తారు. స్వల్ప ధనలాభం గడిస్తారు.

**వృశ్చికం :** సంస్థాగతంగా పురోభివృద్ధిని సాధించటమే తక్షణ కర్తవ్యమని భావిస్తారు. నూతన మిత్రుల పరిచయాలు. వాహన సౌఖ్యం.

**ధనుస్సు :** మంచి మాటకారితనం వలన అనుకూల ఫలితాలను ఎంతగా సాధించవలెనని అనుభవపూర్వకంగా తెలుసుకుంటారు.

**మకరం :** దూరప్రాంతాల నుండి రావలసిన ధనం కొంత వరకు చేతికంది వస్తుంది. నూతన వాహన కొనుగోలు చేస్తారు.

**కుంభం :** నిజంగా మీ శ్రేయస్సు కోరుకునే వారు ఎవరన్నది తెలుసుకుంటారు. ఆర్థిక అంశాలపై దృష్టిని పెడతారు. వస్త్ర లాభం.

**మీనం :** భూ, గృహ, యంత్ర సంబంధితమైన విషయములకు సంబంధినటువంటి లావాదేవీలు సానుకూల పడతాయి.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# తిరుమల సమాచారం



## నేటి నుంచి తిరుమలలో కారీరిష్టి యాగం

### వరుణయాగం, పర్జన్యశాంతి హోమం

**తిరుమల,ఆగస్టు 29ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉండాలని సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని ప్రపంచవ్యాప్తంగా ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని వేంకటేశ్వరస్వామివారిని ప్రార్థిస్తూ ఆదివారం(నేటి) నుండి సెప్టెంబర్ 3వ తేదీ వరకు వరుణయాగ, పర్జన్యశాంతి సహిత కారీరిష్టి యాగాలను టిటిడి నిర్వహిస్తోంది. తిరుమల ధర్మగిరి వేద విజ్ఞాన పీఠంలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తారు. 32 మంది వేద, శ్రౌత, స్మార్త పండితులు యాగ కార్యక్రమాల్లో పాల్గొంటారు. ధర్మగిరి వేద విజ్ఞాన పీఠం ప్రిన్సిపాల్ కుప్పా శివ సుబ్రహ్మణ్య అవధాని ఆధ్వర్యంలో ఇందు కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి. తొలిగా సాయంత్రం 7 నుంచి 8 గంటల వరకు ధర్మగిరి వేద విజ్ఞాన పీఠంలో అంకురార్పణ, గణపతి పూజ, పుణ్యాహవాచనం, ఋత్విక్ వరణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆగస్టు 31 నుండి సెప్టెంబర్ 3వ తేది వరకు ప్రతిరోజూ ఉదయం 9.30 నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ధర్మగిరి వేద విజ్ఞాన పీఠంలో వరుణయాగం, కారీరిష్టి, పర్జన్యశాంతి కార్యక్రమాలతో పాటు ఏడు వేదశాఖల పారాయణం, రామాయణం, సుందరకాండ, విరాటపర్వం, ఋష్యశృంగ ధ్యాన పారాయణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. గోగర్భండ్యామ్ వద్ద వరుణ, పర్జన్య మంత్ర అనుష్ఠానం నిర్వహిస్తారు.సాయంత్రం 6గంటలనుండి రాత్రి 8గంటల వరకు ధర్మగిరిలో అగ్నిహోత్రఅనుష్ఠానం, ఏడు వేదశాఖల పారాయణం జరుగుతుంది. సెప్టెంబర్ 3న ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ధర్మగిరి వేదవిజ్ఞాన పీఠంలో పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.



## శ్రీవారి ఆశీస్సులతో శుభాలు కలగాలి

**తిరుమల,ఆగస్టు 29ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగు ప్రజలు సుఖసంతోషాలతో వుండాలని, రాష్ట్రప్రజలు అంతామంచి జరగాలనితిరుమల శ్రీవెంకటేశ్వర స్వామి వారిని ప్రార్థించినట్లు పలువురు ప్రముఖులు తెలిపారు. శనివారం ఉదయం తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామిని హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జ్యోతిర్మయి ప్రతాప్, జస్టిస్ మేడిమల్లి బాలాజీ, క్రికెటర్ వాషింగ్టన్ సుందర్ తదితరులు కుటుంబసభ్యులతో కలిసి వేర్వేరుగా స్వామివారిని దర్శించుకున్నారు. రంగనాయకులమండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. శ్రీవారి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.



## సంప్రదాయాల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

### నగర సంకీర్తనలో రాష్ట్ర బిజెపి చీఫ్ మాధవ్

**తిరుపతి,ఆగస్టు 29ప్రభాతవార్తప్రతినిధి:** భక్తి, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, నగర సంకీర్తన మరింత వైభవంగా కొనసాగి తిరుపతికి ఆధ్యాత్మిక శోభను మరింత పెంచాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షి స్తున్నట్లు బిజెపి చీఫ్ పివిఎన్ మాధవ్ అన్నారు. పవిత్ర పుణ్యక్షేత్ర మైన తిరుపతి నగరంలో శనివారం తెల్లవారు జామున జరిగిన నగర సంకీర్తనలో రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆయన సంప్రదాయ వస్త్రాలు ధరించి , నుదుట తిరునామాలు ధరించి భజన మండలి సభ్యులతో కలిసి భక్తి గీతాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్, ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు, మీడియా ప్రతినిధి జల్లి మధు సూదన్, సంకీర్తన మండలి సభ్యులు గుండాల గోపీనాథ్‌రెడ్డి, మునినాథ రెడ్డి,వాసుదేవ రెడ్డి, మునిరత్న ఆచారి, పొనుగంట భాస్కర్, చిత్ర హనుమం తరావు,లోక ప్రభాకర్ నాయుడు, తొండమనాటి సుబ్రమణ్యం రెడ్డి పాల్గొన్నారు.



## యోగసాధనతో ఆధ్యాత్మిక ఉన్నతి: డాక్టర్ రాజశేఖర్

**తిరుమల,ఆగస్టు 29ప్రభాతవార్తప్రతినిధి:** సాహిత్య, పరిశోధనా రంగాల్లో అపూర్వ సేవలందించడంతోపాటు యోగసాధన ద్వారా ఆధ్యాత్మిక ఉన్నతిని సాధించిన మహనీయులు వేటూరి ప్రభాకరశాస్త్రి అని వేంకటేశ్వర విశ్వవిద్యాల యం ప్రాచ్య పరిశోధనా సంస్థ డాక్టర్ రాజశేఖర్ అన్నారు. 76వ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో సాహితీ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వేటూరి ప్రభాకరశాస్త్రి యోగ మార్గం అంశంపై డాక్టర్ రాజశేఖర్ ప్రసంగించారు. యోగాన్ని కేవలం శారీరక సాధనగా కాకుండా మనస్సుకు ప్రశాంతతను, ఆలోచనలకు ఉన్నతిని, జీవితానికి ఆధ్యాత్మిక దిశను చూపే సాధనగా ప్రభాకరశాస్త్రి భావించరన్నారు. యోగసాధన ద్వారా ప్రశాంతత, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని, సమాజానికి ఉపయోగపడే ఉత్తమ జీవన విధానాన్ని అలవరచుకోవచ్చని పేర్కొన్నారు. ప్రభాకరశాస్త్రి యోగసాధన, ఆధ్యాత్మిక జీవన విధానం నేటి తరానికి కూడా జ్ఞానదీపంలా మార్గదర్శకంగా నిలుస్తుందని అన్నారు. వేటూరి ప్రభాకరశాస్త్రి విగ్రహానికి టిటిడి హిందూ ధర్మ ప్రచార కార్యదర్శి డాక్టర్ మేడసాని మోహన్, తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

# అమరావతిలో 2,500 ఎకరాల్లో స్పోర్ట్స్ సిటీ

## అకాడెమీలకు ప్రభుత్వ స్థలాలు: మంత్రి కొల్లు రవీంద్ర

**తిరుపతి,ఆగస్టు 29ప్రభాతవార్తప్రతినిధి:** దేశానికే ఆదర్శంగా రాష్ట్ర రాజధాని అమరావతిలో 2,500 ఎకరాల విస్తీర్ణంలో భారీ "స్పోర్ట్స్ సిటీ" తో పాటు స్పోర్ట్స్ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్రమంత్రి కొల్లు రవీంద్ర వెల్ల డించారు. క్రీడలను క్షేత్రస్థాయిలో ప్రోత్సహిం చడానికి పివి సింధు, పుల్లెల గోపీ చంద్, కిదాంబి శ్రీకాంత్ క్రీడాకారుల అకాడ మీలకు పాఠశాల మైదానాలను అభివృద్ధి చేసి గ్రామీణ యువతకు క్రీడా సదు పాయాలు మెరుగుపరచనున్నట్లు వివరించారు. అరకు నుంచి తిరుపతి వరకు, శ్రీకాకుళం నుండి అనంతపురం వరకు గ్రామీణ స్థాయి ప్రతిభను వెలికితీసానతమన్నారు. తిరుపతిలో జరిగిన అంతర్జాతీయ క్రీడా దినోత్సవ ముగింపు సభలో అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, శాప్ చైర్మన్ ఈ సందర్భంగా శాప్ చైర్మన్ రవి నాయుడు మాట్లాడుతూ అమరావతి ఛాంపియన్‌షిప్-2026లో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2,07,498 మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. జిల్లాస్థాయిలో సుమారు 90 వేల మంది, రాష్ట్రస్థాయిలో సుమారు 10 వేల మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారని వెల్లడించారు.





ప్రభుత్వం స్థలాలు కేటాయించిందని తెలిపారు. శ్రీకాకుళం నుండి అనంతపురం వరకు గ్రామీణ ప్రతిభను వెలికితీసేందుకు ఆరు ప్రత్యేక అకాడమీలను ప్రారంభించామని, ప్రపంచంలో ఏ క్రీడా పోటీలు జరిగినా ఎపి నుంచి కనీసం ఒక్కరైనా ప్రాతినిధ్యం వహించాలనేది ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. విశాఖలో ప్రధాని మోదీ సమక్షంలో జరిగిన ప్రపంచ యోగా దినోత్సవంలో ఐదు లక్షల మంది పాల్గొని రికార్డు సృష్టించారని గుర్తు చేస్తూ, రాష్ట్రాన్ని ఆరోగ్యకరమైన సంపద, సంతోషకరమైన రాష్ట్రంగా తీర్చిదిద్దడమే సిఎం చంద్రబాబు ఆలోచన అని చెప్పారు. మంత్రి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే 50 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని క్రీడా మౌలిక వసతుల కల్పనకు రాష్ట్రాన్ని విశాఖ, అమరావతి, తిరుపతిగా మూడు జోన్లుగా విభజించినట్లు తెలిపారు. క్రీడా పరికరాల ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు నెల్లూరు పరిసర ప్రాంతంలో వెయ్యి ఎకరాల్లో "స్పోర్ట్స్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్" ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. తిరుపతిలో అంతర్జాతీయ ప్రమాణాలతో క్రీడా ప్రాంగణాలు నిర్మిస్తున్నామని, మంత్రి నారా లోకేశ్ సూచనల మేరకు సిఎస్ఆర్ నిధులతో జిల్లా పరిషత్ ఉన్నత రవినాయుడు క్రీడాకారులు పాల్గొన్నారు.

### అమరావతి ఛాంపియన్‌షిప్‌లో విజేతలకు నగదు ప్రోత్సాహకాలు

**తిరుపతి/తిరుపతిక్రీడ, ఆగస్టు 29ప్రభాత వార్త ప్రతినిధి:** ప్రతిభ కలిగిన క్రీడాకారులకు అవసరమైన సహకారం అందిస్తామని,రాష్ట్రప్రభుత్వం క్రీడలకు ఎంతో ప్రాధాన్యతనిస్తోందని ప్రముఖులు చెప్పారు. తిరుపతిలో నాలుగురోజులు జరిగిన అమరావతి ఛాంపియన్‌షిప్-2026లో విజయం సాధించిన విజేతలు, రన్నరప్‌లకు కలిపి 92 లక్షల రూపాయలుయ నగదును అందజేశారు. విజేతలను అభినందిస్తూ, భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించి రాష్ట్రానికి మరింత పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు. శనివారం తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ ఆడిటోరియంలో శాప్ చైర్మన్ రవి నాయుడు అధ్యక్షతన అమరావతి ఛాంపియన్‌షిప్- 2026 ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు,రాష్ట్ర మంత్రులు కొల్లు రవీంద్ర ,మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి , శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ పోటీలను అండర్-17, అండర్-23 విభాగాల్లో నిర్వహించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో విద్యార్థులు, యువ క్రీడాకారులు పాల్గొనడం ద్వారా క్రీడల పట్ల యువతలో ఆసక్తి మరింత పెరుగుతోందని పేర్కొన్నారు. జాతీయ, అంతర్జాతీయ వేదికలపై ప్రతిభ కనబరిచి పతకాలు సాధించి రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతులు తీసుకొచ్చిన 264 మంది క్రీడాకారులకు క్రీడా ప్రోత్సాహకాల కింద మొత్తం 8.8 కోట్ల రూపాయలు నగదు ప్రోత్సాహకాలను అందజేసినట్లు తెలిపారు. అమరావతి ఛాంపియన్‌షిప్-2026కు లభించిన ఏషియా బుక్ ఆఫ్ రికార్డ్స్ గుర్తింపు ఆంధ్రప్రదేశ్ క్రీడా రంగానికి గర్వకారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్,తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు,ఎస్వీ యూనివర్సిటీ ,పద్మావతి విశ్వవిద్యాలయం ఉపకులపతులు ఆచార్య నర్సింగరావు, ఆచార్య వెన్నం ఉమ, రిజిస్ట్రార్లు ఆచార్య భూపతినాయుడు, ఆచార్య ఉష, టిడిపి ఇన్చార్జి జెబి శ్రీనివాసులు,వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, శాప్ ఎండి భరణి , క్రీడాకారులు పాల్గొన్నారు.

# సోషల్ వర్క్ పాఠ్యప్రణాళికలపై పునఃపరిశీలించాలి




**తిరుపతి,ఆగస్టు 29ప్రభాతవార్తప్రతినిధి:** భారతదేశ మేధో, సాంస్కృతిక తాత్విక వారసత్వాన్ని సామాజిక సేవా విద్య ఆచరణను బలోపేతం చేయడానికి వినియోగించాల్సిన అవసరాన్ని విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వెన్నం ఉమ నొక్కిచెప్పారు. ప్రస్తుతం ఉన్న సోషల్ వర్క్ పాఠ్యప్రణాళికలు పాశ్చాత్య నమూనాలపై ఆధారపడటాన్ని పునఃపరిశీలించాల్సిన అవసరం ఉందని అన్నారు. పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో భారతీయ జ్ఞాన వ్యవస్థలు-సామాజిక సేవపై జాతీయ సదస్సు సోషల్ వర్క్ ఎకనామిక్స్ ఆధ్వర్యంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో జాతీయ సదస్సు శనివారం జరిగింది. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఉమ ముఖ్య అతిథిగా పాల్గొని ఆయుర్వేదం వంటి భారతీయ జ్ఞాన సంప్రదాయాలతో పాటు విశ్వాసం, విలువలు, నైతికత, సామాజిక బాధ్యతలపై ఆధారపడిన భారతీయ సాంస్కృతిక వ్యవస్థలు సామాజిక సేవా విద్యకు విలువైన మార్గదర్శకత్వాన్ని అందించగలవని ఆమె వివరించారు. ధర్మం, కర్మ వంటి భారతీయ భావనలు, మహాత్మా గాంధీ ప్రతిపాదించిన అహింసా సిద్ధాంతం సమకాలీన సామాజిక సేవా విద్య ఆచరణను మరింత సమృద్ధి చేయగలవని ఆమె పేర్కొన్నారు. తుంకూరు విశ్వవిద్యాలయం నుండి విచ్చేసిన ఆచార్య కె. జి. పరశురామ, "నిర్మాణాత్మక భారతీయీకరణ" అత్యంత అవసరమని తన కీలక ప్రసంగంలో పేర్కొన్నారు. భారతీయ తత్వశాస్త్రం, సంస్కృతి, విలువలు , కుటుంబ వ్యవస్థలు సమాజ నిర్మాణాలు సోషల్ వర్క్ కు ముఖ్యమైన జ్ఞాన వనరులని ఆయన పేర్కొన్నారు. సదస్సు సమన్వయకర్త సోషల్ వర్క్ విభాగాధిపతి ఆచార్య కె. అనురాధ, సోషల్ సైన్సెస్ డీన్ ఆచార్య పి. విజయలక్ష్మి సదస్సులో ప్రముఖ విద్యాసంస్థలకు చెందిన నిపుణులు అకడమిక్ సెషన్లలో పాల్గొన్నారు. పాండిచ్చేరి విశ్వవిద్యాలయానికి చెందిన సామాజిక సేవా విభాగం ప్రొఫెసర్ షాహిన్ సుల్తానా, అధ్యాపకులు, పూర్వ విద్యార్థినులు పాల్గొన్నారు.

## అనుగుణమైన జీవనశైలితోనే సంపూర్ణ ఆరోగ్యం

### ఆహారంలో చిరుధాన్యాలకు ప్రాధాన్యం

### ప్రకృతి వైద్య నిపుణుడు డాక్టర్ మంతెన

**తిరుమల,ఆగస్టు 29ప్రభాతవార్తప్రతినిధి:** ఆధునిక జీవనశైలిలో మారుతున్న ఆహారపు అలవాట్లు, సమయపాలన లోపం కారణంగా అనేక అనారోగ్య సమస్యలు ఎదురవుతున్నాయని ప్రకృతి వైద్య నిపుణుడు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజు అన్నారు. "ఆరోగ్య సంజీవిని" అంశంపై ఆయన మాట్లాడుతూ జీవన విధానం ప్రకృతి నియమాలకు అనుగుణంగా ఉండాలని సూచించారు. సూర్యోదయం, సూర్యాస్తమయాలను అనుసరించి దైనందిన కార్యక్రమాలను క్రమబద్ధీకరించుకోవాలని తెలిపారు. ముఖ్యంగా రాత్రి భోజనాన్ని సాయంత్రం ఆరు గంటలలోపే పూర్తి చేసుకోవడం ఆరోగ్యానికి మేలు చేస్తుందని చెప్పారు. రాత్రి ఆలస్యంగా భోజనం చేసి వెంటనే నిద్రించడం వల్ల జీర్ణవ్యవస్థపై అదనపు భారం పడుతుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆయుష్ శాఖ, టిటిడి సంయుక్త ఆధ్వర్యంలో యోగ, ప్రకృతి వైద్యంతో ఆరోగ్య పరిరక్షణ" అంశంపై రెండు రోజుల అవగాహన కార్యక్రమం శనివారం తిరుపతి మహతి కళాక్షేత్రంలో ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో తొలి రోజు టిటిడి విద్యాసంస్థల విద్యార్థులకు, రెండో రోజు టిటిడి ఉద్యోగులు, పురప్రజలకు ముందస్తు ఆరోగ్య సంరక్షణ, డిజిటల్




సమతుల్యత, ఆహారమే ఔషధం, డిజిటల్ డిటాక్స్ తదితర అంశాలపై డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్,తిరుపతి మున్సిపల్ కమిషనర్ జయకృష్ణ, ఆయుష్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ నాగముని నాయక్, టిటిడి డిప్యూటీ ఇఒ గోవిందరాజన్, విద్యాసంస్థల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఒకే కుటుంబంలో నలుగురు మృతి



**విశాఖపట్నం ఆగస్టు 28 ప్రభాతవార్త:** విశాఖలోని చింతల అగ్రహారంలో తీవ్ర విషాద ఘటన చోటుచేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందినట్లు సమాచారం.మల్లా ప్రవీణ్, ఆయన భార్యతో పాటు ఇద్దరు పిల్లలు మృతి చెందినట్లు తెలుస్తోంది. ప్రాథమిక సమాచారం ప్రకారం ఇద్దరు పిల్లలకు విషం ఇచ్చిన అనంతరం భార్యాభర్తలు ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. అంతకుముందు భార్యాభర్తలు తమ వాట్సాప్ స్టేటస్‌లో 'రిప్' అంటూ సందేశం పెట్టినట్లు తెలుస్తోంది. ఆ స్టేటస్‌ను చూసిన బంధువుల అమ్మాయి కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో ఘటన వెలుగులోకి వచ్చినట్లు సమాచారం.ప్రవీణ్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తుండగా.. ఆయన భార్య కూరగాయల వ్యాపారం చేస్తున్నట్లు తెలుస్తోంది.అయితే ఈ విషాదానికి అసలు కారణం ఏమిటనేది ఇంకా తెలియరాలేదు. ఘటనపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. పూర్తి వివరాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

## రేపు వైజాగ్‌లో కొణిజేటి రోశయ్య విగ్రహావిష్కరణ

### సమీక్షా సమావేశంలో ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్

**విశాఖపట్న, ఆగస్టు 29 ప్రభాత వార్త :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత కొణిజేటి రోశయ్య విగ్రహావిష్కరణ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్ పిలుపునిచ్చారు.ఈ నెల 31వ తేదీ (సోమవారం) విశాఖపట్నంలో జరగనున్న ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి రాష్ట్ర ఐటీ, మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథిగా హాజరై, రోశయ్య విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారని తెలిపారు .ఈ కార్యక్రమ ఏర్పాట్లపై విశాఖ జిల్లా ఆర్యవైశ్య నాయకులు, కార్పొరేషన్ డైరెక్టర్లతో డూండి రాకేష్ శనివారం నగరంలో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయనమాట్లాడుతూ లౌక్యా నికి, ఆర్థిక క్రమశిక్షణకు మారుపేరైనరోశయ్య విగ్రహాన్నివైజాగ్‌లో ఆవి ష్కరించుకోవడం గర్వకారణ మన్నారు. మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా జరిగే ఈ విగ్రహా విష్కరణ మహోత్సవానికి ఆర్యవైశ్య ప్రము ఖులు,నాయకులు, సమాజ బంధువులు భారీసంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పైడ కృష్ణ ప్రసాద్ పలువురు ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్లు, సంఘం ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## బొప్పరాజు వ్యాఖ్యలను ఖండించిన అమరావతి రెవెన్యూ ఎంప్లాయిస్ జెఏసి చైర్మన్

**విజయవాడ,ఆగస్టు29,ప్రభాతవార్తప్రతినిధి:** బొప్పరాజు వ్యాఖ్యలను అమరావతి రెవెన్యూ ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ ఖండించారు. "బొప్పరాజు జరిపిన సదస్సు. రాజకీయ ప్రేరేపితం. పొలిటికల్ అజెండాతోనే ఉద్యోగ సంఘం సదస్సు నిర్వహించారు. బయట నుంచి వచ్చిన స్క్రిప్టులతో ప్రభుత్వంపై విమర్శలు చేశారు. సీఎం, ఆయన సతీమణిపై వ్యంగ్యాస్త్రాలు సరికాదన్నారు.పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం బొప్పరాజుకు తగదు. ఉద్యోగుల సమస్యలు చర్చలతోనే పరిష్కరించుకోవాలి. పసలేని కార్యాచరణతో కుటుంబాలను రోడ్డుపైకి తేవడం సిగ్గుచేటు. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేందుకు బొప్పరాజు అండ్ టీమ్ పన్నాగం. బొప్పరాజు అంటేనే డ్రామా నడిపే వ్యక్తి అనే భావన ఉద్యోగుల్లో ఉంది. రెవెన్యూ భవనం పేరుతో ఉద్యోగుల వద్ద ఒకరోజు వేతనం వసూలు చేశారు. రెవెన్యూ స్పోర్ట్స్ పేరుతోనూ నిధులు వసూలు చేశారని ఆరోపణలు. బొప్పరాజు బారి నుంచి ఉద్యోగు లను రక్షించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి" అని భూపతిరాజు రవీంద్రరాజు పేర్కొన్నారు.



## తీయని భావాల భాండాగారం తెలుగు

### డాక్టర్ మేడసాని మోహన్

**తిరుపతి,ఆగస్టు 29ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగు భాష తీయని భావాల భాండాగారమని అవధాని, టిటిడి అన్నమాచార్య ప్రాజెక్టు ప్రత్యేక అధికారి డాక్టర్ మేడసాని మోహన్ పేర్కొన్నారు. తిరుపతిలోని ఎస్పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో శనివారం తెలుగు భాషా దినోత్స వాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మేడసాని మోహన్ మాట్లాడుతూ తెలుగు బాష ప్రాచీనమైనదే కాకుండా మాధుర్యం, సాహిత్య సంపద, భావవ్యక్తీకరణలో విశిష్టత కలిగిన భాషగా గుర్తింపు పొందిందని తెలిపారు. వివిధ బాషల్లోని పదాలు తెలుగు బాషలో సులు వుగా ఒదిగిపోవడం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా తెలుగు భాషా చమత్కారాలతో అహూతులను అలరించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎస్పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి మాట్లాడుతూ తెలుగు వైభవాన్ని క్షుణ్ణంగా వివరించారు. తెలుగు బాషను ప్రజల వ్యావహారిక భాషగా తీర్చిదిద్దడంలో గిడుగు వెంకట రామమూర్తి కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా విచ్చేసిన ఎపి తెలుగు అకాడమీ వ్యవస్థాపక డైరెక్టర్, ఎస్వీయూ విశ్రాంత ఆచార్యులు పేట శ్రీనివాసులు రెడ్డి తెలుగు బాషలో ఎంతో మధురమైన సుమతీ శతకాలు, వేమన పద్యాలను పిల్లలకు నేర్పించాల్సిన అవసరం ఎంతైనా వుం దన్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా మేడసాని మోహన్, పేట శ్రీనివాసులు రెడ్డిలను దుశ్శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్పిడిసిఎల్ డైరెక్టర్ (టెక్నికల్) కె. గురవయ్య, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ ఐటి) పి. అయూబ్ ఖాన్, చీఫ్ జనరల్ మేనేజర్లు జె. రమణా దేవి, ఆర్. పద్మ, ఎం. మురళీ కుమార్, సిహెచ్ రామచంద్ర రావు, కె. సంపత్ కుమార్, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ కె. జనార్ధన్ నాయుడు ,పిఆర్‌ఒ తోట మధుసూదన తదితరులు పాల్గొన్నారు.



## తెలుగు భాషకు గొడుగు గిడుగు: మాధవ్

**తిరుపతి,ఆగస్టు 29ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగు భాషా వ్యావహారిక రూపానికి విశేష కృషి చేసిన మహనీయుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు అని బిజెపి చీఫ్ పివిఎన్ మాధవ్ పేర్కొన్నారు. తెలుగుభాష దినోత్సవం సందర్భంగా శనివారం తిరుపతిలో ఆయన చిత్రప టానికి మాధవ్, బిజెపి నాయకులు పుష్పాంజలి ఘటించారు. గుండాల గోపీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం లో పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. తెలుగు భాషను పండితుల గ్రంథాలకే పరిమితం కాకుండా ప్రజల నోట వినిపించే వ్యావహారిక తెలుగుగా తీర్చిదిద్దేందుకు గిడుగు రామమూర్తి పంతులు జీవితాంతం కృషి చేశారని అన్నారు. ప్రజలు మాట్లాడే భాషలోనే విద్య, సాహిత్యం, పరిపాలన ఉండాలనే ఆయన ఆలోచన నేటికీ మార్గదర్శకమని పేర్కొన్నారు.

## మహిళపై సామూహిక అత్యాచారం

**విజయవాడ.ఆగస్టు29,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ నగరంలోని వాంబే కాలనీలో దారుణం చోటు చేసుకుంది. ఒంటరిగా ఉంటున్న మహిళపై స్థానికంగా నివాసముంటున్న ఐదుగురు యువకులు సామూహిక అత్యాచారానికి పాల్పడిన సంఘటన ఆ ప్రాంతంలో సంచలనంగా మారింది. స్థానికుల కథనం ప్రకారం వాంబే కాలనీలో నివాసం ఉంటున్న మహిళపై అర్ధరాత్రి స్థానికంగా అల్లరి చిల్లరగా తిరిగే ఐదుగురు యువకులు మద్యం మత్తులో మహిళపై అఘాయిత్యానికి పాల్పడ్డారని,ఉదయం మహిళా ఎంతసేపటికి స్పందించకపోవడంతో చుట్టుపక్కల నివాసం ఉండేవారు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

**ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్**

పెద్దాపురం బ్రాంచ్, చిరునామా: 9-1-2A, దర్గా సెంటర్, ఫ్లీడర్స్ వీధి, పెద్దాపురం-533437.
ఫోన్: 89259 50530, ఇమెయిల్ ఐడి: lob0530@lob.bank.in

**స్వాధీనత ప్రకటన** అపెండిక్స్-IV రూల్ నెం.8(1) (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారం ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, పెద్దాపురం బ్రాంచ్ ... M/s. బన్నూ ట్రేడర్స్ ... తేది.02.06.2026 నాటికి రూ.77,64,418.00 ... తేది.26.08.2026 నాటికి రూ. 78,92,759.00 ...

**స్థిరాస్తి వివరాలు:**

అస్తి నెం.1: (శ్రీ మేడపాటి వినోద్ కుమార్ గారి పేరున ఉన్న ఆస్తి) ...

అస్తి నెం.2: (శ్రీ మేడపాటి వినోద్ కుమార్ గారి పేరున ఉన్న ఆస్తి) ...

| రుణగ్రహీత పేరు | మంజూరు చేసిన రుణం | తేది.26.08.2026 నాటికి బకాయి మొత్తం |
|---|---|---|
| M/s. బన్నూ ట్రేడర్స్ | రూ.98.00 లక్షలు | రూ.99.62 లక్షలు |
| మొత్తం | రూ.98.00 లక్షలు | రూ.99.62 లక్షలు |

తేది : 27.08.2026
ప్రదేశం : పెద్దాపురం

సం/- అధీకృత అధికారి
ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్

కృష్ణా నది జలాల వివాదం, తాజా వర్షాభావ పరిస్థితులపై కృష్ణానది యాజమాన్య బోర్డు ఆగస్టు 2026లో కీలక సమావేశం నిర్వహించి కొన్ని ప్రాథమిక నిర్ణయాలు తీసుకుంది. ఎగువప్రాంతాల నుండి శ్రీశైలం, నాగార్జున సాగర్ జలాశయాలకు వరద ప్రవాహాలు భారీగా తగ్గడంతో ఉమ్మడి రిజర్వాయర్లలో ఉన్న నీటిని ఎలా ఉపయోగించాలనే దానిపై బోర్డు స్పష్టమైన మార్గదర్శకాలను ఇచ్చింది. ఆగస్టు 2026 నాటి సమావేశంలో కేఆర్ ఎంబి తీసుకున్న ప్రధాన నిర్ణయాలు, తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు చాలా తక్కువగా ఉన్నాయి. అందువల్ల, ప్రస్తుతం శ్రీశైలం, నాగార్జున సాగర్ జలాశయాలలో అందుబాటులో ఉన్న నీటిని కేవలం తాగునీటి అవసరాలకు మాత్రమే ఉపయోగించాలని, సాగునీటికి (ఇరిగేషన్) ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వకూడదని బోర్డు స్పష్టం చేసింది. అక్టోబర్ 2026 వరకుతమ తాగునీటి అవసరాల కోసం 47 టీఎంసీల నీరు కావాలని ఏపీ బోర్డును కోరింది. ఇందులో పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా 22టీఎంసీలు, హంద్రీనీవా ద్వారా 11 టీఎంసీలు, సాగర్ కుడి కాల్వ ద్వారా 7 టీఎంసీలు, కృష్ణా డెల్టా సిస్టమ్ కోసం 6 టీఎంసీలు కావాలని ఇండెంట్ పెట్టింది. ఏపీ ఇప్పటికే తమకు నిర్దేశించిన కోటాకంటే 10 టీఎంసీల నీటిని అదనంగా వాడుకుందని తెలంగాణ అధికారులు కేఆర్ ఎంబికి ఫిర్యాదు చేశారు. అలాగే ఉమ్మడి జలాశయాల నుండితాగునీటి విడుదలను 50:50 నిష్పత్తిలో సమానంగా పంచాలని తెలంగాణ డిమాండ్ చేసింది. 3. తుది నిర్ణయం వాయిదా 4)రెండు రాష్ట్రాలు తమ వార్షిక నీటి అవసరాల పూర్తి వివరాలను (యాన్యువల్ ఇండెంట్) వేర్వేరు కాల పరిమితులతో సమర్పించాయి. దీనివల్ల ఏ రాష్ట్రానికి ఎన్ని టీఎంసీల నీరు తాగునీటి కింద కేటాయించాలనే తుది నిర్ణయాన్ని సెప్టెంబర్ 4, 2026న జరిగే తదుపరి సమావేశానికి బోర్డు వాయిదా వేసింది.

# ఎల్‌నినో ఎఫెక్ట్..సాగు సగమే

**నెలవెట్ల సతీష్‌కుమార్ రెడ్డి**

పసిఫిక్ మహా సముద్ర జలాల ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగడం వల్ల ప్రపంచవ్యాప్తంగా వాతావరణం, వర్షపాతంపై ప్రభావం చూపే వాతావరణ నమూనాయే ఎల్‌నినోగా చెప్పవచ్చు. దీనివల్ల రుతుపవనాలు బలహీనంగా, ఆలస్యంగా, అసమానంగా ఉండొచ్చు. వర్షాధార పంటలపై ఇది ప్రభావం చూపుతుంది. దీని ప్రభావం ఏడాదికొకవిధంగా మారుతుంది. రాష్ట్రంపై ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉంది. వానలోటుతో రాష్ట్రంలో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. ఇప్పటికే వేసిన పంటలు ప్రమాదంలో ఉన్నాయి. నైరుతి రుతు పవన (జూన్ 1 నుంచి ఆగస్టు 25 వరకు) కాలంలో దేశవ్యాప్తంగా వర్షపాతం సాధారణం కంటే సుమారు 13 శాతం తక్కువగా ఉండగా, ఆగస్టు 25 నాటికి రాష్ట్రంలో 51శాతం వాన లోటు నమోదైంది. ఇది దేశవ్యాప్త లోటుకు దాదాపు నాలుగు రెట్లు ఎక్కువ. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది తెలంగాణలో వర్షపాతం గణనీయంగా తగ్గడంతో రాష్ట్రప్రభుత్వం అప్రమత్తమైంది. వర్షపాతం, భూగర్భ జలాల లభ్యత, అందుబాటులో ఉన్న సాగునీటి వనరులను నిరంతరం విశ్లేషిస్తూ, పంటల సరళిలో మార్పుల కోసం ప్రత్యేక కార్యాచరణను రూపొందిస్తోంది. ఇందులో భాగంగానే రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగు దిశగా ప్రోత్సహించేందుకు చర్యలు చేపట్టింది. ఈ సీజన్‌లో వరిసాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గేఅవకాశం ఉన్నందున, రైతులు ప్రత్యామ్నాయంగా పప్పుధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాలు, కూరగాయల వంటి తక్కువ నీటితోపండే పంటలను ఎంచుకోవాలని వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి సూచించారు. గతేడాదితో పోలిస్తే రాష్ట్రంలో భూగర్భ జలమట్టం సుమారు ఒక మీటర్ మేర క్షీణించిందని ఆయన తెలిపారు. రైతుల ప్రయోజనార్థం జిల్లాస్థాయి ప్రత్యేక సలహాలను, పంటల యాజమాన్య వ్యూహాలను సిద్ధంచేస్తున్నట్లు వివరించారు. వాతావరణ మార్పుల ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు తెలంగాణ ప్రభుత్వం 27 మంది సభ్యులతో ఒక ఉన్నతస్థాయి నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. తెలంగాణ రాష్ట్ర ప్రణాళికాసంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి. చిన్నారెడ్డి అధ్యక్షతన బుధవారంప్రజాభవన్‌లో ఈ కమిటీ తొలిసారిగా సమావేశమైంది. భారత వాతావరణ విభాగం, ఇక్రిశాట్, ఇకార్‌క్రిడా, నాబార్డ్, వ్యవసాయ, ఉద్యానవన విశ్వవిద్యాలయాలతో పాటు పలుప్రముఖ సంస్థల నిపుణులు ఇందులో సభ్యులుగాన్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లోనూ వర్షపాత లోటు ఉంది. దీంతో ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం ప్రణాళికబద్ధంగా చర్యలు చేపట్టింది. రైతుల భాగస్వామ్యాన్ని పెంచేందుకు వాతా



వరణ ఆధారిత (ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్) పంటల బీమా నమోదు గడువును జూలై31వరకు, దిగుబడి ఆధారిత పంటల బీమా (పీఎంఎఫ‌బీవై)గడువును ఆగస్టు 31వరకు పెంచారు. దీనివల్ల ఉద్యాన పంటల బీమా కవరేజ్ గణనీయంగా పెరిగి, మరిన్ని పంటలకు బీమా వర్తించింది. ఎల్‌నినో సమయంలో పంట నష్టాల నుంచి రైతులకు ఆర్థిక రక్షణగా నిలుస్తోంది పంటల బీమా! ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా ఆరు తడి పంటలు వేయాలని నిపుణులు సూచిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వరి, పత్తి వైపు వెళ్లకుండా సజ్జ, జొన్న, రాగి, వరిగలు, కంది, పెసర, మినుము, వేరుశనగ వంటి వాటితో పాటు ఆవాలు, టమాట, సొర, వంగ, బీర, దోస, కాకర వంటి కూరగాయలు సాగు చేసుకోవాలని శాస్త్రవేత్తలు సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. వర్షాలు లేకపోవడంతో సాగు నీళ్ల కరవై పంటల సాగుపై ప్రభావం చూపుతున్నది. భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. దీంతో బోర్లు, బావులు వట్టిపోతున్నాయి. ప్రాజెక్టులన్నీ ఖాళీ కుండలను తలపిస్తున్నాయి. వెరసి పంటల సాగుపై తీవ్ర ప్రభావం పడుతున్నది. ఈ పరిస్థితులతో గతఏడాదితో పోల్చితే పంటల సాగు భారీగాతగ్గే అవకాశం ఉన్నదని వ్యవసాయశాఖఅంచనా వేసింది. గత ఏడాది 1.39 కోట్ల ఎకరాల్లో పంటలు సాగు కాగా ఈ సీజన్‌లో ఇది 1.06కోట్ల ఎకరాలకే పరిమితమయ్యే అవకాశమున్నదని అంచనా వేసింది. అంటే సుమారు 32.20 లక్షల ఎకరాల్లో పంటల సాగు తగ్గుతుందని స్పష్టం చేసింది. గత ఏడాది వానకాలంతో పోల్చితే 23శాతం సాగు తగ్గే అవకాశం ఉంటుందని పేర్కొన్నది. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 73.36 లక్షల ఎకరాల్లో పంటలు సాగైనట్లు నివేదికలో పేర్కొన్నది. గతఏడాది ఇదే సమయానికి 78లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. అంటే గత ఏడాదితో చూస్తే 4.64 లక్షల ఎకరాల్లో పంటలు తక్కువగా సాగయ్యాయి.ఎల్‌నినో ప్రభావం ఎక్కువగా వరిసాగుపై పడుతున్నది. సాగునీరు అధికంగా అవసరముండే పంట కావడం, వర్షాలు లేకపోవడంతో వరి సాగు సగానికి సగం తగ్గే అవకాశం ఉన్నది. గతఏడాది వానకాలంలో 70లక్షల ఎకరాల్లో వరిసాగు కాగా ఈ సీజన్‌లో 38.51 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగయ్యే అవకాశమున్నదని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. అంటే 31.38లక్షల ఎకరాల్లో వరి సాగు తగ్గుతుందని పేర్కొన్నది. ఇప్పటి వరకు 14.09 లక్షల ఎకరాల్లో వరినాట్లు పడినట్లు తెలిపింది. పత్తి 4.77 లక్షల ఎకరాల్లో తగ్గనున్నది. గత ఏడాది 50.70 లక్షల ఎకరాల్లో పత్తి సాగు కాగా ఈసీజన్‌లో 45.92 లక్షలఎకరాల్లోనే సాగైంది. ఇక మక్కజొన్న 40వేల ఎకరాల్లో తగ్గే అవకాశమున్నది. 25 జిల్లాల్లో రాష్ట్రంపై ఎల్‌నినో ప్రభావం స్పష్టంగా కనిపిస్తున్నది. రాష్ట్రంలోని మెజారిటీ జిల్లాలు, గ్రామాలు ఎల్‌నినో బారినపడుతున్నాయి. వ్యవసాయ శాఖ నివేదిక ప్రకారం ఇప్పటివరకు 25కు పైగా జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైనట్లుగా పేర్కొంది. ఇక 355 మండలాల్లో లోటు వర్షపాతం, 42మండలాల్లో అత్యంతలోటు వర్షపాతం, 186 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ ఇప్పటికే వెల్లడించింది. ఇక గ్రామాల విషయానికొస్తే దాదాపుగా అన్ని గ్రామాలపై ఎల్‌నినో ప్రభావం ఉన్నట్లుగా పేర్కొంది. అయితే ఇందులో సుమారు 8 వేల గ్రామాలపై మధ్యస్థ ప్రభావం ఉన్నట్లు పేర్కొన్నది. మొత్తంగా రాష్ట్ర వ్యాప్తంగా ఎల్‌నినో తీవ్ర ప్రభావం చూపుతున్నట్లుగా వ్యవసాయశాఖ వెల్లడించింది.

గత ఏడాది (2025) శ్రీశైలం నుంచి మొదటి సారి జూలై 8, 2025న క్రెస్ట్ గేట్లు 6, 7, 8,11 నంబర్‌గల 4 గేట్లను 10 అడుగుల మేర ఎత్తి నాగార్జున సాగర్‌కు నీటిని విడుదల చేశారు. వరద ఉధృతి పెరగడంతో అదే నెల జూలై 29, 2025న 6 గేట్లను, ఆ తర్వాత ఆగస్టు మాసంలోనూ వరద ఆధారంగా ప్రాజెక్టు గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదిలారు. గత ఏడాది వరదలు భారీగా రావడంతో దాదాపు 4 సార్లకు పైగా విడతలవారీగా గేట్లు ఎత్తాల్సి వచ్చింది.గత ఏడాది భారీ వరదలతో పోలిస్తే, ఈసారి వర్షాభావ పరిస్థితులు,వరదలు తగ్గడం వల్ల కృష్ణా జిల్లా తీవ్రమైన ప్రతికూల ప్రభావాలను ఎదుర్కొంటోంది. గత ఏడాది శ్రీశైలం, సాగర్ గేట్లు పదేపదే ఎత్తడం వల్ల దిగువన ఉన్న కృష్ణా డెల్టా ప్రాంతం నీటితో కళకళలాడింది. కానీ ఈసారి సాగునీరు, తాగు నీటి సంక్షోభం తలెత్తింది. దీంతో రైతులు ఖరీఫ్ వరి నాట్లు వేయలేకపోయారు. అధికారులు ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని సూచిస్తున్నప్పటికీ, స్థానిక నేలలు వరికి మాత్రమే అనుకూలంగా ఉండటంతో రైతులు పంట విరామం ప్రకటించాల్సిన పరిస్థితి వచ్చింది. ఇదిలా ఉండగా నాగార్జున సాగర్ వద్ద ఘర్షణ ఆగస్టు 26, 2026న ఏపీ, తెలంగాణ అధికారుల మధ్య తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. కేఆర్ఎంబి అనుమతి ఉందంటూ ఆంధ్రప్రదేశ్ అధికారులు నాగార్జున సాగర్ కుడి కాల్వ గేట్లను తెరిచి 2,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. దీనికి కౌంటర్‌గా తమకు ఎలాంటి సమాచారం లేదంటూ తెలంగాణ అధికారులు కూడా ఎడమ కాల్వ గేట్లనుతెరిచి సమానంగా నీటిని విడుదల చేయడంతో సాగర్ వద్ద మళ్లీ కృష్ణా జలాల యుద్ధం మొదలైంది. ఈ వివాదం నేపథ్యంలో కేంద్ర జలశక్తి శాఖ,సెంట్రల్ వాటర్ కమిషన్ సెప్టెంబర్ 7, 2026న ఢిల్లీలో ఇరు రాష్ట్రాల ముఖ్య కార్యదర్శులతోప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశాయి. వర్షాభావం వల్ల జలవివాదాలు మరింతపెరిగే అవకాశం ఉన్ననేపథ్యంలో ప్రత్యామ్నాయంపై దృష్టి సారిస్తూ వివాదాలకు తావులేకుండా ఇతరరాష్ట్రాలకు ఆదర్శంగాఉంటూ ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉన్నది. ●

తమిళనాడు

# విజిల్ @100

**ఎ.వి.వి ప్రసాద్**

ఎన్నో ఆటుపోట్లు, మరెన్నో సవాళ్ల నడుమ సాగుతున్న నడకలో విజయ్‌కి ముఖ్యమంత్రిగా మొదటి వంద రోజులు పూర్తయ్యాయి. రాజకీయాల్లో తమిళ వెట్రి కజగం (టివికె) పార్టీని స్థాపించి రెండేళ్లలోనే ముఖ్యమంత్రి కావడం సినిమా నటుడైన విజయ్ సాధించిన తొలి విజయం అనుకుంటే, ఆ పదవిలో తొలి వంద రోజులు పూర్తి చేయడం మలి విజయం అనే చెప్పాలి. ఎందుకంటే.. ఆయనను పదవిలోకి రాకుండా, వచ్చినా కొద్ది రోజుల కంటే నిలబడకుండా చేయడానికి జరిగిన యత్నాలు ఈ వంద రోజుల్లో ఒకటీ రెండు కావు. అసెంబ్లీలోకి ప్రవేశించడం నుంచి అనేకానేక కొత్త పథకాలను ఇబ్బడిముబ్బడిగా ప్రకటించడం ద్వారా రోజు రోజుకు తన స్థానాన్ని పటిష్టం చేసుకుంటూ ఆయన ముందుకు సాగుతున్నట్లుగా కనిపిస్తుంది. ఆయన పార్టీ గుర్తు విజిల్. అది అప్రతిహతంగా ధ్వనిస్తూనే ఉంది. పార్టీ ఆవిర్భవించిన గత రెండేళ్లుగా విజిల్ మోత వినిపిస్తూనే ఉంది. విమర్శకుల ప్రశంసలు సైతం అందుకొంటూ ఆయన ప్రకటిస్తున్న పథకాలు ప్రజల ఆదరణ పొందుతున్నాయి. ముఖ్యంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం,యేడాదికి మూడు ఉచిత సిలిండర్ల పథకం ప్రజల మెప్పును ఎక్కువగా పొందాయి. మహిళా భద్రతకు ఉద్దేశించినప్రత్యేక దళాలు, డ్రగ్స్ నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన 65 ప్రత్యేక టాస్క్ ఫోర్స్‌లు, 717 మద్యం దుకాణాల మూసివేత వంటి నిర్ణయాలు కూడా చక్కని ప్రజాదరణ పొందాయి. విద్యార్థులకోసం రెండు వేల కోట్లతో లాప్‌టాప్ పథకం, 710 కోట్లతో కామరాజ్ అల్పాహార పథకం, ఆరు వేల కోట్లతో గ్రామీణ మౌలిక సదుపాయాలు వంటి పథకాలు కూడా ప్రశంసలనందుకొన్నాయి. ఆగస్టు 5న ప్రవేశ పెట్టిన తొలి బడ్జెట్‌లో 'జెన్ జి' ని ఆకర్షించే పలు పథకాలు ప్రకటించడం ఆయన ముందు చూపునకు నిదర్శనం. పాఠశాల నుంచే ఎఐ విద్య, ఐటిఐల్లో ఎఐకోర్సులు, ఐదులక్షల మంది ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ విద్యార్థులకు ఎఐ శిక్షణ వంటి అనేక బడ్జెట్ ప్రతిపాదనలు దానిలో ఉన్నాయి. 100 రోజులు పూర్తయిన సందర్భంగా విజయ్ ప్రభుత్వం ఒక ప్రోగ్రెస్ రిపోర్ట్ సమర్పిస్తూ 1.2 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడి ప్రతిపాదనలు చేయడం విశేషం. ప్రకటించిన పథకాల్లో 90 శాతం అమలులోకి రావడంతో విజయ్ సక్సెస్ రేట్ బాగా పెరిగిం ది. ఇండియా టుడే సర్వే ప్రకారం విజయ్‌కి ప్రజాదరణ 70 నుంచి 75 శాతం దాకా ఉన్న ట్లు తెలుస్తోంది. కొత్త రాజకీయ ప్రత్యామ్నాయం గా విజయ్ దాదాపు 35 శాతం ఓట్లతో గత మే నెలలో అధికారంలోకి వచ్చారు. ఆయన వ్యవహార శైలి విభిన్నంగా ఉండడంతో ప్రజలను ఆకర్షించినా,పథకాల అమలుతో ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని సాధించగలిగింది. అయితే గ్రామీణ ప్రాంతాల్లో టివికెకు తగినంత బలం ఇంకా చేకూరలేదనే అభిప్రాయం ఉంది. సినిమా రంగానికి



ముఖ్యమంత్రి విజయ్


చెందడంతో ఆ ఆకర్షణ ఆయనకు కలిసివచ్చిందనే వాదన కూడా సబబు కాదు. అలా కలిసి వస్తే మెజాటీకి దూరంగా 108 సీట్లు మాత్రమే ఎందుకు వస్తాయి! కాంగ్రెస్, మిత్ర పక్షాల మద్దతుతో ఎట్టకేలకు అధికారంలోకి వచ్చినా బాలారిష్టాలు ముసురుతూనే ఉన్నాయి. అధికారం కోల్పోయిన స్టాలిన్ తొలుత విజయ్‌ని తీవ్రంగా విభేదించినా, కొద్ది రోజుల్లోనే 'అసలు సినిమా చూస్తా' రంటూ శాపాలు పెట్టినా అటువంటి ' సినిమా' ఏదీ తెరపైకి రాకపోవడం గమనించవలసిన విషయం. పూర్తి మెజారిటీ లేకపోవడంతో విజయ్‌ని ఓ ఆట ఆడిద్దామనే స్టాలిన్ అనుకొన్నారు. అయితే విజయ్ ప్రకటించిన పథకాలే ఇప్పుడు ఆయనకు శ్రీరామ రక్ష అవుతున్నాయి. దాదాపు ఆరు దశాబ్దాల ద్రవిడ పార్టీల పాలన నుంచి తమిళనాడుకు విముక్తి కలిగించి డిఎంకె, అన్నా డిఎంకెలను పక్కకు నెట్టిన 'నాయకుడు'గా ఎదుగుతున్న విజయ్ పరుగుకు బ్రేక్ వేసే యత్నాలు గత వందరోజుల్లో చాలానేజరిగాయి. 2026 ఎన్నికల్లో డిఎంకె పార్టీకి 24 శాతం ఓట్లు రాగా, అన్నాడిఎంకెకు 21శాతంవచ్చాయి. విజయ్‌ని ఓడించాలంటే ఈ రెండు పార్టీల ఓట్ల శాతాలు ఏకం కావాలి. విజయ్ ప్రమాణ స్వీకారానికి ముందు అటువంటి ప్రయత్నం కూడా ఒకటి జరిగింది. రజనీకాంత్ స్టాలిన్‌తో జరిపిన ' ప్రత్యేక భేటీ' అప్పట్లో సంచలనం సృష్టించింది. విజయ్ ప్రమాణ స్వీకార హడావుడిలో ఆ వార్త మరుగున పడినా, అది ఇప్పటికీ కదులుతూనే ఉంది. డిఎంకె, అన్నాడిఎంకెను ఒక తాటి పైకి తేవడమే లక్ష్యంగా రజనీకాంత్ ఆ చర్చలు జరిపినట్లు అప్పట్లో అంతా చెప్పుకొన్నారు. ఆ రెండు పార్టీలు కలుస్తాయా? అనే ప్రశ్నకు జవాబు చెప్పలేం. ఎంచుకొనే లక్ష్యాన్ని బట్టి ఏది జరగడానికైనా అవకాశం ఉంటుంది. ఆ ప్రయత్నం కొనసాగితే రాజకీయ సమీకరణాలు కూడా మారుతాయి. అది పసిగట్టడం వల్లనే అన్నాడిఎంకెలో చీలిక తేవడానికి విజయ్ చాలా పెద్ద ప్రయత్నమే చేసినట్లు వినిపించింది. చాప కింద నీరులా ఆ కథ నడుస్తూనే ఉంది. ఇప్పటి వరకు చూస్తే విజయ్ పాలన ఇంకా 'విజయ వంతమైన ప్రారంభం' గానే చెప్పాలి. విజయవంతమైన సిఎం కావడానికి మరికొంత కాలం పట్టవచ్చు. ముందు అనేక సవాళ్లను అధిగమించవలసి ఉంటుంది. పరందూరు రెండో విమానాశ్రయం ప్రాజెక్టు రద్దు, కావేరీ జల వివాదం ప్రస్తుతం ఆయన మెడకు చుట్టుకొంటున్నాయి. కరూర్ బాధిత కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలిస్తూ విజయ్ తీసుకొన్న నిర్ణయాన్ని హైకోర్టు తిరస్కరించడం కూడా ఆయన ప్రభుత్వానికి పెద్ద ఎదురు దెబ్బ. ఇటువంటి కొన్ని మైనస్‌లున్నా విజయ్ సర్కార్‌కు ప్రజాదరణ 70 శాతం ఉండడం కూడా గమనించవలసిన మరో అంశం. అయితే ఈ రేటింగ్‌ను నిలబెట్టుకొనడానికి ఆయన ముందు ముందు ఏఏచర్యలు తీసుకొంటారనే విషయం పైనే టివికె పార్టీ రాజకీయ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. ●

అమెరికా

# మధ్యవర్తి మంతనాలు!

**గన్ని మోహన్**

నాలుగేళ్లు దాటిన రష్యాఉక్రెయిన్ యుద్ధ విరమణకు అమెరికా శతవిధాలా ప్రయత్నిస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం రష్యా సైన్యం ఎదుర్కొంటున్న భారీ నష్టాలతో అదనపు భూభాగం ఏమీ సాధించలేకపోయిందని అమెరికా సిఐఎ అంచనావేసింది. మరోపక్క వేలాదిగా డ్రోన్లతో ఉక్రెయిన్ నగరాలను ధ్వంసంచేస్తున్న రష్యా సేనలకు ఇప్పుడు అదనంగా మరో మూడు లక్షలమంది సైన్యాన్ని కూడా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సమకూర్చుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఏళ్లతరబడి సాగుతున్న ఈ ఉక్రెయిన్ రష్యా యుద్ధానికి తెరదించాలన్న లక్ష్యంతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కాల్పుల విరమణ చర్చలకు మళ్లీ తెరలేపినట్లు తెలుస్తోంది. అమెరికా రక్షణ విమానం హఠాత్తుగా మాస్కోలో ల్యాండ్ అయిన సంఘటన ప్రపంచ వ్యాప్తంగా ఆశ్చర్యం కలిగించింది. అందులో సిఐఎ చీఫ్ జాన్ రాట్‌క్లిఫ్ రహస్యంగా మాస్కోను సందర్శించి ఆదేశ ఫెడరల్ సెక్యూరిటీ సర్వీస్ (ఎఫ్ఎస్‌బీ) చీఫ్ అలెగ్జాండర్ బోర్ట్నికోవ్‌తో సమావేశమై కాల్పుల విరమణకు చర్చలకు ముందుకురావాలని కూడా ట్రంప్ సందేశంగా వినిపించినట్లు సమాచారం. రష్యా సైనిక, ఆర్థిక పరిస్థితి మరింత దిగజారకముందే తీవ్ర స్థాయిలో చర్చలు ప్రారంభించాలని ఆయన సూచించినట్లు సమాచారం. రష్యాసైనిక బలగాలు యుద్ధ రంగంలో చెల్లిస్తున్న మూల్యాన్ని ర్యాట్‌క్లిఫ్ తన అంచనాలో ప్రస్తావించినట్లు తెలుస్తోంది. తాను సీఐఏ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన 18 నెలల కాలంలో రష్యా ఉక్రెయిన్ మొత్తం భూభాగంలో కేవలం ఒకటి శాతంమేర మాత్రమే అదనంగా స్వాధీనం చేసుకోగలిగిందని ఆయన గుర్తుచేసారు. ప్రస్తుత, మాజీ అమెరికా అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం రష్యా ఎఫ్ఎస్‌బీ చీఫ్ బోర్ట్నికోవ్‌కు ర్యాట్‌క్లిఫ్ నేరుగా తన అంచనాలను వివరించినట్లు తెలుస్తోంది. అమెరికా సీఐఏ రష్యా ఎఫ్ఎస్‌బీతో పాటు విదేశీగూఢచారి సంస్థ ఎస్‌వీఆర్‌తోనూ కమ్యూనికేషన్ చానళ్లను కొనసాగిస్తోంది. దీంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తరపున చర్చలు జరుపుతున్న దౌత్య ప్రతినిధుల ప్రయత్నాలకు భిన్నంగా ఈ తాజా సంప్రదింపులు జరిగినటు తెలుస్తోంది. రష్యా తన యుద్ధ లక్ష్యాలను సాధించేందుకు అవసరమైన స్థాయిలో యుద్ధరంగంలో పురోగతి సాధించడం లేదన్న విషయాన్ని మాస్కో గుర్తించాలని ర్యాట్‌క్లిఫ్ స్పష్టం చేసారు. రష్యా సైనికుల నష్టాలపై ర్యాట్‌క్లిఫ్ చేసిన వ్యాఖ్యలు మాస్కోకు ఈ యుద్ధం మరింత ఖరీదైనదిగా మారుతోందన్న అమెరికా విస్తృత అంచనాలకు అనుగుణంగా ఉన్నాయి. రష్యాదళాల పురోగతిని అడ్డుకో వడంలో ఉక్రెయిన్ డ్రోన్ యుద్ధతంత్రం కీలక పాత్ర పోషిస్తోందని కూడా సీఐఏ డైరెక్టర్ పేర్కొన్నట్లు సమాచారం. నిలిచిపోయిన చర్చలను పునరుద్ధరించేందుకు అమెరికా ప్రయత్నాలు



జాన్ ర్యాట్‌క్లిఫ్

మాస్కోలో ర్యాట్‌క్లిఫ్ పర్యటన పెద్దగా పురోగతి సాధించని రష్యా ఉక్రెయిన్ చర్చలను తిరిగి ప్రారంభించేందుకు ట్రంప్ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల క్రమంలో జరిగిందనే భావించాలి. ట్రంప్ తిరిగి అధికారంలోకి వచ్చినతర్వాత ఉక్రెయిన్‌కు అమెరికా సైనిక సహాయం తగ్గింది. దీంతో యూరోపియన్ దేశాలు ఉక్రెయిన్‌కు మరింత సహాయాన్ని అందించాల్సిన పరిస్థితి ఏర్పడింది. మాస్కోకు వెళ్లే ముందు ర్యాట్‌క్లిఫ్ ఉక్రెయిన్ అధికారులతో మాట్లాడినట్లు సమాచారం. రష్యా చర్చల వైఖరిని మాత్రమే పరిశీలిస్తానని, ఉక్రెయిన్ తరపున ఎలాంటి రాయితీలు ఇవ్వబోనని ఆయన వారికి హామీఇచ్చారు. ట్రంప్ తరపున చర్చలు జరుపుతున్న స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నర్ నిర్వహిస్తున్న సంప్రదింపులపై ఇప్పటికే అనుమానాలు వ్యక్తం చేస్తున్న కీవ్‌కు ఈ అంశంముఖ్యమైనదే. డాన్‌బాస్ ప్రాంతంలో రష్యాదాడులు పెద్దగా ముందుకు సాగకపోవడం, అదే సమయంలో రష్యా భూభాగంలోని లోతైన ప్రాంతాల్లోని లక్ష్యాలపై డ్రోన్లతో దాడులు చేసే సామర్థ్యాన్ని ఉక్రెయిన్ కొనసాగించడం రాబోయే శీతాకాలంలో చర్చలకు అవకాశం కల్పించవచ్చని యూరోపియన్ దౌత్యవేత్తలు కూడా అంచనాలువేసారు. రష్యాపై చాలాకాలంగా విమర్శలు చేస్తున్న ఆయన గూఢచార సంస్థల మధ్య కొనసాగుతున్న మార్గాల ద్వారా అమెరికా అంచనాలను నేరుగా మాస్కోకు తెలియ జేయగలుగుతున్నారు. అమెరికా రష్యా మధ్య ఇలాంటి గూఢచారి స్థాయి సంప్రదింపులకు గతంలోనూ ఉదాహరణలు ఉన్నాయి. 2021 నవంబర్‌లోఅప్పటి సీఐఏ డైరెక్టర్ విలియం బర్న్స్ మాస్కోను సందర్శించి బోర్ట్నికోవ్‌తో పాటు పలువురు సీనియర్ రష్యా అధికారులను కలిశారు. ఉక్రెయిన్‌పై పూర్తి స్థాయి దాడికి దిగితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని అప్పట్లో రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను హెచ్చరించారు. ఆ తర్వాతి ఏడాది రష్యా అణు ఆయుధాలను ఉపయోగించే అవకాశంపై ఆ దేశ కమ్యూనికేషన్లను అమెరికా నిఘా సంస్థలు గుర్తించిన నేపథ్యంలో బర్న్స్ రష్యా ఇంటెలిజెన్స్ చీఫ్ సెర్గీ నారిష్కిన్‌ను టర్కీలోని అంకారాలో కలిశారు. అణ్వాయుధాలను ఉపయోగించే దిశగా మాస్కో అడుగులు వేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. ట్రంప్ తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత ఖైదీల మార్పిడి విషయంలో ర్యాట్‌క్లిఫ్, బోర్ట్నికోవ్‌లు గతంలో గూఢచారి వ్యవస్థలద్వారా సంప్రదింపులు జరిపారు. మాస్కోలో జరిగిన తాజా సమావేశం వీరిద్దరి తొలి ముఖాముఖి భేటీగా తెలుస్తోంది. దౌత్య ప్రతిష్టంభనకు తెరదించేందుకు ప్రయత్నం గూఢచారి సంస్థల మధ్య ఉన్న సంప్రదింపుల మార్గాలను ఉపయోగించుకుని రష్యా, ఉక్రెయిన్ దౌత్య ప్రతిష్టంభనను తొలగించేందుకు అమెరికా మరో ప్రయత్నం చేస్తున్నట్లు తాజా పరిణామాలు సూచిస్తున్నాయి. యుద్ధరంగంలో ఒత్తిడిని కొనసాగించడం ద్వారా రష్యా మరింత భూభాగాన్ని స్వాధీనం చేసుకోగలదా? లేక చర్చల ద్వారా మరిన్ని ప్రయోజనాలను సాధించగలదా? అన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. ●

# ఇంజినీరింగ్ విద్యకు నాణ్యమైన పునాది అవసరం

**జీ. శ్రీలత**

దేశంలో ఇంజినీరింగ్ విద్య పరిస్థితి నానాటికీ ఆందోళనకరంగా మారుతోంది. ఒకప్పుడు ఇంజినీరింగ్ అంటే భవిష్యత్తుకు భరోసా, మంచి ఉద్యోగానికి మార్గం, కుటుంబానికి ఆర్థిక స్థిరత్వానికి చిహ్నంగా భావించేవారు. కానీ నేడు పరిస్థితి అందుకు భిన్నంగా కనిపిస్తోంది. ప్రతి ఏటా లక్షలాది మంది విద్యార్థులు బీటెక్ పట్టాలు చేతబట్టుకుని బయటకు వస్తున్నప్పటికీ, వారిలో పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాలు కలిగినవారి సంఖ్య మాత్రం ఆశించిన స్థాయిలో లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. 'డిగ్రీలు ఇస్తున్నామా? లేక ఇంజినీర్లను తయారు చేస్తున్నామా?' అనే ప్రశ్న ఇప్పుడు గట్టిగా వినిపించాల్సిన సమయం వచ్చింది. ఇంజినీరింగ్ కళాశాలలు కేవలం తరగతి గదులు,ఫీజుల వసూళ్లు, పరీక్షలు, హాజరు, సెమిస్టర్ ఫలితాలకే పరిమితమైతే వాటి అసలు ఉద్దేశ్యం నెరవేరదు. ఒక ఇంజనీర్ అంటే కేవలం పాఠ్యాంశాలను చదివి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వ్యక్తి కాదు. సమస్యను గుర్తించి, దానికి సాంకేతిక పరిష్కారం కనుగొని, ఆ పరిష్కారాన్ని ఆచరణలోకి తీసుకురాగల సృజనాత్మక మేధస్సు కలిగిన వ్యక్తి. కానీ మన ఇంజినీరింగ్ విద్యా వ్యవస్థలో ఈ దిశగా ఎంతవరకు కృషి జరుగుతోంది అన్నది సమీక్షించాల్సిన అవసరం ఉంది. నిబంధనల ప్రకారం సాంకేతిక కళాశాలల్లో పటిష్టమైన గ్రంథాలయాలు, తగినన్ని పాఠ్యపుస్తకాలు, రిఫరెన్స్ పుస్తకాలు, పరిశోధనా జర్నల్స్, డిజిటల్ వనరులు, ఆధునిక ప్రయోగశాలలు ఉండాలి. అయితే క్షేత్రస్థాయిలో అనేక ప్రైవేట్, అనుబంధ కళాశాలల్లో పరిస్థితి భిన్నంగా ఉందన్న విమర్శలు ఉన్నాయి. విద్యార్థులకు నాణ్యమైన పుస్తకాలు అందుబాటులో లేకపోవడం, భౌతిక గ్రంథాలయాలు పేరుకే ఉండటం, ప్రయోగశాలలు తగిన స్థాయిలో పనిచేయకపోవడం వంటి సమస్యలు విద్యా ప్రమాణాలను ప్రభావితం చేస్తున్నాయి. నోట్స్, ఫొటోకాపీలు, డిజిటల్ పీడీఎఫ్‌లతోనే విద్యార్థుల విద్యాభ్యాసాన్ని నడిపించడం ఎంతవరకు సమంజసం? డిజిటల్ వనరులు అవసరమే. కానీ అవి పుస్తక పఠనానికి, పరిశోధనకు ప్రత్యామ్నాయం కావు. ఒక విద్యార్థి వివిధ రచయితల పుస్తకాలు చదవాలి. విభిన్న అభిప్రాయాలను తెలుసుకోవాలి. పరిశోధనా పత్రాలను అధ్యయనం చేయాలి. ప్రశ్నించే అలవాటు పెంచుకోవాలి.అప్పుడే ఆలోచనాశక్తి, విశ్లేషణాత్మక సామర్థ్యం, సృజనాత్మకత పెరుగుతాయి. పుస్తకాలు, పరిశోధన వాతావరణం, ప్రయోగశాలలు లేని ఇంజనీరింగ్ విద్య కేవలం డిగ్రీలను ఇవ్వగలదేమో కానీ ఆవిష్కర్తలను తయారు చేయగలదా? అన్న ప్రశ్నకు విద్యా వ్యవస్థ సమాధానం చెప్పాలి. జర్మనీ, ఫిన్లాండ్, అమెరికా తదితర దేశాల్లో ఇంజనీరింగ్ విద్యలో ప్రాజెక్ట్ ఆధారిత అభ్యాసానికి ప్రాధాన్యం ఉంటుంది. విద్యార్థి కేవలం పుస్తకంలోని సిద్ధాంతాన్ని చదివి పరీక్ష రాయడం మాత్రమే కాకుండా, ఆ సిద్ధాంతాన్ని వాస్తవ జీవితంలో ఎలా ఉపయోగించాలో నేర్చుకుంటాడు.అక్కడి అనేక సాంకేతిక విద్యా సంస్థలు సీడీఐఓ కాన్సీవ్, డిజైన్, ఇంప్లిమెంట్, ఆపరేట్ విధానాన్ని ప్రోత్సహిస్తున్నాయి. అంటే ఒక సమస్యను ఊహించడం నుంచి పరిష్కారాన్ని రూపొందించడం,అమలు చేయడం,ఆ తర్వాత దానిని పనిచేసే స్థాయికి తీసుకు రావడం వరకు విద్యార్థి స్వయంగా అనుభవిస్తాడు. ఇదేవిధానం మన దేశంలో కూడా విస్తృతంగా అమలుకావాలి. ఉదాహరణకు ఒక గ్రామంలో తాగునీటి సమస్య ఉంటే విద్యార్థులు దానికి తక్కువ ఖర్చుతో నీటి శుద్ధివ్యవస్థ రూపొందించాలి. వ్యవసాయంలో నీటివృథాను తగ్గించే సాంకేతిక పరిష్కారాన్ని అభివృద్ధి చేయాలి. ట్రాఫిక్ సమస్యకు కృత్రిమ మేధ ఆధారిత పరిష్కారం రూపొందించాలి. ప్రభుత్వ పాఠశాలలకు తక్కువ ఖర్చుతో డిజిటల్ విద్యా పరికరాలను అభివృద్ధి చేయాలి. ఇలాంటి ప్రాజెక్టులు విద్యార్థులను కేవలం ఉద్యోగార్థులుగా కాకుండా సమస్య పరిష్కారకులుగా, ఆవిష్కర్తలుగా, భవిష్యత్తు పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దగలవు. మన దేశంలో మరో ప్రధాన సమస్య పరిశ్రమకు, కళాశాలలకు మధ్య ఉన్న అంతరం. కళాశాలలో బోధించే సాంకేతిక పరిజ్ఞానం, పరిశ్రమల్లో వాస్తవంగా ఉపయోగించే



సాంకేతిక పరిజ్ఞానం మధ్య తేడా ఉండటం వల్ల విద్యార్థులు పట్టా పొందిన తర్వాత మళ్లీ శిక్షణ పొందాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ప్రతి ఇంజినీరింగ్ కళాశాల కనీసం కొన్ని పరిశ్రమలతో దీర్ఘకాలిక భాగస్వామ్యాలు ఏర్పాటు చేసుకోవాలి. విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు, పరిశ్రమ సందర్శనలు, ప్రత్యక్ష ప్రాజెక్టులు, నిపుణుల ఉపన్యాసాలు, పరిశోధనా అవకాశాలు కల్పించాలి. చివరి సంవత్సరం ప్రాజెక్ట్ అనేది కేవలం మార్కుల కోసం తయారు చేసే నివేదికగా కాకుండా, వాస్తవ పరిశ్రమ లేదా సామాజిక సమస్యకు పరిష్కారంగా ఉండాలి. అలా జరిగితే కళాశాలల్లోనే స్టార్టప్‌లకు బీజం పడుతుంది. విద్యార్థుల పరిశోధనలు పేటెంట్లుగా మారవచ్చు. వారి ప్రాజెక్టులు వ్యాపార ఉత్పత్తులుగా మారవచ్చు. దేశ ఆర్థికాభివృద్ధికి ఇంజినీరింగ్ విద్య నేరుగా దోహదపడే అవకాశం ఏర్పడుతుంది. ఇంజినీరింగ్ విద్యలో హాజరు నిబంధనపై కూడా కొత్తగా ఆలోచించాల్సిన సమయం వచ్చింది. విద్యార్థి నిర్దిష్ట శాతం తరగతులకు హాజరు కావాలనే నిబంధనకు విద్యా పరంగా కారణాలు ఉన్నాయి. ప్రయోగశాలలు, ప్రత్యక్ష బోధన, బృంద కార్యకలాపాలు, అధ్యాపకులతో పరస్పర చర్చ వంటి అంశాలకు భౌతిక హాజరు అవసరం ఉంటుంది. అయితే హాజరును మాత్రమే విద్యార్థి సామర్థ్యానికి కొలమానంగా చూడటం మాత్రం సమంజసం కాదు. ఒక విద్యార్థి తరగతిలో కూర్చున్న గంటల సంఖ్య కంటే అతను నేర్చుకున్నది ఏమిటి? ఏ ప్రాజెక్ట్ చేశాడు? ఏ సమస్యను పరిష్కరించాడు? ఎలాంటి పరిశోధన చేశాడు? ఏ నైపుణ్యం సంపాదించాడు? అన్నది ముఖ్యమవ్వాలి. ఆన్‌లైన్ కోర్సులు, వర్చువల్ ల్యాబ్‌లు, ప్రపంచంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాల ఓపెన్ కోర్సులు అందుబాటులో ఉన్న ఈ డిజిటల్ యుగంలో విద్యార్థి అభ్యాసాన్ని మరింత సమగ్రంగా అంచనా వేయాలి. హాజరుతో పాటు ప్రాజెక్ట్, అసైన్‌మెంట్, పరిశోధన, ప్రెజెంటేషన్, ఇంటర్న్‌షిప్, నైపుణ్య పరీక్షలకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలి. అయితే దీనిని హాజరు పూర్తిగా రద్దు చేయాలనే డిమాండ్‌గా చూడకూడదు. హాజరు,అభ్యాస ఫలితాలు, ప్రాజెక్టులు, నైపుణ్యాలు అనే సమగ్ర విధానం అవసరం. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఇంజినీరింగ్ విద్యలో భారీ స్థాయిలో సీట్లు అందుబాటులో ఉన్నాయి. కృత్రిమ మేధ, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, కంప్యూటర్ సైన్స్ వంటి కోర్సులపై విద్యార్థుల్లో విపరీతమైన ఆసక్తి కనిపిస్తోంది. అదే సమయంలో సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ వంటి సంప్రదాయ ఇంజినీరింగ్ కోర్సుల్లో మారుతున్న పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యా విధానాలను పునర్వ్యవస్థీకరించాల్సిన అవసరం ఉంది. ఇంజినీరింగ్ సీట్లసంఖ్యపెంచడం మాత్రమే పరిష్కారం కాదు. నాణ్యత పెంచడం అసలు పరిష్కారం. కళాశాలలు ఎక్కువగా ఉండటం కంటే నాణ్యమైన ఇంజినీర్లను తయారు చేసే కళాశాలలు ఎక్కువగా ఉండాలి. ఉద్యోగావకాశాల విషయంలో కూడా గణాంకాలు మనల్ని ఆలోచింపజేస్తున్నాయి. వివిధ నైపుణ్య, ఉపాధి నివేదికలు ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లలో ఒక వర్గం మాత్రమే పరిశ్రమకు తక్షణం సిద్ధంగా ఉంటోందని సూచిస్తున్నాయి. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడం ఒక విషయం, పరిశ్రమలో పనిచేయడానికి అవసరమైన ప్రోగ్రామింగ్, కమ్యూనికేషన్, సమస్య పరిష్కారం, బృందపని, ప్రాజెక్ట్ నిర్వహణ, విశ్లేషణాత్మక ఆలోచన వంటి నైపుణ్యాలు కలిగి ఉండటం మరో విషయం. ఇక్కడే మన విద్యావ్యవస్థలోని అసలు లోపం బయటపడుతోంది. ఒక విద్యార్థిని ఇంజనీరింగ్‌లో చేర్పించేందుకు మధ్యతరగతి కుటుంబాలు ఎన్నో త్యాగాలు చేస్తున్నాయి. ట్యూషన్ ఫీజులు,హాస్టల్ ఫీజులు, రవాణా ఖర్చులు, పుస్తకాలు, ఇతర విద్యాఖర్చులు భరించేందుకు తల్లిదండ్రులు అప్పులు చేసే పరిస్థితి కూడా ఉంటుంది. అంత ఖర్చు చేసి చదివించిన తర్వాత విద్యార్థి చేతిలో కేవలం ఒక డిగ్రీ, ఒక మార్కుల పట్టిక మాత్రమే మిగిలితే అది కుటుంబానికి మాత్రమేకాదు, దేశానికి కూడా నష్టం. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు, నియంత్రణ సంస్థలు, విశ్వవిద్యాలయాలు, కళాశాలల యాజమాన్యాలు కలిసి ఇంజనీరింగ్ విద్యపై సమగ్ర సమీక్ష నిర్వహించాలి. ఇప్పటికైనా ప్రభుత్వాలు, నియంత్రణ సంస్థలు,విశ్వవిద్యాలయాలు, కళాశాలల యాజమాన్యాలు మేల్కొనాలి. పేరు గొప్ప ఊరుదిబ్బ అన్న చందంగా మారుతున్న ఇంజనీరింగ్‌విద్యకు నాణ్యత అనేపునాది వేయాలి. అప్పుడే తల్లిదండ్రుల కలలు నెరవేరతాయి. విద్యార్థుల భవిష్యత్తు భద్రమవుతుంది. ●

# మృత్యువుకు 30 సెకన్ల దూరంలో..

## ఒకేఒక్క మెసేజ్ 8 మంది ప్రాణాలు నిలిపింది

**ఖాట్మాండు, ఆగస్టు 29:** ప్రకృతి కోపానికి నేపాల్‌లోని రసువా జిల్లా విలవిల్లాడింది. ఈ నెల 26న నేపాల్-టిబెట్ సరిహద్దు ప్రాంతంలో అనూహ్యంగా విరుచుకుపడిన మెరుపు పూరలు, బురద, కొండచరియల విధ్వంసంలో వందలాది మంది చిక్కుకున్నారు. అతియే భంగే ఝూర్నా సమీపంలో వంతెన నిర్మాణ పనుల్లో ఉన్న ఎనిమిది మంది శ్రామికులను ఒక ఎకైక ఎస్ఎంఎస్ రూపంలో వచ్చిన ప్రమాద హెచ్చరిక మృత్యుముఖం నుంచి కాపాడింది. మృత్యువు విరుచుకుపడటానికి సరిగ్గా 30 సెకన్ల ముందు వచ్చిన ఆ అలర్ట్, ఎనిమిది మంది ప్రాణాలను నిలబెట్టిన ఒక అద్భుతంలా మారింది.



**'ఫోన్ చూశా.. కళ్లు ఎత్తేసరికి 10 అడుగుల నీటి గోడ!'**

మెయిలుంగ్ ప్రాంతంలో నిర్మాణ బృందంతో కలిసి పనిచేస్తున్న సాంకేతిక నిపుణుడు అర్జున్ రెమాల్ తన అనుభవాన్ని పంచుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. పనిలో నిమగ్నమై ఉన్న సమయంలో ఆయన ఫోన్ ఒక్కసారిగా వైబ్రేట్ అయింది. నేపాల్ జాతీయ విపత్తు ప్రమాద నిర్మూలన సంస్థ నుంచి వచ్చిన ఆ మెసేజ్‌లో 'క్షణాల్లో ఉప్పెన రాబోతోంది. సురక్షిత ప్రాంతాలకు వెళ్లండి' అని ఉంది. 'నేను ఫోన్ వంక చూసి, అలా తల పైకెత్తేసరికి నా కళ్ల ముందు 10 అడుగుల ఎత్తున బురద, రాళ్లతో కూడిన భయంకరమైన నీటి ప్రవాహం దూసుకొస్తోంది. 'పరుగెత్తండి' అని గట్టిగా అరిచి, ఉన్నపళంగా వెనక్కి తిరక్కుండా పరుగెత్తాను. నేను నా జీవితంలో అంత వేగంగా ఎప్పుడూ పరుగెత్తలేదు. ఆ ఫోన్ చూడటం ఒక్క 30 సెకన్లు లేట్ అయినా.. ఈరోజు మేం ప్రాణాలతో ఉండేవాళ్లం కాము' అని అర్జున్ వివరించారు.

**చీకట్లో కొండలు దాటుతూ.. ప్రాణ భయంతో రాత్రంతా ప్రయాణం**

వరద ఉద్ధృతికి వంతెన కొట్టుకుపోగా, పరుగెత్తే క్రమంలో అర్జున్ తన చెప్పులు, ఫోన్, సొంత వస్తువులన్నీ కోల్పోయారు. కానీ తనతో ఉన్న ఎనిమిది మంది శ్రామికుల ప్రాణాలు కాపాడటమే ఆయనకు ముఖ్యమైంది. రాత్రి కాగానే కింద సముద్రంలా మారిన నది వైపు వెళ్లే దారి లేక, శ్రామికులంతా చుట్టూ ఉన్న కొండలు, దట్టమైన అడవుల గుండా చీకట్లోనే నడుచుకుంటూ వెళ్లారు. రాత్రి పది గంటల ప్రాంతంలో కొన్ని ఇళ్లను చూసి, తాము నువాకోట్ జిల్లాలోకి వచ్చామని గుర్తించారు. అక్కడే కొద్దిగా ఆహారం తీసుకుని విశ్రాంతి లేకుండా సురక్షిత ప్రాంతానికి పయనమయ్యారు.

**ఆర్మీ క్యాంపును చేరుకుని ఊపిరి పీల్చుకున్న శ్రామికులు**

మరుసటి రోజు గురువారం మధ్యాహ్నానికి, వారంతా నేపాల్ ఆర్మీ ఏర్పాటు చేసిన బిదూర్ రెస్క్యూ బేస్‌కు చేరుకున్నారు. ఆర్మీ క్యాంప్ వద్ద తమ కుటుంబ సభ్యుల కోసం కన్నీళ్లతో వెతుకుతున్న బాధితులను చూసి అర్జున్ కలచివేతకు గురయ్యారు. వరదలు వచ్చిన రోజు సాయంత్రం 5 గంటల తర్వాత సిగ్నల్స్ లేకపోవడం వల్ల ఎందరో కొట్టుకుపోయి ఉంటారని, ఆ సమయంలో అక్కడ ఉన్న వారు బతికే అవకాశాలు చాలా తక్కువని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతి ప్రకోపించినా, సకాలంలో వచ్చిన ఒక్క ఎస్ఎంఎస్ ఆ ఎనిమిది మంది శ్రామికుల కుటుంబాల్లో వెలుగులు నింపింది.



## నేపాల్ వరదల్లో ఇన్ఫోసిస్ ఎగ్జిక్యూటివ్ గల్లంతు

**న్యూఢిల్లీ, ఆగస్టు 29:** నేపాల్‌ను అతలాకుతలం చేస్తున్న ఆకస్మిక వరదల్లో ప్రముఖ ఐటీ సంస్థ ఇన్ఫోసిస్‌కు చెందిన ఉన్నతాధికారి ఒకరు గల్లంతయ్యారు. ఇన్ఫోసిస్ అనుబంధ సంస్థ అయిన ఇన్ఫోసిస్ పబ్లిక్ సర్వీసెస్ హెడ్‌గా పనిచేస్తున్న లక్ష్మీనాథ్‌గోపిశెట్టి, వ్యక్తిగత పర్యటన నిమిత్తం నేపాల్ వెళ్లారు. నేపాల్ టిబెట్ సరిహద్దుల్లో సంభవించిన వరదల తర్వాత ఆయన ఆచూకీ లభించడం లేదని ఇన్ఫోసిస్ నిన్న ఒక ప్రకటనలో ధ్రువీకరించింది. ఆయనను గుర్తించి, క్షేమంగా కాపాడటమే తమ కర్తవ్యమని కంపెనీ స్పష్టం చేసింది. ఈ ఘటనపై ఇన్ఫోసిస్ స్పందిస్తూ మా సహోద్యోగి లక్ష్మీనాథ్‌గోపిశెట్టి వ్యక్తిగత పర్యటనపై ఆ ప్రాంతానికి వెళ్లారు. ప్రస్తుతం ఆయనతో సంబంధాలు తెగిపోయాయి. ఆయన ఆచూకీని కనుగొనడానికి, కాంటాక్ట్ ఏర్పాటు చేయడానికి సంబంధిత ఏజెన్సీలతో కలిసి పనిచేస్తున్నాం. ఈ కష్ట సమయంలో ఆయన కుటుంబంతో నిరంతరం టచ్‌లో ఉంటూ, అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందిస్తున్నాము. అమెరికా, కెనడాలోని ప్రభుత్వ రంగ ప్రాజెక్టులపై ఇన్ఫోసిస్ పబ్లిక్ సర్వీసెస్ ప్రధానంగా దృష్టి సారిస్తుంది. మరోవైపు, ఈ వరదల తీవ్రతపై భారత విదేశాంగశాఖ కీలక వివరాలు వెల్లడించింది. ఈ విపత్కర పరిస్థితుల్లో నేపాల్‌కు అన్ని విధాలా సహాయం అందించేందుకు భారత్ సిద్ధంగాఉందని ఆయన స్పష్టం చేశారు. ఇక, లక్ష్మీనాథ్ గోపిశెట్టి నేపథ్యంచూస్తే ఆయనకు టెక్నాలజీ రంగంలో అపారమైన అనుభవంఉంది. ప్రభుత్వ రంగ సంస్థలకు వ్యూహం, టెక్నాలజీ, కార్యకలాపాలు, పరివర్తన వంటి అంశాలపై ఆయన సలహాలు అందిస్తుంటారు. ఇన్ఫోసిస్ పబ్లిక్ సర్వీసెస్ వ్యూహరచన, అమలులో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రస్తుత బాధ్యతలకు ముందు, ఆయన ఇన్ఫోసిస్‌లోనే గ్లోబల్ వైస్ ప్రెసిడెంట్‌గా, బిజినెస్ అప్లికేషన్స్ హెడ్‌గా అమెరికా, యూరప్, ఆసియా అంతటా వ్యాపారాన్ని విస్తరించారు. ఇన్ఫోసిస్‌లో చేరడానికి ముందు ఆయన యాక్సెంచర్‌లో మేనేజింగ్ డైరెక్టర్‌గా, అలాగే బేరింగ్‌పాయింట్, ఐబిఎం, పిడబ్ల్యూసీ, హెచ్‌సిఎల్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లో ఉన్నత పదవుల్లో పనిచేశారు. ప్రస్తుతం గోపిశెట్టితో కాంటాక్ట్ ఏర్పాటు చేసుకునేందుకు ఇన్ఫోసిస్ తీవ్ర ప్రయత్నాలు కొనసాగిస్తుండగా, మరోవైపు వరదల్లో చిక్కుకున్న వందలాది మంది భారతీయులను రక్షించేందుకు భారత ప్రభుత్వం విస్తృత స్థాయిలో సహాయక చర్యలను పర్యవేక్షిస్తోంది.



## సిఎంల కంటే ఎమ్మెల్యేల పనితీరుపైనే ప్రజల్లో అసంతృప్తి

**న్యూఢిల్లీ, ఆగస్టు 29:** అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్న ఉత్తరప్రదేశ్, పంజాబ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో ఓటర్ల అభిప్రాయాలు ఆసక్తికరంగా ఉన్నాయి. మూడు రాష్ట్రాల్లోనూ ప్రజలు తమ ముఖ్యమంత్రుల కంటే ఎమ్మెల్యేల పనితీరుపైనే ఎక్కువ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తాజా సర్వేలు వెల్లడించాయి. వోట్ వైబ్ నిర్వహించిన సర్వేలో మూడు రాష్ట్రాల్లోని ఆరువేల మందికి పైగా ఓటర్లను ఈనెల 25 వరకు ప్రశ్నించారు. దీనితో పాటు ఇండియా సీ ఓటర్ సర్వేలో జూలై 1 నుంచి ఆగస్టు 25 మధ్య 25,184 మంది అభిప్రాయాలను సేకరించారు. పంజాబ్, ఉత్తరాఖండ్‌తో పోల్చుకుంటే ఉత్తరప్రదేశ్‌లోనే ఎమ్మెల్యేలపై అసంతృప్తి అత్యధికంగా కనిపించింది. 49 శాతంమంది తమ ప్రస్తుత ఎమ్మెల్యేల పనితీరుపై అసంతృప్తిగా ఉన్నట్లు చెప్పారు. కేవలం 27.9 శాతం మంది మాత్రమే ఎమ్మెల్యేల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. సిఎం యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వంపై అభిప్రాయం కొంత మెరుగ్గా ఉంది. 41.8 శాతం మంది ప్రభుత్వ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేయగా, 38.4శాతం మంది అసంతృప్తి తెలిపారు. యుపిలో ప్రధాన ఎన్నికల సమస్యగా నిరుద్యోగం 23.1 శాతంతో మొదటి స్థానంలో నిలిచింది. రైతుల సమస్యలు 14.1 శాతం, విద్యవైద్యం 13.7 శాతం, ద్రవ్యోల్బణం 12.2 శాతంతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. సర్వే ప్రకారం బీజేపీ నేతృత్వంలోని కూటమి 41.8 శాతంతో స్వల్ప ఆధిక్యంలో ఉండగా, సమాజ్‌వాదీ పార్టీ కూటమికి 38.7 శాతం మద్దతు ఉంది. ఉత్తరాఖండ్‌లో సిఎం పుష్కర్ సింగ్ ధామి నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వంపై 39.1 శాతం మంది సంతృప్తి వ్యక్తంచేయగా, 38.1 శాతం మంది అసంతృప్తిగాఉన్నారు. ఎమ్మెల్యేల విషయంలో పరిస్థితి మరింత ప్రతికూలంగా ఉంది. 48 శాతంమంది ఎమ్మెల్యేల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేయగా, కేవలం 27.1 శాతంమంది సంతృప్తి తెలిపారు. పంజాబ్‌లోనూ ఎమ్మెల్యేలపై అసంతృప్తి ఎక్కువగానే ఉంది. 45.3 శాతం మంది తమ ఎమ్మెల్యేల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేయగా, 32.2 శాతం మంది మాత్రమే సంతృప్తి తెలిపారు. అయితే సిఎం భగవంత్ మాన్ నేతృత్వంలోని ఆప్ ప్రభుత్వంపై 40 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు. 35.4 శాతం మంది అసంతృప్తి తెలిపారు.

### రూ.40 లక్షలు లంచం తీసుకుంటూ

## సిబిఐకి పట్టుబడిన జిఎస్టీ అధికారులు

**ముంబయి, ఆగస్టు 29:** మహారాష్ట్రలో భారీ లంచం కేసు వెలుగులోకి వచ్చింది. రూ.40 లక్షల లంచం తీసుకున్నారనే ఆరోపణలపై ఇద్దరు జిఎస్టీ అధికారులతో పాటు మరో వ్యక్తిని సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ అరెస్ట్ చేసింది. ఈ ఘటన రాయ్‌గడ్ జిల్లాలో చోటుచేసుకుంది. స్టోన్ క్వారీకి సంబంధించిన జిఎస్టీ రాయల్టీ కేసును పరిష్కరించేందుకు తొలుత రూ.1.50 కోట్ల లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అనంతరం చర్చల తర్వాత ఆ మొత్తాన్ని రూ.40 లక్షలకు తగ్గించినట్లు సిబిఐ తెలిపింది. ఈ కేసులో సిజిఎస్టీ అదనపు కమిషనర్ వినయ్ కుమార్ కాంతేటి, జిఎస్టీ సూపరింటెండెంట్ రాకేష్ కుమార్ సిన్హా, మరో వ్యక్తి నరేందర్ రాజ్‌పుత్లను గురువారం అరెస్ట్ చేశారు. నిందితులపై లంచం డిమాండ్, స్వీకరణకు సంబంధించిన ఆరోపణలతో దర్యాప్తు చేపట్టినట్లు సిబిఐ వెల్లడించింది. ఫిర్యాదుదారుడికి చెందిన రాతి క్వారీయింగ్ సంస్థకు సంబంధించిన జిఎస్టీ రాయల్టీ కేసును పరిష్కరించేందుకు రూ.1.50 కోట్లు లంచంగా ఇవ్వాలని సూపరింటెండెంట్ డిమాండ్ చేసినట్లు సిబిఐకి ఫిర్యాదు అందింది. ఈ ఫిర్యాదు ఆధారంగా సిబిఐ ఈనెల 26న కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించింది.

లంచం మొత్తంపై జరిగిన చర్చల అనంతరం తొలుత డిమాండ్ చేసిన రూ.1.50కోట్లను రూ.40 లక్షలకు తగ్గించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అనంతరం ఈ లంచం మొత్తాన్ని వసూలు చేసే బాధ్యతను నిందితులైన ప్రభుత్వ అధికారులు నరేందర్ రాజ్‌పుత్‌కు అప్పగించినట్లు ఎర్కొంది. అధికారులు పన్నిన ఉచ్చులో నరేందర్ రాజ్‌పుత్ రూ.40 లక్షల లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడని అధికారులు తెలిపారు. అతని అరెస్టు అనంతరం కేసులో మరింత దర్యాప్తు చేపట్టిన సిబిఐ సంబంధిత జిఎస్టీ అధికారులపై కూడా చర్యలు తీసుకుంది. లంచం వ్యవహారంపై విచారణ కొనసాగుతున్న సమయంలో వినయ్ కుమార్ కాంతేటి, రాకేష్ కుమార్ సిన్హా కూడా లంచం స్వీకరణకు సంబంధించిన ఆరోపణలను అంగీకరించినట్లు అధికారులు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి మరిన్ని వివరాలను సిబిఐ దర్యాప్తు ద్వారా వెలుగులోకి తీసుకురానుంది.

## విదేశీ సహాయక బృందాల సాయాన్ని అంగీకరించిన నేపాల్



**ఖాట్మండు, ఆగస్టు 29:** విదేశీ రెస్క్యూ బృందాలు తమ దేశం వచ్చి సహాయం చేయడానికి నేపాల్ అంగీకరించని సంగతి తెలిసిందే. ఇప్పుడు ఈ విషయంతో నేపాల్ తన నిర్ణయం మార్చుకుంది. విదేశీ సహాయక బృందాలను అంగీకరించాలని నిర్ణయించింది. పరిమితంగా మాత్రమే విదేశీయుల్ని అనుమతిస్తామని నేపాల్ పేర్కొంది. బుధవారం నేపాల్‌లో భారీ వరద సంభవించడంతో 600 మంది వరకు మరణించగా, మరో 1,500 మంది వరకు గల్లంతయ్యారు. వారిని గుర్తించేందుకు నేపాల్ రెస్క్యూ బృందాలు ప్రయత్నిస్తున్నాయి. అయినప్పటికీ, ఇంకా చాలా మంది ఆచూకీ దొరకలేదు. ఇదే సమయంలో తమ బృందాల్ని సహాయక చర్యల కోసం పంపిస్తామని ఇండియాతోపాటు అమెరికా వంటి దేశాలు చెప్పాయి. అయితే, తమకు ఏ దేశ సహాయం అవసరం లేదని, తమ దేశంలోని రెస్క్యూ బృందాలే ఈ చర్యలు చేపట్టగలవని నేపాల్ తెలిపింది. గాలింపు, సహాయక చర్యలకోసం విదేశాల సాయాన్ని తిరస్కరించింది. అయితే, తమ దేశానికి ఆర్థిక సాయం అందించవచ్చని మాత్రం కోరింది. అది కూడా దేశంలోని సహాయనిధికి అందించాలని సూచించింది. కానీ, నేపాల్ తమ సాయాన్ని తిరస్కరించడంపై విదేశాలు అసంతృప్తి వ్యక్తం చేశాయి. ఇదే సమయంలో అక్కడ సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది. అనుకున్నట్లుగా సహాయక చర్యలు కొనసాగడం లేదు. అక్కడి సిబ్బంది శక్తికి మించిన భారంగా మారింది. పరిస్థితి ఊహించినదానికంటే భిన్నంగా ఉంది. ఘటన జరిగి మూడు రోజులవుతున్నా గల్లంతైన వారిని గుర్తించడంలో నేపాల్ విఫలమైంది. అటు విదేశాల నుంచి సాయం కోసం ఒత్తిళ్లు ఇటు సహాయక చర్యలు సరిగ్గా కొనసాగకపోవడంతో నేపాల్ కాస్త వెనక్కు తగ్గింది. రెస్క్యూ చర్యలకోసం విదేశాలకు అనుమతించింది. గాలింపు, సహాయక చర్యల కోసం తమ బృందాలను పంపించేందుకు విదేశాల నుంచి భారీ స్థాయిలో ఒత్తిళ్లు వస్తున్నాయి. ఇదే సమయంలో కొన్ని దేశాలకు చెందిన పౌరులు కూడా గల్లంతయ్యారు. తమ వారిని గాలించేందుకు సహాయక చర్యలకు సిద్ధంగాఉన్నాయి. అందువల్ల కొన్ని ప్రాంతాల్లో అర్హులైన కొందరు నిపుణుల్ని అనుమతిస్తున్నాం అని నేపాల్ ప్రకటించింది. నేపాల్ ఈ నిర్ణయం తీసుకోవడానికి ఇంకో కారణం ఉంది. నేపాల్ వరదల్లో గల్లంతైన వారిలో ఇండియాతోపాటు పలువురు చైనా, ఆస్ట్రేలియా, దక్షిణ కొరియా వంటి దేశాలకు చెందిన పౌరులు ఉన్నారు. వారిని రక్షించడంలో నేపాల్ ప్రభుత్వం సరిగ్గా వ్యవహరించడంలేదు. ఈ నేపథ్యంలో ఆయాదేశాలు నేపాల్‌పై ఒత్తిడి తేవడంతో, నేపాల్ విదేశీ సహాయక బృందాలకు అనుమతించింది.

## ఉద్యోగంపోతే వెంటనే అమెరికా వీడాల్సిందే!




**వాషింగ్టన్, ఆగస్టు 29:** అమెరికాలో హెచ్1బీ వీసాపై పనిచేస్తున్న వేలాది మంది భారతీయ నిపుణులకు మరింత ఆందోళన కలిగించే పరిణామాలు ఎదురవుతున్నాయి. ఉద్యోగం కోల్పోయిన తర్వాత కొత్త ఉపాధి వెతుక్కోవడానికి లేదా దేశం విడిచి వెళ్లేందుకు వీలు కల్పించే 60 రోజుల గ్రేస్ పీరియడ్‌ను రద్దు చేసే ప్రతిపాదనపై ట్రంప్ యంత్రాంగం తన సమీక్షను పూర్తి చేసింది. ఈ నిర్ణయం అమల్లోకి వస్తే, ముఖ్యంగా భారతీయ టెక్కీలు, వారి కుటుంబాలపై తీవ్ర ప్రభావం పడనుంది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ (డీహెచ్ఎస్) 60 రోజుల విచక్షణాధికార గ్రేస్ పీరియడ్ తొలగింపు అనే పేరుతో ఈ ప్రతిపాదనను ఈనెల 6న వైట్‌హౌస్‌కు పంపింది. 27న దీనిపై సమీక్ష ముగిసింది. కొన్ని మార్పులతో ఈ ప్రతిపాదన వైట్‌హౌస్ ఆమోదం పొందినట్లు అధికారిక రికార్డులు సూచిస్తున్నాయి. అయితే, ఈ ప్రతిపాదన పూర్తి వివరాలు ఇంకా బహిర్గతం కాలేదు. అందువల్ల, ప్రస్తుతం ఉన్న 60 రోజుల గ్రేస్ పీరియడ్ నిబంధన యథావిధిగా అమల్లో ఉంది. తదుపరి దశలో ఈ ప్రతిపాదిత నియమాన్ని ఫెడరల్ రిజిస్టర్‌లో ప్రచురించి, ప్రజల నుంచి అభిప్రాయాలను స్వీకరిస్తారు. ఆ తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటారు. ప్రస్తుత నిబంధన ప్రకారం హెచ్1బీ, ఎల్1, ఓ1 వంటి తాత్కాలిక ఉపాధి వీసాలపై ఉన్నవారు ఉద్యోగం కోల్పోతే 60 రోజుల వరకు అమెరికాలో ఉండవచ్చు. ఈ సమయంలో వారు కొత్త స్పాన్సర్‌ను వెతుక్కోవడం, ఇమ్మిగ్రేషన్ స్టేటస్ మార్చుకోవడం లేదా దేశం విడిచి వెళ్లడానికి ఏర్పాట్లు చేసుకోవచ్చు. ఈ ప్రతిపాదనపై ప్రెసిడెంట్స్ అడ్వైజరీ కమిషన్ ఆన్ ఏషియన్ అమెరికన్స్ మాజీ సభ్యుడు అజయ్ జైన్ భూటోరియా తీవ్రంగా స్పందించారు. ఇది అమానవీయమైన, ఆచరణకు సాధ్యం కాని నిర్ణయమని ఆయన విమర్శించారు. "ఉద్యోగం కోల్పోయిన నిపుణులకు 60 రోజుల సమయమే చాలా తక్కువ. అలాంటిది దాన్ని పూర్తిగా తొలగిస్తే, ఆ కుటుంబాలు తమ ఇళ్లు సర్దుకోవడానికి, పిల్లల చదువుల విషయంలో నిర్ణయం తీసుకోవడానికి కూడా సమయం ఉండదు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## వేదిక శుద్ధీకరణపై భగ్గుమన్న రాహుల్

### బిజెపిలో గూడుకట్టిన అంటరానితనానికి నిదర్శనమని ధ్వజం




**న్యూఢిల్లీ, ఆగస్టు 29:** కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మద్దతు తెలిపారు. ఒక ర్యాలీ కోసం ఖర్గే పాల్గొన్న వేదికను శుభ్రం చేయడాన్ని రాహుల్ తప్పుబట్టారు. అలా చేసిన వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని రాహుల్ డిమాండ్ చేశారు. మల్లికార్జునఖర్గే కొద్దిరోజులక్రితం ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానిలో ఒక ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఒక వేదిక నుంచి ప్రసంగించారు. మరుసటి రోజు కొందరు బిజెపి అనుకూల నాయకులు ఖర్గే పాల్గొన్న ఆ వేదికను పసుపు నీళ్లతో శుద్ధి చేశారు. శుద్ధీకరణ ప్రక్రియ చేపట్టారు. దీనిపై ఖర్గే మండిపడ్డారు. తాను పాల్గొన్న వేదికను పసుపు నీళ్లతో శుద్ధి చేయాల్సిన అవసరం ఏంటని ప్రశ్నించారు. ఈ విషయంలో అక్కడి బిజెపి ప్రభుత్వంపై కూడా మండిపడ్డారు. తాజాగా ఈ అంశంపై రాహుల్ గాంధీ మాట్లాడారు. ఖర్గే పాల్గొన్న వేదికఉన్న ప్రదేశాన్ని శుద్ధి చేయడం అంటరానితనానికి సూచనగా రాహుల్ అభివర్ణించారు. ఈ చర్య దళితులపై బిజెపి, ఆర్ఎస్ఎస్‌ల వైఖరికి నిదర్శనం అన్నారు. దళితుల విషయంలో ఆ పార్టీ నేతలు ఎలా వ్యవహరిస్తారో తెలుస్తోందన్నారు. ఈ చర్యకు పాల్పడిన నిందితులపై ఎస్సీ, ఎస్టీ యాక్ట్ ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదు చేసి చర్యలు తీసుకోవాలని రాహుల్ డిమాండ్ చేశారు. నిందితులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలో ప్రధాని చొరవ చూపాలని ఆయన కోరారు. ఈవిషయంలో ప్రధాని మోడీ స్పందించాలని డిమాండ్ చేశారు. ఉత్తరాఖండ్ ప్రభుత్వంతోపాటు, కేంద్ర ప్రభుత్వం కూడా ఖర్గే అంశంలో న్యాయం చేయాలని సూచించారు.

## ఉక్రెయిన్ రాజధానిపై రష్యా క్షిపణుల దాడి

**క్యీవ్, ఆగస్టు 29:** ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై రష్యా క్షిపణులతో విరుచుకుపడింది. కీవ్‌సమీపంలోని బుచాజిల్లాలో 27 మంది మరణించారు. ఈ దాడుల్లో 50 ఇళ్లు దెబ్బతిన్నాయని స్థానిక అధికారులు తెలిపారు. దాడుల కారణంగా భారీ అగ్ని ప్రమాదం జరిగిందని, పలుచోట్ల నివాసాలు దెబ్బతిన్నట్లు చెప్పారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ మాట్లాడుతూ మైలా గ్రామంలోని ఓ గోదాముపై దాడి జరిగిందని, తర్వాత భారీ పేలుడు సంభవించిందని తెలిపారు. ఆ ప్రాంతంలో ఎలాంటి పేలుడు సామాగ్రి ఉంచారనే దానిపై అధికారులు స్పష్టత ఇవ్వలేదు. నివాస ప్రాంతాల్లో మందుగుండు సామాగ్రి చేయడంపై నిల్వ సంబంధిత అధికారులపై క్రిమినల్ కేసులు నమోదైనట్లు చెప్పారు. ఇప్పటికే 370 మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వరసగా మూడు రోజుల నుంచి కీవ్‌ను రష్యా టార్గెట్ చేస్తోంది. రాజధాని ప్రాంతంపై రష్యా నిరంతరం వైమానిక దాడులు చేస్తోంది.

### ప్యాకేజ్డ్ ఫుడ్‌పై ఎఫ్ఎస్ఎస్ఎఐ

## కొత్త ప్రతిపాదనలు

### సుప్రీంకోర్టుకు ముసాయిదా అందజేత

**న్యూఢిల్లీ,ఆగస్టు 29:** ప్యాకేజ్డ్ ఫుడ్స్ పరంగా కేంద్ర ఆహారభద్రతా ప్రమాణాల సంస్థ ఎఫ్ఎస్ఎస్ఎఐ కొత్తప్రతిపాదనలను సుప్రీంకోర్టుకు సమర్పించింది. ఫ్రంట్ ఆఫ్ ప్యాకెట్ వార్నింగ్ లేబుల్స్‌కు సంబంధించి దాఖలైన కేసులో సుప్రీంకోర్టు గతంలో ఎఫ్ఎస్ఎస్ఏఐకి కీలక సూచనలు చేసింది. ప్యాకేజ్డ్ ఫుడ్‌పై ఆ ఆహారానికి సంబంధించిన ప్రభావాల్ని చూపించే లేబుల్స్ ఉండేలా చూడాలని కోర్టు ఆదేశించింది. దీనివల్ల తల్లిదండ్రులు తమ పిల్లలకు ఇస్తున్న ఫుడ్ ఎలాంటిదో ఒక అంచనాకు రాగలుగుతారు అని కోర్టు అభిప్రాయపడింది. ఈ వార్నింగ్ లేబుల్స్‌ను అమలు చేయడంలో ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆలస్యం చేసింది. దీనిపై స్పందించిన కోర్టు ఆహార తయారీ సంస్థలు, కార్పొరేట్ సంస్థల నుంచి ఎఫ్ఎస్ఎస్ఏఐపై ఒత్తిడి ఉన్నట్లు గుర్తించింది. దీనివల్ల ప్రజల ఆరోగ్యం విషయంలో ఎఫ్ఎస్ఎస్ఏఐ నిర్లక్ష్యంగా ఉన్నట్లు స్పష్టమవుతోందని సుప్రీంకోర్టు ఇటీవల వ్యాఖ్యానించింది. దీనిపై స్పందించిన ఎఫ్ఎస్ఎస్ఏఐ తాజాగా కోర్టుకు ఆరు పేజీల అఫిడవిట్ సమర్పించింది. ఎక్కువ ఉప్పు, ఎక్కువ కొవ్వు, ఎక్కువ చక్కెర ఉండే పదార్థాలున్న ఫుడ్ ప్యాకేజ్‌పై రెడ్ లేబుల్ ఉండేలా చూస్తామని కోర్టుకు తెలిపింది. కోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లోని కీలక అంశాలివి. ప్యాకెట్ల ముందు భాగంలో ఆరు కోణాలుండే ఎరుపు రంగు మార్క్ ఉంటుంది. దీనర్థం ఆ ప్రొడక్ట్‌లో అధిక చక్కెర, అధిక ఉప్పు, అధిక కొవ్వు ఉన్నాయని. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ ఆఫ్ ద ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రీసెర్చ్ 2024లో సూచించిన ప్రమాణాలకు అనుగుణంగా ఒక ఉత్పత్తిలోని పోషక విలువల్నిగుర్తిస్తారు. ఈప్రమాణాల ప్రకారం అధిక స్థాయిలో హానికర పదార్థాలుంటే రెడ్ లేబుల్ వేస్తారు. ముందు వైపు పెద్ద సైజులో రెడ్ లేబుల్ వేయడం వల్ల అది చాలా హానికరం అని పిల్లలు, తల్లిదండ్రులు గుర్తించే వీలుంది. అయితే, సహజసిద్ధమైన ఉత్పత్తులకు ఈ రూల్ వర్తించదు. అంటే తేనె, నెయ్యి, ఉప్పు, చక్కెర, నూనె వంటి వాటికి మినహాయింపు ఉంటుంది. ప్రస్తుతం సుప్రీంకోర్టుకు ఎఫ్ఎస్ఎస్ఏఐ తన అఫిడవిట్ సమర్పించింది. దీనిపై మరో 10 రోజుల తర్వాత విచారణ జరగనుంది. ఆ తర్వాత ఈ నిబంధన అమలుపై కోర్టు నిర్ణయం తీసుకుంటుంది.

# సంక్షిప్త వార్తలు

## ఖండాంతర బాలిస్టిక్ క్షిపణిని పరీక్షించిన రష్యా



**మాస్కో, ఆగస్టు 29:** ఒకవైపు ఉక్రెయిన్‌తో యుద్ధం చేస్తూనే రష్యా తన అత్యాధునిక ఆయుధాలను పరీక్షిస్తున్నది. తాజాగా ఖండాంతర బాలిస్టిక్ క్షిపణిని విజయవంతంగా పరీక్షించినట్లు రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇంటర్ కాంటినెంటల్ బాలిస్టిక్ మిస్సైల్‌ను పరీక్షించినట్లు చెప్పింది. ఆర్కన్‌గెల్స్క్ ప్రాంతంలో పెసస్కీ కాస్మోడ్రోమ్ నుంచి వార్‌హెడ్‌ను పరీక్షించారు. అయితే ఆ క్షిపణి ఈశాన్య దిక్కుకు ప్రయాణించింది.

## టిఎంసి అధినేత్రి మమతా బెనర్జీపై కేసునమోదు

**కోల్‌కతా, ఆగస్టు 29:** తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమత బెనర్జీపై కేసు నమోదైంది. కోల్‌కతా పోలీసులు ఆమెపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కోల్‌కతా హైకోర్టు ఆదేశాలను ఉల్లంఘించారనే ఆరోపణలపై కోల్‌కతా హేస్టింగ్ పోలీస్ స్టేషన్‌లో శనివారం రాత్రి ఈ కేసు నమోదైంది. ఈ వ్యవహారం రాజకీయ దుమారానికి దారి తీసింది. తనపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడాన్ని మమత బెనర్జీ తప్పు పట్టారు.

## భారత్ సరిహద్దుల్లోకి పాక్ డ్రోన్

**శ్రీనగర్,ఆగస్టు 29:** భారత సరిహద్దుల్లో అలజడి సృష్టించేందుకు పాకిస్తాన్ మళ్లీ కుట్రలకు తెరలేపింది. జమ్మూ కాశ్మీర్‌లోని నియంత్రణ రేఖ వెంట శత్రు దేశం నుంచి వచ్చిన డ్రోన్ ఒకటి ప్రత్యక్షం కావడంతో సరిహద్దులో ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొంది. పూంచ్ జిల్లా సరిహద్దుల్లో ఈ సస్పెక్టెడ్ డ్రోన్ కదలికలు కనిపించడంతో మన రక్షణ దళాలు తక్షణమే అప్రమత్తమయ్యాయి. సరిహద్దుల్లోని ఆర్మీ బలగాలు రాత్రికి రాత్రే అదనపు నిఘాను ఏర్పాటు చేసి, సరిహద్దు ప్రాంతాలను తమ ఆధీనంలోకి తీసుకున్నాయి.

## ఘోరప్రమాదం, నలుగురు విద్యార్థులు మృతి

**మధురాంతకం, ఆగస్టు 29:** తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మదురాంతకం సమీపంలో ఓ కారు అదుపుతప్పి పల్టీలు కొట్టడంతో నలుగురు విద్యార్థులు మృతి చెందారు. మరో ముగ్గురు విద్యార్థులు తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. పుదుచ్చేరి టూర్ ముగించుకుని చెన్నైకి తిరిగి వస్తుండగా ఈ విషాద ఘటన జరిగినట్లు తెలుస్తోంది. ప్రయాణిస్తున్న కారులో ఒక్కసారిగా వెనుక టైరు పేలడంతో వాహనం అదుపుతప్పినట్లు సమాచారం. దీంతో కారు పలుమార్లు పల్టీలు కొట్టినట్లు తెలుస్తోంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మరో ముగ్గురు విద్యార్థులను వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించారు.

## జావోజోంగ్‌పై జిన్‌పింగ్ వేటు

**బీజింగ్, ఆగస్టు 29:** చైనా సైన్యంలో కీలక జనరల్, 2017 డోక్లామ్, 2020 గల్వాన్ ఘర్షణకు బాధ్యుడిగా భావిస్తు జావో జోంగ్‌కిపై చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ చర్యలు తీసుకున్నారు. జావోను చైనాలోని అత్యున్నత రాజకీయ సలహా సంస్థ అయిన చైనీస్ పీపుల్స్ పొలిటిషియన్ కన్సల్టేటివ్ కాన్ఫరెన్స్ నుంచి తొలగించడంతో పాటు మరో రెండు కీలక పదవుల నుంచి కూడా తప్పించారు. భారత సరిహద్దులో ఉన్న టిబెట్, షింజియాంగ్ ప్రావిన్సులతో పాటు భారత్‌చైనా సరిహద్దులోని చాలా ప్రాంతాలకు బాధ్యత వహించే పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ వెస్ట్రన్ థియేటర్ కమాండ్‌కు జావో జోంగ్ నాయకత్వం వహించాడు.

## పుఝల్ జైలులో సిఎం విజయ్ ఆకస్మిక తనిఖీలు

**చెన్నై, ఆగస్టు 29:** తమిళనాడు సిఎం జోసెఫ్ విజయ్ శుక్రవారం చెన్నై సమీపంలోని పుఝల్ సెంట్రల్ జైలులో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. జైలు సదుపాయాలు, ఖైదీలకు అందుతున్న వైద్యం, ఆహారం, విద్య, వృత్తి శిక్షణ తదితర అంశాలను ఆయన పరిశీలించారు. ఖైదీలతో నేరుగా మాట్లాడి వారి అవసరాలు, సమస్యలను కూడా తెలుసుకున్నారు. పుఝల్ సెంట్రల్ ప్రిజన్1లోని పలు విభాగాలను సిఎం విజయ్ పరిశీలించారు.



# తెలుగు భాష, లిపిని భావితరాలకు సజీవంగా అందించాలి: సిఎం చంద్రబాబు

**డిజిటల్ యుగంలో పిల్లలకు తెలుగు రాయడం నేర్పించాలని సూచన**

**తెలుగు నేర్పించే 'కూల్‌ఫబెట్స్' యాప్ రూపకర్తలకు అభినందనలు**

**ఎఐ టెక్నాలజీతో చేతిరాతను మెరుగుపరిచేలా యాప్ రూపకల్పనపై హర్షం**

**విజయవాడ,ఆగస్టు 29, ప్రభాతవార్తప్రతినిధి:** దేశ భాషలందు తెలుగు లెస్స అని శ్రీకృష్ణదేవరాయలు కీర్తించిన మన తెలుగు భాష గొప్పదనాన్ని భావితరాలకు సజీవంగా అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. మాటల్లోనే కాదు, అక్షరాల్లోనూ తెలుగు భాష వైభవం తరతరాలకు నిలవాలని ఆయన ఆకాంక్షించారు. నేటి డిజిటల్ యుగంలో పిల్లలకు తెలుగు చదవడం, రాయడంపై ఆసక్తి పెంచాల్సిన అవసరాన్ని ఆయన నొక్కిచెప్పారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ముఖ్యమంత్రి తన అభిప్రాయాలను పంచుకున్నారు. చిన్నతనం నుంచే పిల్లల్లో అక్షరంపై మమకారం, భాషపై అభిమానం పెంచితేనే మన తెలుగు లిపి భవిష్యత్తులోనూ వెలుగుతుందని చంద్రబాబు పేర్కొన్నారు. ఇందులో భాగంగా, తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా విడుదలైన కూల్‌ఫబెట్స్ యాప్‌ను ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. ఆటపాటల ద్వారా పిల్లలకు తెలుగుతో పాటు ఇతర భారతీయ భాషలను చదవడం, రాయడం నేర్పించే ఈ యాప్‌ను రూపొందించడం అభినందనీయమని అన్నారు. ఈ యాప్ రూపకర్తలైన కొల్లు రంజిత్, వెంకట్ ఏలేటితో పాటు వారి బృందానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ యాప్‌లో వినియోగించిన సాంకేతికతను ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) టెక్నాలజీ సహాయంతో పిల్లల చేతి రాతను పరిశీలించి, దాన్ని మెరుగుపరచడానికి అవసరమైన మార్గదర్శకత్వం అందించేలా యాప్‌ను తీర్చిదిద్దడంపై హర్షం వ్యక్తం చేశారు. సాంకేతికత మన భాషను దూరం చేయకూడదని, దానికి మరింత చేరువ చేసే సాధనంగా మారాలని సూచించారు."మన భాష, మన లిపి, మన సంస్కృతే మన తెలుగు జాతికి అసలైన గుర్తింపు. తేనెలొలికే మన తెలుగు భాష, భావి తరాల్లోనూ చిరస్థాయిగా వెలుగొందాలి అని ముఖ్యమంత్రి చంద్రబాబు తన పోస్టులో ఆకాంక్షించారు.

**విద్యార్థి దశ నుంచే తెలుగు భాషపై ఆసక్తి పెంచాలి:డి.సిఎం పవన్**

విద్యార్థి దశ నుంచే పిల్లల్లో తెలుగు భాషపై ఆసక్తి పెంచాలని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు. తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారందరికీ ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. నిత్య జీవితంలో వాడుక భాష ప్రాధాన్యత కోసం గిడుగు రామ్మూర్తి పంతులు గారు చేసిన కృషి ఎంతో విశిష్టమైనదని ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ కొనియాడారు. మన అందరి అమ్మ భాష తెలుగు అని, దానిని మనం ఎప్పుడూ మరచిపోకూడదని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు.తెలుగు భాషాభ్యున్నతికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటుందన్నారు.

**గిడుగు వెంకట రామమూర్తికి ఘననివాళులు: మంత్రి లోకేశ్**

గిడుగు వెంకట రామమూర్తి జయంతి సందర్భంగా రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ఆయనకు ఘన నివాళులు అర్పించారు. తెలుగు భాషా వికాసానికి, వ్యవహారిక భాషా ఉద్యమానికి గిడుగు వెంకట రామమూర్తి గారు చేసిన సేవలు చిరస్మరణీయమని ఈ సందర్భంగా లోకేశ్ కొనియాడారు. ఈ జయంతిని పురస్కరించుకుని ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికీ మంత్రి లోకేశ్ శుభాకాంక్షలు తెలియజేశారు. పాఠశాల విద్యారంగంలో తమ ప్రభుత్వం తెలుగుకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తుందన్నారు.తెలుగు భాష పట్ల విద్యార్థుల్లో ఆసక్తి పెంచే దిశలో చర్యలు తీసుకుంటుందన్నారు.

# ఫస్ట్ ఎవర్ ఫ్యాక్టరీ ఔట్లెట్‌గా ముకుంద జ్యువెలర్స్

**విజయవాడలో12వ షోరూం ఘనంగా ప్రారంభోత్సవం**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు29:** ఫస్ట్ ఎవర్ ఫ్యాక్టరీ ఔట్లెట్‌గా మన తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ముకుంద జ్యువెలర్స్ ఇప్పుడు 12 వ షోరూం విజయవాడకు తొలిసారిగా అడుగుపెడుతున్నది. ఈ ఘన ప్రారంభంకు విచ్చేసిన అందరికి హృదయపూర్వక ఆహ్వానం. ముకుంద జ్యువెలర్స్ షో రూమ్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన మన ప్రియతమ నేతలు, మంత్రివర్యులు టి.జి. భరత్(ఇండస్ట్రీస్ అండ్ కామర్స్ ఫుడ్ ప్రాసెసింగ్), పార్లమెంట్ సభ్యులు కేశినేని శ్రీనివాస్(చిన్ని)- విజయవాడ,శాసనసభ సభ్యులు గద్దె రామ్మోహన్(విజయవాడ ఈస్ట్),బోండా ఉమా మహేశ్వర్(విజయవాడ-సెంట్రల్) విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. ముకుంద జ్యువెలర్స్ ఛైర్మెన్, బత్తి నరసింహ రెడ్డి ఆధ్వర్యంలో మన విజయవాడలో 12వ షో రూమ్ ఘన ప్రారంభం జరిగింది, ఈ సందర్భంగా ముకుంద డైరెక్టర్లు డాక్టర్ నిఠిత రెడ్డి, డాక్టర్ కృష్ణ,ఎస్.బూదారెడ్డి మాట్లాడుతూ ఈ ఘన ప్రారంభం సందర్భంగా బంగారు ఆభరణాల మీద ఉన్న తరుగు కేవలం 6.99శాతం మాత్రమే కస్టమర్స్‌కు అందిస్తున్నాం అని చెప్పారు. దానితో పాటు '0' మేకింగ్ చార్జెస్ అందుబాటులో ఉన్నది కాబట్టి కస్టమర్స్ దేవుళ్లందరూ ఈఅద్భుతమైన తగ్గింపు అవకాశాన్ని పొందావాల్సిందిగా కోరుతున్నామన్నారు. ముకుంద జ్యువెలర్స్ వారి షోరూమ్స్ కూకట్‌పల్లి, ఖమ్మం, కొత్తపేట, సోమాజిగూడ, హన్మకొండ, సుచిత్ర, చందనగర్, జూబ్లీహిల్స్, విశాఖపట్నం, బెంగళూరు (జయనగర్), ఫ్లోర్ గోల్డ్ అండ్ డైమండ్స్ కెపిహెచ్‌బిలో ఉన్నాయి. త్వరలో రాజమండ్రిలో మరో షో రూమ్‌ను ప్రారంభిస్తారు.

# చిన్నారుల ఆరోగ్యానికి 'రాష్ట్రీయ బాల స్వాస్థ్య'

## 4 నెలల్లో 18 యేళ్ల లోపు వయసు కలిగిన 441 మందికి ఉచిత శస్త్ర చికిత్సలు: మంత్రి సత్యకుమార్ యాదవ్



**విజయవాడ,ఆగస్టు 29.ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం ద్వారా 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి ఆగస్టు 19 వరకు 441 శస్త్రచికిత్సలు పూర్తయ్యాయినట్లు ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ వెల్లడించారు.బాలస్వాస్థ్య కార్యక్రమంపై మంత్రి సత్యకుమార్ సమీక్ష నిర్వహించారు. బాలస్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన ఆరోగ్య పరీక్షల్లో గుర్తించిన పిల్లలకు 289, పాఠశాలల్లో నిర్వహించిన స్క్రీనింగ్‌లో గుర్తించిన వారికి 152 శస్త్రచికిత్సలు చేశారు. వీటికి మొత్తం రూ.2,42,23,728 వ్యయం అయింది. వీరంతా పద్దెనిమిది సంవత్సరాల లోపు పిల్లలు. పిల్లల్లో ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి చికిత్స, శస్త్రచికిత్స, థెరపీ, ఫాలోఅప్ సేవలు అందిస్తున్న తీరుపై సమీక్షలో రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ చక్రధర్ బాబు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు వివరించారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి ఆగస్టు 19 వరకు ఆర్‌బియస్‌కె ద్వారా మొత్తం 441 మంది చిన్నారులకు ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించారు. వీరిలో అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన ఆరోగ్య పరీక్షల సమయంలో 289 మంది, పాఠశాలల్లో నిర్వహించిన పరీక్షల సమయంలో 152 మంది గుర్తించారు. రెటినోపతి ఆఫ్ ప్రీమెచ్యూరిటీ కు 132 శస్త్రచికిత్సలు తక్కువ బరువుతో లేదా ముందస్తుగా జన్మించిన శిశువుల్లో కనిపించే రెటినోపతి ఆఫ్ ప్రీమెచ్యూరిటీ కు అత్యధికంగా 132 శస్త్రచికిత్సలు జరిగాయి. ఒక్కో శస్త్ర చికిత్సకు రూ.25వేల చొప్పున మొత్తం రూ.33 లక్షలు ఖర్చయ్యాయి. **క్లెఫ్ట్ లిప్, క్లెఫ్ట్ పాలెట్‌కు 72 శస్త్రచికిత్సలు:** పెదవి లేదా అంగిలి పుట్టుకతోనే విడిపోయి ఉండే క్లెఫ్ట్ లిప్, క్లెఫ్ట్ పాలేట్ సమస్యలకు 72 శస్త్రచికిత్సలు నిర్వహించారు. **కంజెనిటల్ హార్ట్ డిసీజ్‌కు 30 శస్త్రచికిత్సలు:** కంజెనిటల్ హార్ట్ డిసీజ్‌తో బాధపడుతున్న 30 మంది చిన్నారులకు శస్త్రచికిత్సలు నిర్వహించారు. **క్లబ్‌ఫుట్‌కు 35 శస్త్రచికిత్సలు:** పిల్లల్లో పాదం పుట్టుకతోనే లోపంగా ఉండే క్లబ్‌ఫుట్ సమస్యకు 35 శస్త్రచికిత్సలు జరిగాయి.కంజెనిటల్ డెఫ్‌నెస్‌కు 10, న్యూరల్ ట్యూబ్ డిఫెక్ట్స్‌కు 6, కంజెనిటల్ క్యాటరాక్ట్‌కు 4 శస్త్రచికిత్సలు నిర్వహించారు. మరో 152 మంది చిన్నారులకు కంటి వంకర (స్క్వింట్), టాన్సిలైటిస్, అపెండిసైటిస్, టంగ్ టై, పుట్టుకతో వృషణం దిగకపోవడం, దంత సమస్యలు, గాయాలకు సంబంధించిన శస్త్రచికిత్సలు ఉన్నాయి.

**ప్రభుత్వ ఆసుపత్రుల్లో 238 శస్త్రచికిత్సలు:** మొత్తం 441 శస్త్రచికిత్సల్లో 238 శస్త్రచికిత్సలను ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే నిర్వహించారు. ప్రభుత్వ వైద్య సంస్థల్లో అవసరమైన సేవలు అందుబాటులో లేని సందర్భాల్లో ఆర్‌బియస్‌కెతో అనుసంధానమైన ఆసుపత్రుల సేవలను వినియోగించారు. ఆర్‌బియస్‌కె కింద ఒప్పందాన్ని కుదుర్చుకున్న 15 ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఈ శస్త్రచికిత్సలు జరిగాయి. ఈ ఆసుపత్రుల్లో డాక్టర్ ఎల్వీ ప్రసాద్ వంటి ప్రముఖ ఆసు పత్రులు ఉన్నాయి. ప్రభుత్వ వైద్య సంస్థల్లో అందు బాటులో లేని శస్త్రచికిత్సలను అనుబంధ ఆసుపత్రుల్లో డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ లేదా పీఎంజేఏవై కింద ఉచితంగా నిర్వహిస్తున్నారు.దీంతో తల్లిదండ్రులు నేరుగా ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించి వైద్య ఖర్చులు భరించాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వ రిఫరల్ వ్యవస్థ ద్వారా సేవలు పొందుతున్నారు.

**తల్లిదండ్రులకు కౌన్సెలింగ్.. చికిత్సపై అవగాహన:** చిన్నారికి శస్త్రచికిత్స అవసరమని వైద్యులు సూచించినప్పుడు కొంతమంది తల్లిదండ్రులు వెనుకంజ వేసే పరిస్థితుల్లో పీడియాట్రిషియన్, వైద్యాధికారి, సోషల్ వర్కర్ కౌన్సెలింగ్ అందిస్తున్నారని మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు అధికారులు వివరించారు.అనంతపురం జిల్లా బాలల సత్వర చికిత్సా కేంద్రంలో క్లెఫ్ట్ లిప్, మార్కాపురం జిల్లా బాలల సత్వర చికిత్సా కేంద్రంలో క్లబ్‌ఫుట్, అనకాపల్లి జిల్లా బాలల సత్వర చికిత్సా కేంద్రంలో కంజెనిటల్ హార్ట్ డిసీజ్, శ్రీకాకుళం జిల్లా బాలల సత్వర చికిత్సా కేంద్రంలో కోక్లియర్ ఇంప్లాంట్ కేసులకు సేవలు అందించారు. అంగన్‌వాడీ కేంద్రం లేదా పాఠశాలలో నిర్వహించే సాధారణ ఆరోగ్య పరీక్షలోనే సమస్యను గుర్తించి, అవసరమైన వైద్య సేవలను ఉచితంగా అందించడం, శస్త్రచికిత్స అవసరమైన వారికి తగిన ఆసుపత్రికి రిఫర్ చేయడం, చికిత్స అనంతరం కూడా ఫాలోఅప్ చేస్తూ చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది.

# మారుమూల గ్రామాలకు 4జి, 5జి వెలుగులు

**జనార్దనపురంలో బిఎస్ఎన్ఎల్ టవర్‌కు శంకుస్థాపన**

**వింజమూరు (నెల్లూరు), ఆగస్టు 29, ప్రభాతవార్త :** ఉదయగిరి నియోజకవర్గంలో డిజిటల్ విప్లవానికి నాంది పలికేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని జిల్లా ఇన్చార్జి మంత్రి న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి వర్యులు ఎం ఎన్ డి ఫరూక్ తెలిపారు. శనివారం వింజమూరు మండలంలోని జనార్దనపురం గ్రామంలో బిఎస్ఎన్ఎల్ టవర్ శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఉదయగిరి శాసన సభ్యులు కాకర్ల సురేష్ మాజీ ఎమ్మెల్యే కంభం విజయ రామిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శంకు స్థాపన శిలాఫలకాన్ని బిటెక్ డైరెక్టర్ తాటికొండ అనూష ఆధ్వర్యంలో శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమ్యూనికేషన్ మెరుగుకు జనార్దనపురంలో నిర్మించిన టవర్ సుమారు కోటి రూపాయలు వ్యయంతో నిర్మించనున్నారని, దానికి మెరుగైన సేవలు అందనున్నాయన్నారు. అలాగే ఎమ్మెల్యే కాకర్ల సురేష్ నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన పనులను మంజూరు చేయించుకోవడంలో మొదటి స్థానంలో ఉన్నారన్నారు.

# వైభవంగా నృసింహుని కల్యాణోత్సవం

**రాబడి రూ.4,33,308లు**

**రాపూరు (నెల్లూరు), ఆగస్టు 29, ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో లక్ష్మీనృసింహ స్వామి వారి దర్శనానికి వచ్చిన భక్తులతో శనివారం ఆలయ ప్రాంగణం నిండి పోయింది. శ్రావణమాసంలో వచ్చిన మూడవ శనివారం కావడంతో పెద్ద ఎత్తున భక్తులు కోనకు చేరుకోని తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకోని స్వామి వారిని దర్శించుకోని పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు కావలసిన భోజన, వసతి సౌకర్యాలతో పాటు,క్యూలైన్లలో భక్తులకు మంచినీరు,మజ్జిగ పంపిణీ వంటి ఏర్పాట్లను ఆలయ ఇన్‌చార్జ్ ఇఓ జనార్ధన్ రెడ్డి పర్యవేక్షించారు. శనివారం స్వామి వారికి భక్తుల ద్వారా రూ.4,33,308 రాబడి వచ్చినట్లు ఆలయ ఇన్‌చార్జ్ ఇఓ జనార్ధన్ రెడ్డి తెలిపారు. స్వామి వారి నిత్య అన్నదానానికి విరాళల రూపేణా రూ.1,18,908లు, శ్రీవారి అభిషేకం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.20,250లు, స్వామి వారి నిజరూప దర్శనం ద్వారా రూ.9,200లు,ప్రత్యేక దర్శనం ద్వారా రూ. 44,100లు, నిత్య కళ్యాణం ద్వారా రూ,49,500లు,బ్రేక్ దర్శనం ద్వారా రూ.11,000లు, దేవస్థానం వసతి ద్వారా రూ.18,000లు, తలనీలలు 1005 మంది సమర్పించగా తద్వారా రూ.40,200లు లడ్డు ప్రసాదాల విక్రయం ద్వారా రూ.1,00,740 లు, పులిహోరా విక్రయం ద్వారా రూ.13,200లు, వాహనాల పూజల ద్వారా రూ.1,600లు చొప్పున మొత్తం రూ.4,33,308 రాబడి వచ్చినట్లు జనార్ధన్ రెడ్డి తెలిపారు.

# ఆత్మగౌరవం చంపుకోలేకనే రాజీనామా చేశా



**సకల శాఖల మంత్రి నాపై భౌతికదాడి చేశారు**

**వైసిపిలో నం-1సజ్జల, నం-2 జగన్: బహిరంగ లేఖలో విజయసాయిరెడ్డి**

**విజయవాడ,ఆగస్టు 29,ప్రభాతవార్తప్రతినిధి:** రాజ్యసభ మాజీ సభ్యుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ నేత విజయసాయి రెడ్డి రాజకీయంగా సంచలనం సృష్టించారు. వైసీపీలో ఉన్నప్పుడు తనకు ఎదురైన పరిస్థితులు, అవమానాలను వివరిస్తూ ఆ పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ సోషల్ మీడియాలో ఒక సుదీర్ఘ బహిరంగ లేఖను విడుదల చేశారు. తనపై 'నమ్మకద్రోహి' అంటూ వైసీపీలోని ఓ వర్గం దుష్ప్రచారం చేయిస్తున్నందునే ఈ లేఖ రాయాల్సి వస్తోందని ఆయన స్పష్టం చేశారు. ఈ లేఖలో ఆయన చేసిన ఆరోపణలు, వెల్లడించిన విషయాలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి.తానే గనక నమ్మకద్రోహిని అయితే, ఆనాడే సజ్జల మాదిరిగా కాంగ్రెస్‌తో సంధి చేసుకుని సీబీఐ, ఈడీ చార్జిషీట్లలో నా పేరు లేకుండా చేసుకునేవాడిని. జగన్‌కి నమ్మకస్తుడిననే ఒకే ఒక్క కారణంతో ప్రతి చార్జిషీట్‌లో నన్ను ఏ2గా చేర్చారు. జగన్ 16 నెలలు జైల్లో ఉంటే, నేను 15 నెలలు జైల్లో ఉన్నాను. నమ్మకద్రోహం నా రక్తంలో ఉంటే అప్పుడే అప్రూవర్‌గా మారేవాడిని అని విజయసాయి రెడ్డి పేర్కొన్నారు.2024 ఎన్నికల తర్వాత కూడా తనకు సంబంధం లేని లిక్కర్ స్కామ్‌లో ఏ5గా, కాకినాడ సీపోర్టు కేసులో ఏ2గా తనను చేర్చారని, కానీ ఈ రెండున్నర ఏళ్ల టీడీపీ పాలనలో 'సకల శాఖల మంత్రి' అయిన సజ్జల పేరు ఒక్క చార్జిషీట్‌లో కూడా లేకపోవడం గమనార్హమన్నారు. జగన్‌కు వెన్నుపోటు పొడుస్తూ, టీడీపీతో కలిసి ఎలా పనిచేయాలో, కేసులు లేకుండా ఎలా చూసుకోవాలో ఆ 'కోటరీ నాయకుడికి' తెలిసినంత తనకు తెలియదని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.2022లో మంగళగిరిలో జరిగిన పార్టీ ప్లీనరీలో సజ్జల రామకృష్ణారెడ్డి తనపై నేరుగా భౌతికంగా దాడి చేశారని, ఈ విషయం జగన్‌కు తెలిసినా ప్రేక్షకపాత్ర వహించారని విజయసాయి రెడ్డి సంచలన ఆరోపణ చేశారు. ఇలాంటివి మొత్తం 74 అవమానాలు జరిగాయని, ఎన్నో విషయాలు కడుపులోనే దాచుకున్నానని అన్నారు. 2019లో పార్టీ ఘనవిజయం సాధించిన తర్వాత సజ్జల ప్రమేయం శృతిమించింది. పరిపాలన జగన్‌గారు చేశారా లేక సజ్జల సకల శాఖల మంత్రిగా, రాజ్యాంగేతర శక్తిగా తన ముఠాతో చేశారా? ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులకు సైతం అపాయింట్‌మెంట్లు ఇవ్వకుండా జగన్‌ను కలవనీయకుండా గోడ కట్టింది సజ్జల కాదా?" అని విజయసాయి రెడ్డి తీవ్రస్థాయిలో ప్రశ్నించారు. పెద్దిరెడ్డి, బొత్స, వైవీ సుబ్బారెడ్డి, మిథున్ రెడ్డి వంటి సీనియర్ నేతలందరినీ రీజినల్ కోఆర్డినేటర్లుగా పెట్టి, అందరూ చీఫ్ కోఆర్డినేటర్ సజ్జలకు రిపోర్ట్ చేయాలన్న ఆదేశాలు తనకు ఆమోదయోగ్యం కాలేదన్నారు. అందుకే తన ఆత్మగౌరవాన్ని చంపుకుని పనిచేయలేక, నాలుగేళ్ల రాజ్యసభ పదవీకాలాన్ని ముందే వదులుకుని పార్టీకి కూడా రాజీనామా చేశానని స్పష్టం చేశారు. ' ఇప్పుడు వైసీపీలో నంబర్ 2 ఎవరంటే జగన్. నంబర్ 1 ఎవరంటే సకల శాఖల మంత్రిఖి సజ్జల అని విజయసాయి రెడ్డి వ్యాఖ్యానించారు.

# ఎంపి ల్యాడ్ నిధులు సద్వినియోగం చేయాలి: కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు




శనివారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

**శ్రీకాకుళం, ఆగస్టు 29 ప్రభాతవార్త:** ఆర్థిక మంజూరు లభించిన నాలుగు నెలల్లోగా పనులు ప్రారంభం కాకపోతే ఆ ఎంపీ ల్యాడ్ నిధులను నిరుపయోగంగా ఉంచకుండా, తక్షణమే ఇతర అత్యవసర ప్రజా ప్రయోజన పనులకు మళ్లించి వినియోగించాలని కేంద్ర పౌర విమాన యాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం సాయంత్రం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలసి ఎంపీ ల్యాడ్స్ నిధుల వినియోగం, అభివృద్ధి పనుల పురోగతిపై ఆయన సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంట్రాక్ట్ ఏజెన్సీలకు నిర్దిష్ట కాలపరిమితిని నిర్దేశించి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని, జలజీవన్ మిషన్ పురోగతిపై ప్రతి రెండు వారాలకొకసారి స్థానిక ఎమ్మెల్యేలకు సమాచారం అందిస్తూ క్షేత్రస్థాయిలో పనులు వేగం పెంచాలని స్పష్టం చేశారు. అలాగే పీఎం సూర్య ఘర్, పీఎం కుసుమ్ వంటి ప్రతిష్టాత్మక కేంద్ర పథకాల ఫలాలు అర్హులైన ప్రజలందరికీ త్వరితగతిన అందేలా అధికారులు సమర్థంగా పని చేయాలని సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు 346 పనులకు గానూ రూ.2,098.29 లక్షలు మంజూరు కాగా, రూ.949.98 లక్షల వ్యయంతో 177 పనులు పూర్తి చేశామని, 29 పనులు వేగంగా జరుగుతు న్నాయని అధికారులు వివరించారు. ఈ సాక్షి పోర్టల్ వివరాల ప్రకారం కేంద్రం నుంచి ఇప్పటివరకు మొత్తం రూ.24.35 కోట్లు విడుదల కాగా, సీతంపేట ఐటిడిఏ పరిధిలో రూ.12.20 లక్షల పనులతో సహా మొత్తం రూ.2,108.69 లక్షల విలువైన ప్రజా ఉపయోగకర పనులను ఎంపీగా సిఫార్సు చేశానని, నిధుల కొరత లేకుండా మరో రూ.326.47 లక్షలు నూతన పనుల సిఫార్సుకు సిద్ధంగా ఉన్నాయని మంత్రి తెలిపారు. 28 రోజులకు మించి ఏజెన్సీల వద్ద సాధ్యత పరిశీలనలో ఉన్న 25 పనుల (రూ.137.95 లక్షలు) ప్రక్రియను త్వరగా పూర్తి చేసి పనులు మొదలుపెట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో పిఎం సూర్యఘర్, పిఎం కుసుమ్ తదితర సౌర విద్యుత్ పథకాల అమలుకు సంబంధించి డేటా, పాలసీలు, లక్ష్యాలు స్పష్టంగా ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఆశించిన ప్రగతి లేకపోవడంపై కేంద్ర మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. మొత్తం 19 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి, 56,000 గృహ యూనిట్లకు సౌర విద్యుత్ అందించడం లక్ష్యంగా పెట్టుకున్నామని, సబ్సిడీ అందుబాటులో ఉందన్నారు.

అయితే టెండర్ వెండర్ల ఖరారు, వినియోగదారుల సర్టిఫికేషన్ ప్రక్రియ, పాత ట్రాన్స్‌ఫార్మర్లు, దెబ్బతిన్న విద్యుత్ స్తంభాల అప్‌గ్రేడేషన్, సైట్ అనుమతుల విషయంలో సంబంధిత శాఖల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోందని తెలిపారు సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, సీతంపేట ఐటిడిఏ పిఒ స్వప్నిల్ పవార్, అసిస్టెంట్ కలెక్టర్ హరి ఓం పాండియా, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొందు శంకర్, సిపిఒ ప్రసన్న లక్ష్మి, ఆయా శాఖల జిల్లా ఉన్నతాధికారులు తదితరులు హాజరయ్యారు.

# వెలిగొండ పునరావాస కాలనీలకు రూ.4.07 కోట్లు: ఉత్తర్వులు జారీ

**విజయవాడ,ఆగస్టు29,ప్రభాతవార్తప్రతినిధి:** వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవం ఈ నెల 31న జరగనున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలను వారి పునరావాస కాలనీలకు స్వచ్ఛందంగా తరలిం చేందుకు తక్షణ ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించింది. ఇందు కోసం ప్రభుత్వం రూ.4.07 కోట్ల నిధులను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

# నీళ్లు లేని సమయంలో జలహారతి ఎందుకు?

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య**

**విజయవాడ,ఆగస్టు 29,ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీశైలం జలాశయంలో నీటి లభ్యత పరిమితంగా ఉన్న సమయంలో, కరువు పరిస్థితులు తీవ్రంగా ఉన్న వేళ, అందుబాటులో ఉన్న నీటిని అత్యంత జాగ్రత్తగా వినియో గించాల్సిన ప్రభుత్వం రాజకీయ ప్రచారం కోసం జలహారతులు నిర్వహించడం సరికాదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య విమర్శించారు. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు నీటి లభ్యత, ఇరు రాష్ట్రాల అవసరాల నేపథ్యంలో తాగునీటికి ప్రథమ ప్రాధాన్యత ఇవ్వా లని స్పష్టంచేసిన పరిస్థితుల్లో, కేవలం 10.70 టీఎంసీల నీటిని నల్లమలసాగర్‌కు తరలించి జలహారతి చేయడం ద్వారా మొత్తం వెలి గొండ ప్రాజెక్టు పూర్తయినట్లు ప్రచారం చేయడం ప్రజలను తప్పుదారి పట్టించడమేనన్నారు. విజయవాడలోని దాసరి భవన్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈశ్వరయ్య మాట్లాడుతూ 10.70 టీఎంసీలు ఒక దశకు ప్రయోజనమేగాని మొత్తం వెలిగొండకు కాదన్నారు. ఫేజ్1లో 10.70 టీఎంసీల నీటిని నల్లమలసాగర్‌కు తరలించి సుమారు 1.19 లక్షల ఎకరాలకు సాగునీటి ప్రయోజనం కల్పించాలనే లక్ష్యం ఉంటే, ఆ ప్రయోజనం రైతులకు అందడం సంతోషకరమేనన్నారు. కానీ ఫేజ్1 ప్రారంభం కావడం వేరు, మొత్తం వెలిగొండ ప్రాజెక్టు పూర్తవడం వేరు అని స్పష్టం చేశారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తి ఆయకట్టు 4,47,300 ఎకరాలు. ఇందులో ప్రకాశం జిల్లాలో 3,36,100 ఎకరాలు, నెల్లూరు జిల్లాలో 84,000 ఎకరాలు, కడప జిల్లాలో 27,200 ఎకరాలు ఉన్నాయన్నారు. 10.70 టీఎంసీలతో 1.19 లక్షల ఎకరాలకు నీరు అందిస్తామంటున్నారని, మరి మిగిలిన ఆయకట్టుకు నీరు ఎప్పుడు, ఎలా అందిస్తారని డిమాండ్ చేశారు.వెలిగొండను రాజకీయ క్రెడిట్ కోసం ఉపయోగించుకోవద్దని, ఇది సిపిఐ చేపట్టిన దశాబ్దాల పోరాట ఫలితంగా గుర్తించాలన్నారు. పూల సుబ్బయ్య పోరాట చరిత్రను గౌరవించి, ప్రాజెక్టు వద్ద పూలసుబ్బయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు అక్కినేని వనజ, పి. దుర్గాభవానీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రావులపల్లి రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

# రావి, వేప చెట్లను కలిపి నాటడం వల్ల జీవవైవిధ్య పరిరక్షణకు మేలు

**ఎపి గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ నాగబాబు**



అరణ్యారామం నందవనంలో నిర్వహించిన అశ్వత్థ నారాయణ వివాహం కార్యక్రమంలో సతీసమేతంగా పాల్గొన్న నాగబాబు

**విజయవాడ,ఆగస్టు29,ప్రభాతవార్తప్రతినిధి:** గత ప్రభుత్వానికి చెట్లు నరకడం తప్ప, నాటాలనే ఆలోచన రాలేదని, తమది నరికే సంస్కృతి కాదని, నాటే సంస్కృతి అని ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్, జనసేన ఎమ్మెల్సీ నాగబాబుస్పష్టం చేశారు. హరితాంధ్రప్రదేశ్ సాధనలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఆయన పిలుపునిచ్చారు.శనివారం అరణ్యారామం నందవనంలో నిర్వహించిన అశ్వత్థ నారాయణ వివాహం కార్యక్రమంలో నాగబాబు తన అర్ధాంగి పద్మజతో కలిసి పాల్గొన్నారు. శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించిన అనంతరం ఆయన దంపతులు రావివేప మొక్కలను నాటారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ, భూమాతను కాపాడుకోవడం మనందరి బాధ్యత అని గుర్తుచేశారు. అడవుల నరికివేత, విచక్షణారహిత మైనింగ్ వంటి చర్యలతో మనమే భూమాతను గాయపరుస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పర్యావరణ పరిరక్షణ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో పాటు తనకు ఒకేరకమైన ఆలోచనలు ఉన్నాయని నాగబాబు తెలిపారు. రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలనే ఉమ్మడి సంకల్పమే తమను ఒకే వేదికపైకి తెచ్చిందని అన్నారు. భారతీయ సంప్రదాయంలో రావి, వేప చెట్లకు విశిష్ట స్థానం ఉందని, వాటిని కలిపి నాటడం వల్ల జీవవైవిధ్య పరిరక్షణకు ఎంతో మేలు జరుగుతుందని వివరించారు.అనంతరం, రూ.24 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఖిఅరణ్యారామంఖి భవన డిజైన్లను నాగబాబు పరిశీలించారు. ఈ భవన నిర్మాణాన్ని 10 నెలల్లో పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశామని పీసీసీఎఫ్ చీఫ్ పి.వి. చలపతిరావు ఆయనకు వివరించారు. ఈ నిర్మాణం కోసం తొలగించాల్సి వచ్చిన 73 చెట్లను నరికివేయకుండా, వేరేచోట విజయవంతంగా పునఃప్రతిష్ఠాపన చేయడంపై ఆయన అధికారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పీసీసీఎఫ్ పి.వి. చలపతిరావు, సీసీఎఫ్ వైల్డ్ లైఫ్ నాగేశ్వరరావు, డీఎఫ్ఓ హిమ శైలజ తదితర అటవీ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# వైజాగ్‌లో రాష్ట్ర యోగ స్పోర్ట్స్ ఛాంపియన్ షిప్ ప్రారంభం

**పోటీలను ప్రారంభించిన కె. శ్రీనివాస్ రావు**

**విశాఖపట్నం, ఆగస్టు 29 ప్రభాత వార్త :** విశాఖ యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలోరాష్ట్ర స్థాయియోగస్పోర్ట్స్‌ఛాంపియన్‌షిప్2026 పోటీలు దక్షిణ నియోజకవర్గంలోని మున్సిపల్ స్టేడియంలో శనివారం ప్రారంభమాయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జాతీయ బీసీ ప్రజా సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యదర్శి, జనసేన సీనియర్ నాయకులు కోసూరు శ్రీనివాసరావు హాజరయ్యారు.ఈ సందర్భంగా విశాఖ యోగ స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు కోసూరు శ్రీనివాసరావుని సత్కరించి, సన్మానించారు. ఈ సందర్భంగా కోసూరు శ్రీనివాసరావు మాట్లాడుతూ యోగ సాధన వల్ల ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని విద్యార్థి దశ నుండే యోగాను ప్రతి ఒక్కరు అభ్యసించాలని తెలియజేశారు.

# హరికృష్ణకు సిఎం చంద్రబాబు, భువనేశ్వరి, మంత్రి లోకేష్ నివాళి

**విజయవాడ.ఆగస్టు29,ప్రభాతవార్త ప్రతినిధి:** నందమూరి హరికృష్ణ వర్ధంతి సందర్భంగా ఆయనను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, సీఎం సతీమణి భువనేశ్వరి, మంత్రి లోకేశ్ స్మరించుకున్నారు. ఈ మేరకు ఎక్స్‌లో వారు పోస్టు పెట్టారు. నాకు అత్యంత ఆత్మీయుడు, మా బావమరిది నందమూరి హరికృష్ణ వర్ధంతి సందర్భంగా నివాళి అర్పిస్తున్నాను. రాజ్యసభ సభ్యుడుగా, రాష్ట్ర మంత్రిగా ప్రజాసేవలో అశేష సేవలు అందించిన హరికృష్ణ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా ఉంటారు. సినీ నటుడుగా కూడా ఆయన తనదైన ముద్ర వేశారు అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. చైతన్య రథసారథి, తన మామయ్య నందమూరి హరికృష్ణ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు అర్పిస్తున్నానని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. నందమూరి హరికృష్ణ వర్ధంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరి స్మరించుకున్నారు. ఈ మేరకు ఎక్స్‌లో ఆమె పోస్టు పెట్టారు.నాన్నగారి ఆశయాల కోసం సైనికుడిలాపనిచేసి,ప్రజాసేవలో చెరగని ముద్ర వేసుకుని, ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారు.

# నాయకులపై నిర్బంధాన్ని ఖండించిన రాష్ట్ర కమిటీ

**వెలిగొండ సాధన కమ్యూనిస్టుల పోరాట ఫలితమే**

**విజయవాడ,ఆగస్టు 29,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ముఖ్యమంత్రి వెలిగొండ ఈ నె31వ తేదీ ప్రారంభోత్సవానికి విచ్చేస్తున్న సందర్భంలో వెలిగొండ నిర్వాసితుల్లో నిరక్ష్యానికి గురైన 18 సంవత్సరాలు దాటిన యువకులను, ఇప్పటి వరకు నిర్వాసితులకు అండగా నిలబడిన సిపిఐ(యం) జిల్లా నాయకులను బైండోవర్ కావాలని జిల్లా పోలీసు యంత్రాంగం బలవంతంగా స్టేషన్‌కు తరలించడాన్ని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నది. తక్షణం వారిని విడుదల చేయాలని డిమాం డ్ చేస్తున్నది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కమిటీ కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రకటన విడుదల చేసారు. 31వ తేదీ కార్యక్రమం ప్రశాంతంగా జరిగేటట్లు చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే. గత 30 సంవత్సరాలుగా వెలిగొండ ప్రాజెక్టు కోసం అవిశ్రాంతంగా పోరాడుతున్నది కమ్యూనిస్టులేనన్నారు.

## మాతృ భాషను సులువుగా నేర్చుకునేలా సరికొత్త మొబైల్ యాప్

### రూపొందించిన కొల్లు రంజిత్



**విజయవాడ,ఆగస్టు29,ప్రభాతవార్తప్రతినిధి:** దేశవిదేశాల్లో ఉండే తెలుగు వారి పిల్లలు మాతృ భాషను సులువుగా నేర్చుకునేలా సరికొత్త మొబైల్ యాప్, వెబ్ సైట్ అందుబాటులోకి వచ్చింది. విజయవాడకు చెందిన ప్రవా సాంధ్రులు కొల్లు రంజిత్ కూల్ఫాబెట్స్ పేరుతో యాప్ రూపొందించారు. కృత్రిమ మేధ సాంకేతికతతో పని చేసే యాప్‌ను శనివారం ప్రపంచ తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా అధికారికంగా విడుదల చేశారు. తెలుగును వర్ణమాల నుంచి వాక్య నిర్మాణం వరకూ పూర్తి స్థాయిలో నేర్చుకునేలా ఈ యాప్ పని చేస్తుంది. సులువుగా నేర్చుకోవటంతో పాటు రాసేటప్పుడు మనం చేసే తప్పుల్ని వెంటనే పసిగట్టి చెప్పటం అక్షర దోషాల్ని గుర్తించటం చేతిరాత విషయంలో మార్గనిర్దేశకత్వం చేస్తుంది. ఎంత కరెక్టుగా రాశామనేది స్పష్టంగా చెబుతుంది. పదాల్ని బొమ్మలతో సహా వివరిస్తుంది. విదేశాల్లో ఉండేవారికి తెలుగు టీచర్ లేని లోటుని భర్తీ చేసేలా కూల్ఫాబెట్స్ యాప్ పని చేస్తుందని రూపకర్త రంజిత్ తెలిపారు.యాప్ విడుదల సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు రంజిత్ బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భం గా యాప్ విడుదల చేయటం పట్ల అభినందించారు. తెలుగు లిపిని నేటి తరాలకు మరింత దగ్గర చేసేందుకు రంజిత్ చేసిన ప్రయత్నాన్ని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడు ప్రశంసించారు. భాషా పరిరక్షణకు ఆధునిక సాంకేతికతను ఉపయోగించారని ఇలాంటి ప్రయత్నాలు మరిన్ని జరగాలని ఆకాంక్షించారు. పలువురు ప్రముఖులు, ఐఏఎస్ అధికారులు రంజిత్ రూపొందించిన కూల్ఫాబెట్స్ యాప్‌ను అభినందిస్తూ సందేశాలు పంపించారు.

## డబుల్ ఇంజిన్ కాదు.. డబుల్ రేట్ల సర్కార్

### ధరలు తగ్గించలేక చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ : ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి ఫైర్

**విశాఖపట్నం, ఆగస్టు 29, ప్రభాత వార్త:** ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ద్రవ్యోల్బణాన్ని పెంచేసి, నిత్యవసరాల ధరలతో సామాన్య ప్రజల నడ్డి విరుస్తోందని వైఎస్సార్సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి తీవ్ర స్థాయిలో మండి పడ్డారు. విశాఖపట్నంలోని వైకాపా పార్టీ సిటీ కార్యాలయంలో శనివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబుది విజనరీ పాలన కాదని, ప్రజల నడ్డి విరిచే బాదుడే బాదుడు పాలన అని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను గాలికొదిలేసి, పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆమె దుయ్యబట్టారు. చంద్రబాబు నాయుడు జీడీపీలో రాష్ట్రాన్ని నంబర్ వన్ స్థానంలో ఉంచుతామని చెబుతున్నారని, కానీ ప్రజల దృష్టిలో జీడీపీ అంటే గ్యాస్ (జీ), డీజిల్ (డీ ), పెట్రోల్ (పీ ) రేట్లను పెంచడంలో రాష్ట్రాన్ని నంబర్ వన్ చేశారని ఎద్దేవా చేశారు.

## ఇవియం, వివిప్యాట్ గోదాములకు పటిష్ట భద్రత : ఎన్‌టిఆర్ కలెక్టర్

**విజయవాడ, ఆగస్టు 29, ప్రభాతవార్త :** ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్, వివిప్యాట్‌ల గోదాముకు పటిష్ట భద్రతను ఏర్పాటు చేసినట్లు ఎన్‌టిఆర్‌జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా పేర్కొన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు నెలవారీ తనిఖీల్లో భాగంగా శనివారం వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులతో కలిసి గొల్లపూడిలోని ఈవియంల గోదామును కలెక్టర్ పరిశీలించారు. సిసికెమెరాల పనితీరు, అగ్నిమాపక పరికరాలను పరిశీలించి రిజిష్టర్‌లో సంతకం చేసారు. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా గోదామును క్షుణ్ణంగా తనిఖీ చేసి ఎప్పటికప్పుడు సమగ్ర నివేదికను సమర్పిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈకార్యక్రమంలో పలువురు అధికారులు, వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

**ప్రతిరోజూ పిజిఆర్ఎస్ :** ఎన్‌టిఆర్‌జిల్లాలోని స్వర్ణగ్రామ, వార్డు కార్యాలయాల్లో ప్రతిరోజూ పిజిఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరించాలని ఎన్‌టిఆర్ కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా ఆదేశించారు. ఆయా కార్యాలయాల్లో ప్రతిరోజూ మధ్యాహ్నం 3గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు ప్రజల నుండి అర్జీలు స్వీకరించనున్నట్లు ఆయన తెలిపారు. ప్రజల నుండి వచి ్చన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు.

**విభిన్న ప్రతిభావంతులకు వాహనాలు అందచేత :** ఎన్‌టిఆర్‌జిల్లాలో అర్హులైన 58మంది విభిన్న ప్రతిభావంతులకు రూ.66.70లక్షల విలువచేసే మోటరైజ్డ్ త్రిచక్రవాహనాలను ఉచితంగా పంపిణీ చేసారు. విజయవాడలోని కలెక్టర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రవిభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయసంస్థ చైర్మన్ గుడిపూటి నారాయణస్వామి, జిల్లాకలెక్టర్ లక్ష్మీశా లబ్దిదారులకు వాహనాలను అందచేసారు. ఈసందర్భంగా నారాయణస్వామి మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 113 ధరఖాస్తులు రాగా వాటిలో విచారణ జరిపి అర్హులైన 58మందికి ఒక్కొక్కటి రూ.1.15లక్షల విలువచేసే వాహనాలను అందచేసినట్లు చెప్పారు.

## సోమశిల జలాశయాన్ని పరిశీలించిన సిడిఎస్ఇ కమిటీ

**అనంతసాగరం (నెల్లూరు), ఆగస్టు 29, ప్రభాతవార్త :** మండలంలోని సోమశిల జలాశయాన్ని డ్యామ్ సేఫ్టీ రివ్యూ కమిటీ అధికారులు శనివారం పరిశీలించారు. జలాశయం భద్రత, డ్యామ్ నిర్మాణ పరిస్థితి, నీటినిల్వ సామర్థ్యం తదఇతర అంశాలపై అధికారులు సమగ్రంగా పరిశీలన చేపట్టారు. ఈసందర్భంగా డ్యామ్ మ్యాప్‌ను పరిశీలించి డ్యామ్ సేఫ్టీకి సంబంధించిన వివిధ అంశాలను అధికారులు పరిశీలించారు. జలాశయం ప్రస్తుతం సురక్షితంగా ఉందా, భవిష్యత్తులో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే అంశాలపై క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించారు. జలాశయం భద్రతకు సంబంధించి అవసరమైన చర్యలు , నిర్వహణ అంశాలపై అధికారులతో చర్చించి డ్యామ్ పరిస్థితిపై వివరానలు నమోదు చేశారు. ఈకార్యక్రమంలో డ్యామ్ సేఫ్టీ రివ్యూ కమిటీ అధికారులు గోపాల్‌రెడ్డి, ఎం.వెంకటేశ్వర్లు, శ్రీకాంత్, తెలుగుగంగ ఎస్‌సి జి.సుబ్రహ్మణ్యారావు, డిఇఇ రవీంద్రప్రసాద్, డ్యామ్ డిఇఇ విజయేంద్రబాబు, ఇఇ శ్రీనివాసకుమార్, ప్రాజెక్ట్ చైర్మెన్ వేలూరు కేశవచౌదరి పాల్గొన్నారు.

## నీట్-పిజి పరీక్షకు కొన్ని గంటల ముందు విషాదం

### డిప్రెషన్‌తో ఎంబిబిఎస్ విద్యార్థిని ఆత్మహత్య

### ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని హాస్టల్‌లో ఘటన

**హైదరాబాద్ (చిక్కడపల్లి), ఆగస్టు 29, ప్రభాతవార్త :** దేశవ్యాప్తంగా ఆది వారం జరగనున్న నీట్‌పీజీ ప్రవేశపరీక్షకు కొద్దిగంటల ముందు నగరంలోని చిక్కడపల్లి తీవ్రవిషాదం చోటుచేసుకుంది. తీవ్ర మనస్తాపంతో ఎంబీబీఎస్ విద్యార్థిని ఒకరు హాస్టల్ గదిలోనే విషం తాగి బలవన్మరణానికి పాల్పడింది. చిక్కడపల్లి పోలీసుస్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి స్థానిక ఇన్‌స్పెక్టర్ ఎల్. మధుబాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూ లుకు చెందిన ప్రముఖ వ్యాపారి రామ్మోహన్‌రెడ్డి కుమార్తె బండి యశ్విత(26) ఎంబీబీఎస్ పూర్తి చేసింది. వైద్యవిద్యలో పోస్ట్ గ్రాడ్యు యేషన్ (పీజీ) సీటు సాధించడమే లక్ష్యంగా ఆరు నెలలుగా ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ ప్రాంతంలో ఉన్న అపరాజిత హాస్టల్‌లో ఉంటూ ప్రవేశ పరీక్షకు సిద్ధమవుతోంది. పరీక్ష ఆదివారం జరగాల్సి ఉండగా, శని వారం గదిలో ఒంటరిగా ఉన్న యశ్విత తీవ్రమనస్తాపానికి గురై విషం తాగింది. ఎంతసేపటికీ గది తలుపులు తీయకపోవడంతో అనుమానం వచ్చిన తోటివిద్యార్థినులు, హాస్టల్ నిర్వాహకులు పోలీసులకు సమా చారం ఇచ్చారు. చిక్కడపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని తలుపులు తెరిచి చూడగా ఆమె మృతిచెంది ఉంది. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రి మార్చు రీకి తరలించారు.

# హామీల అమలుకే ప్రథమ ప్రాధాన్యం

### పిఠాపురం ఆరోగ్య రంగానికి సరికొత్త రూపు

### ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవతో ఆసుపత్రుల అభివృద్ధి

### ఆయుష్ సేవల విస్తరణ.. వైద్య విద్యకు నూతన ఊపిరి,రూ.34 కోట్లతో ఏరియా ఆసుపత్రి ఆధునికీకరణ

### సుమారు రూ.100 కోట్లుతో ఆయుష్ వైద్య కళాశాల ఏర్పాటు

### రూ. కోటి వ్యయంతో కొమరగిరి, చేబ్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు

**విజయవాడ,ఆగస్టు 29,ప్రభాతవార్తప్రతినిధి:** నాణ్యమైన వైద్యం ప్రతి ఒక్కరి హక్కు అనే గొప్ప ఆశయాన్ని ఆచరణలో సాకారం చేస్తూ పిఠాపురం నియోజకవర్గాన్ని సమగ్ర, అత్యున్నత ఆరోగ్య సేవలకు కేంద్రంగా, రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచే మోడల్ హెల్త్ హబ్‌గా ఉప ముఖ్యమంత్రి, స్థానిక శాసనసభ్యులు పవన్ కళ్యాణ్ తీర్చిదిద్దుతున్నారు.ఈ మేరకు డీసీఎం కార్యాలయం సమగ్ర సమాచారంతో శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. ప్రతి పేదవాడికీ ఎలాంటి ఆర్థిక భారం లేకుండా, అత్యున్నత ప్రమాణాలతో కూడిన కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు ఉచితంగా అందాలనే దృఢ సంకల్పంతో ముందుకు సాగుతున్నారని ఈ సమాచార పత్రంలో తెలిపారు.ఈ మహత్తర లక్ష్య సాధనలో భాగంగా ఆధునిక సదుపాయాలతో ఆసుపత్రుల అభివృద్ధి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల బలోపేతం, ఆయుష్ వైద్య సేవల విస్తరణతోపాటు వైద్య విద్యా సంస్థల ఏర్పాటుకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. దీనితోపాటు రోగుల ప్రయాణ సౌకర్యార్థం ఈ ఆసుపత్రులన్నింటికీ కనెక్టింగ్ రోడ్లను కూడా నిర్మించారు.

**శరవేగంగా ఏరియా ఆసుపత్రి అభివృద్ధి**

సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీకి అనుగుణంగా పవన్ కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధతో పిఠాపురంలోని 30 పడకల పాత కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను రూ.34 కోట్ల అంచనా వ్యయంతో 100 పడకల సామర్థ్యంతో కూడిన అత్యాధునిక ఏరియా ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తున్నారు. ఈ పనులు యుద్ధ ప్రాతిపాదికన సాగుతుండగా, ఇప్పటికే దాదాపు 50 శాతం నిర్మాణ పనులు పూర్తయ్యాయి. 4.67 ఎకరాల విస్తీర్ణంలో నిర్మితమవుతున్న ఈ అత్యాధునిక ఆసుపత్రిలో ఆధునిక ఐసీయూ, అధునాతన వైద్య పరీక్షా ప్రయోగశాలలు, ఆధునిక ఆపరేషన్ థియేటర్లు, 30 పడకల ప్రసూతి విభాగంతోపాటు చిన్నపిల్లల వైద్యం, కంటి వైద్యం, ఎముకల వైద్యానికి సంబంధించిన ప్రత్యేక విభాగాలు అందుబాటులోకి రానున్నాయి. ఆసుపత్రి నిర్మాణం పూర్తై ప్రజలకు అందుబాటులోకి వస్తే పిఠాపురం పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లోని ఆరు మండలాలకు చెందిన సుమారు 3 లక్షల మంది ప్రజలకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన ఉచిత, కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు మరింత చేరువ కానున్నాయి. ఆసుపత్రికి అనుబంధంగా బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ భవనం, మార్చురీ, లక్ష లీటర్ల సామర్థ్యం గల సంప్‌తోపాటు ఇతర అవసరమైన మౌలిక సదుపాయాల నిర్మాణం కూడా చేపడుతున్నారు.



ఏరియా ఆసుపత్రి ఆధునికీకరణ పనుల జరుగుతున్న దృశ్యం

**ప్రతిష్టాత్మక ప్రభుత్వ ఆయుష్ మెడికల్ కాలేజీ ఏర్పాటు**

పిఠాపురం పేరును వైద్య విద్యా రంగంలో ప్రత్యేకంగా నిలబెట్టే లక్ష్యంతో, నేషనల్ ఆయుష్ మిషన్ కింద ప్రతిష్టాత్మక ప్రభుత్వ ఆయుష్ వైద్య కళాశాల ఏర్పాటుకు పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. సుమారు రూ.100 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఈ ఆయుష్ మెడికల్ కాలేజ్‌తోపాటు అనుబంధ అభివృద్ధి పనుల కోసం పిఠాపురం నియోజకవర్గంలో భూసేకరణ పనులు వేగవంతం చేశారు. ఈ కళాశాల నిర్వహణ, అనుబంధ సేవలు, అభివృద్ధి కార్యక్రమాల ద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా పెరగనున్నాయి.

**గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన ఆయుష్, హెల్త్ యూనిట్లు**

పట్టణ ప్రాంతాలకే పరిమితం కాకుండా, గ్రామీణ ప్రజలకు కూడా తక్షణ వైద్య సేవలు అందించేలా యు. కొత్తపల్లి మండలం కొమరగిరిలో, గొల్లప్రోలు మండలం చేబ్రోలులో రూ.50 లక్షల చొప్పున వ్యయంతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఇప్పటికే వంద శాతం పూర్తయి అందుబాటులోకి వచ్చాయి. వీటితోపాటు విరవాడలో రూ.30 లక్షలతో నిర్మిస్తున్న ప్రభుత్వ ఆయుష్ డిస్పెన్సరీ పనులు చివరి దశకు చేరాయి. అదే సమయంలో పిఠాపురం నియోజకవర్గానికే పరిమితం కాకుండా కాకినాడ జిల్లా ప్రజలకు అత్యున్నత వైద్య సేవలు అందుబాటులోకి రావాలనే లక్ష్యంతో శ్రీ పవన్ కళ్యాణ్ గారు ప్రత్యేక కృషి చేస్తున్నారు. ఆయన చొరవతో కాకినాడ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో రూ.36.6 కోట్లతో అధునాతన క్యాన్సర్ చికిత్సా కేంద్రం ఏర్పాటు కానుంది. ఇందులో సీటీ సిమ్యులేటర్, హెచ్‌డీఆర్ బ్రాకీథెరపీ, డోసిమెట్రీ వంటి ఆధునిక పరికరాలతోపాటు, క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించేందుకు మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వాహనాన్ని కూడా అందుబాటులోకి తీసుకురానున్నారు. గ్రామీణ స్థాయి ఆరోగ్య కేంద్రాల నుంచి అత్యాధునిక క్యాన్సర్ చికిత్స వరకు అన్ని వర్గాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు చేరువయ్యేలా ఆరోగ్య రంగాన్ని అభివృద్ధి చేస్తున్నారు. పిఠాపురం నియోజకవర్గంతో పాటు కాకినాడ జిల్లా ప్రజల ఆరోగ్య సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పవన్ కళ్యాణ్ తీసుకుంటున్న చర్యలు ప్రజారోగ్యంపై ఆయనకున్న ప్రత్యేక శ్రద్ధకు, కూటమి ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

## దుర్గమ్మ ఆలయంలో వైభవంగా పూర్ణాహుతి



**ఇంద్రకీలాద్రి, ఆగస్టు 29, ప్రభాతవార్త :** దుర్గమ్మవారి ఆలయంలో పాత యాగశాలలో అత్యంత వైభవంగా మహా పూర్ణాహుతి శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పవిత్ర మార్జనము. అమ్మవారి సేవలో పాల్గొన్న ఆలయ ఈవో వీకే శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణ దంపతులు పాల్గొన్నారు. విజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో గత మూడు రోజులుగా అత్యంత భక్తిశ్రద్ధలతో జరుగుతున్న శ్రీ పరాభవ నామ సంవత్సర వార్షిక పవిత్రోత్సవాలు శనివారం నాటితో శాస్త్రోక్తంగా, వైభవంగా స్వస్తి పలికారు. ప్రధాన అర్చకులు, స్థానాచార్యులు, వేద పండితుల ఆధ్వర్యంలో పవిత్రోత్సవాల ముగింపు క్రతువులను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం యాగశాలలో పూజించిన పవిత్ర జలాలతో దేవతామూర్తులకు, ఆలయ ప్రాంగణానికి సంప్రోక్షణ చేస్తూ శాంతి మార్జనము, ఆశీర్వచనం నిర్వహించారు. ఆలయంలో తెలిసీ తెలియక జరిగే దోషాల నివారణార్థం, లోక కళ్యాణార్థం ఈ పవిత్రోత్సవాలను ఆనవాయితీ ప్రకారం వైదికంగా నిర్వహించినట్లు వైదిక కమిటీ తెలిపింది. పూర్ణాహుతి స్థానాచార్య వి. శివ ప్రసాద్ శర్మ, ప్రధాన అర్చకులు కోట ప్రసాద్, ఉప ప్రధాన అర్చకులు శంకర శాండిల్య, కోట రవి కుమార్, వైదిక కమిటీ సభ్యులు శ్రీధర్ శర్మ ఆశీర్వచనం అందజేసి, తీర్థప్రసాదాలు మరియు శేషవస్త్రాలను బహుకరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ప్రత్యేక ఆహ్వానితులు వెలగపూడి శంకర బాబు, ఆలయ వైదిక కమిటీ సభ్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**నిత్యాన్నదాన పథకానికి విరాళం:**

దుర్గమ్మవారి నిత్యఅన్నదానం విభాగమునకు హైదరాబాద్‌కు చెందిన కునపురెడ్డి దీప్తిశ్రీ, భర్త తేజస్వంత్ రూ.1,00,000/ విరాళము శనివారం అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శనం ఏర్పాటు చేసిన అధికారులు దాత కుటుంబ సభ్యులకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదం,శేషవస్త్రం, తీర్థప్రసాదాలు అందజేయగా వేదపండితులు వేద ఆశీర్వచనాలు పలికారు.

**సెప్టెంబర్ 4న సామూహిక వరలక్ష్మీ వ్రతాలు:**

శ్రావణమాస చివరి శుక్రవారం సెప్టెంబర్ 4న ఇంద్రకీలాద్రిపై సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఆర్జిత సేవగా, ఉచితంగా రెండు విడతలుగా వైభవంగా నిర్వహిస్తామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. ఆగస్టు31న తెల్ల రేషన్ కార్డుదారులకు ఉచిత వ్రతం నిర్వహణకు దరఖాస్తులందిస్తామన్నారు. ఈ వ్రతాలకోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. భక్తుల సౌకర్యార్థం ఆర్జిత సేవా రూపంలో మరియు అర్హులైన పేద మహిళల కోసం ఉచితంగా ఈ వ్రత పూజలను వేర్వేరు సమయాల్లో శాస్త్రోక్తంగా జరిపిం చను న్నారు. శ్రావణ మాసంలో దుర్గమ్మ సన్నిధిలో జరిగే ఈ విశేష వరలక్ష్మీ వ్రతంలో మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలు పొందాలని ఈవో కోరారు. ఇతర సమగ్ర వివరాల కొరకు దేవస్థానం టోల్ ఫ్రీ నెంబర్ 1800 425 9099 ను

## తెలంగాణ ప్రభుత్వం మరో రూ.2 వేల కోట్లు రుణం

**హైదరాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం తాజాగా మరో రూ.2 వేల కోట్ల రుణాన్ని సమీకరించాలని నిర్ణయించింది. ఇందుకు రిజర్వ్ బ్యాంక్‌కు రాష్ట్ర ఆర్థిక శాఖ ఇండెంట్ పెట్టింది. ఇందులో భాగం సెప్టెంబర్ 1న రిజర్వ్ బ్యాంక్ నిర్వహించే బహిరంగ మార్కెట్లో ప్రభుత్వ సెక్యూరిటీ బాండ్లను ఈ వేలం ద్వారా ఈ మొత్తాన్ని సేకరించనున్నట్లు ఇండెంట్‌లో పేర్కొంది. సెప్టెంబర్ 1న ప్రతిపాదించిన రూ.2,000 కోట్లతో కలిపితే ప్రస్తుత 2026-27 లో ఇప్పటివరకూ ఐదు నెలల కాలానికి రిజర్వ్ బ్యాంక్ వేలాల ద్వారా రూ.36,900 కోట్ల మేర రుణం సేకరించింది. ఇందులో ఏప్రిల్‌లో రూ.6,900 కోట్లు, మే లో రూ.6 వేల కోట్లు, జూన్‌లో మరో రూ.6 వేల కోట్లు, జూలైలో రూ.13,500 కోట్లు, ఈ నెలలో రూ.4,500 కోట్ల మేర అప్పు చేసింది. ఇప్పుడు మరో రూ.2 వేల కోట్లతో ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకూ రూ.38,900 కోట్లకు రుణాలు చేరుకున్నాయి. కాగా 2026-27 ఆర్థిక సంవత్సరానికి కేంద్రం నిర్దేశించిన రాష్ట్ర వార్షిక రుణ పరిమితి రూ.58,458.71 కోట్లు. ఇందులో సెప్టెంబర్ 1న ప్రతిపాదించిన రూ.2 వేల కోట్లను కలుపుకుంటే మొత్తం వార్షిక రుణ పరిమితిలో సుమారు 66.5 ఇప్పటికే వినియోగించినట్లవుతుంది.

## ఆరోగ్య రంగంలో అద్భుత ప్రగతి సాధిస్తోన్న భారత్

### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త:** ఆరోగ్య రంగంలో దేశం ఎంతో ప్రగతిని సాధిస్తుందని, కిడ్నీ వ్యాధుల నివారణ ప్రాముఖ్యత ఇస్తున్నాని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వివరించారు. శనివారం నగరం లోని ఒక హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కిడ్నీ సింపోజియం-2026 కార్యక్రమంలో కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కిడ్నీ సంరక్షణ, అవయవ మార్పిడి, ఆధునిక వైద్య చికిత్స రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న హాస్పిటల్స్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ రెనల్ సైన్సెస్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన వివరించారు.వైద్య రంగంలో కేంద్ర ప్రభుత్వ చొరవ గణనీయమైన మార్పులు, గత దశాబ్ద కాలంలో భారతదేశ వైద్య వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని కిషన్ రెడ్డి తెలిపారు. దేశంలో వైద్య విద్య మౌలిక వసతులు భారీగా విస్తరించాయని పేర్కొన్నారు. 2014లో 387గా ఉన్న మెడికల్ కాలేజీల సంఖ్య ప్రస్తుతం 846కు పెరిగిందన్నారు. 51,348 ఎంబీబీఎస్ సీట్ల నుంచి దాదాపు 1.4 లక్షలకు చేరుకున్నాయి. 2014లో కేవలం 7 ఎయిమ్స్ ఉండగా, ప్రస్తుతం దేశవ్యాప్తంగా 23 ఎయిమ్స్‌లు సేవనందిస్తున్నాయి. ప్రాథమిక ఆరోగ్య సేవలను ప్రజలకు చేరువ చేయడానికి 1.86 లక్షలకు పైగా ఆయుష్మాన్ ఆరోగ్యకేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయుష్మాన్ భారత్ ద్వారా సుమారు రూ. 2 లక్షల కోట్ల విలువైన వైద్య ఖర్చుల భారం సామాన్యులపై తగ్గింది.

అలాగే 20,000 పైగా జన్ ఔషధి కేంద్రాల ద్వారా తక్కువ ధరలకే నాణ్యమైన జనరిక్ మందులు అందుబాటులోకి వచ్చాయన్నారు.

## మీరేమైనా దేవుడనుకొంటున్నారా?

### ఎఫ్‌డిఎ అధికారులపై బాంబే హైకోర్టు ఆగ్రహం



**ముంబయి, ఆగస్టు 29:** 'మీరేమైనా ఈ వ్యవస్థకు దేవుడినని భావిస్తున్నారా? కోర్టు ఆదేశాలను కూడా ఖాతరు చేయరా?' అంటూ మహారాష్ట్ర ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ అధికారులపై బాంబే హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆహార భద్రతా నిబంధ నలను 88 శాతం మేరకు కచ్చితంగా పాటిస్తు న్నట్లు స్వయంగా తనిఖీల్లో తేలినప్పటికీ, రెస్టారెంట్ల లైసెన్సుల నిలిపివేత ఎత్తివేసేందుకు నిరాకరించిన ఎఫ్‌డీఏ తీరుపై అత్యున్నత న్యాయస్థానం తీవ్రస్థాయిలో మండిపడింది. అధికా రుల మొండి వైఖరిపై విసిగిపోయిన ధర్మాసనం తక్షణమే కోర్టు ధిక్కరణ చర్యలు చేపడతామని హెచ్చరిస్తూ, బాంద్రాకుర్లా కాంప్లెక్స్ లోని ముంబై క్రికెట్ అసోసియేషన్ ప్రాంగణంలో మూతపడిన ఐదు ప్రముఖ రెస్టారెంట్లను వెంటనే తెరుచు కోవచ్చని సంచలన తీర్పునిచ్చింది. 88 శాతం నిబంధనలు పాటించినా మళ్లీ ఆంక్షలా పరిశుభ్రత లోపాలు, మూడో వ్యక్తికి నిర్వహణ బాధ్యతలు అప్పగించారనే నెపంతో ఎఫ్‌డీఏ అధికారులు ఎంసీఏ ప్రాంగణంలోని ఐదు రెస్టారెంట్ల లైసెన్సులను రద్దు చేస్తూ గతంలో ఆదేశాలు ఇచ్చారు. దీనిపై ఎంసీఏ యాజమాన్యం హైకోర్టును ఆశ్రయించింది.

ఇటీవల నిర్వహించిన తాజా తనిఖీల్లో ఈ రెస్టారెంట్లు 88 శాతం ఫుడ్ సేఫ్టీ నిబంధనలను పాటిస్తున్నాయని స్పష్టమైంది. అయినప్పటికీ, లైసెన్సులు ఎంసీఏ పేరిట ఉండి.. నిర్వహణ మాత్రం షిర్కే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వద్ద ఉందనే సాంకేతిక కారణాన్ని సాకుగా చూపి ఎఫ్‌డీఏ ఆంక్షలు కొనసాగించడమే వివాదానికి మూలకారణంగా మారింది. కోర్టు మాట వినకపోతే జైలుకే పంపుతాం టెక్నికల్‌గా కాకుండా వ్యవహారికంగా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని గత విచారణలోనే ఎఫ్‌డీఏకు సూచించామని, అయినా అధికారులు కోర్టు ఆదేశాలను పక్కనపెట్టి మొండిగా ప్రవర్తించారని తాత్కాలిక చీఫ్ జస్టిస్ జస్టిస్ రవీంద్ర ఘుగే, జస్టిస్ గౌతమ్ అంఖాడ్‌ల ధర్మాసనం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ప్రతిసారీ డిపార్ట్మెంట్ అధికారులకు మొట్టికాయలు వేసి అలసిపోయాం. ఇప్పుడు కఠినమైన చర్యలు తీసుకోక తప్పడం లేదు. బాధ్యులైన అధికారులపై కోర్టు ధిక్కరణ చర్యలు ప్రారంభించి జైలుకు పంపడానికైనా వెనుకాడబోం' అని న్యాయ మూర్తులు హెచ్చరించారు.




## దేశ రాజధాని పరిసరాల్లో సిఎన్జీ ధరల పెంపు

**న్యూఢిల్లీ, ఆగస్టు 29:** దేశ రాజధాని ఢిల్లీతోపాటు దాని పరిసర ప్రాం తాలైన నేషనల్ క్యాపిటల్ రీజియన్ పరిధిలో కంప్రెస్డ్ నాచరల్ గ్యాస్ ధరలు భారీగా పెరిగాయి. ఇంద్రప్రస్థ గ్యాస్ లిమిటెడ్ వాహనదారులపై అదనపు భారం మోపింది. సీఎన్‌జీ ధరను కిలోకు రూ.3.89 మేర పెంచుతున్నట్లు ప్రకటించింది. పెరిగిన ధరలు ఇవాళ ఉదయం 6 గంటల నుంచే అమల్లోకి వచ్చాయి. తాజా ధరల పెరుగుదలతో ఢిల్లీలో కిలో సీఎన్జీ ధర రూ.86.98 కి చేరింది. అదేవిధంగా నోయిడా, ఘజియాబాద్‌లలో రూ.95.59 గా, గురుగ్రామ్‌లో రూ.92.01 గా కొత్త ధరలు ఖరారయ్యాయి. మీరట్, ముజఫర్‌నగర్, షామ్లీ వంటి ప్రాంతాల్లోనూ పెరిగిన ధరలు అమలవుతున్నాయి. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు, అంతర్జాతీయ మార్కెట్‌లో లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ (ఎల్ఎన్జీ) ధరలు గణనీయంగా పెరగడమే ఈ నిర్ణయానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. సీఎన్జీ ఉత్పత్తి కోసం అవసరమైన సహజ వాయువును ప్రధానంగా ఎల్ఎన్‌జీ రూపంలోనే దిగుమతి చేసుకుంటున్నారు. హార్ముజ్ జలసంధి గుండా సాగే ఇంధన రవాణాలో ఆటంకాలు ఏర్పడటం, శీతాకాలం దృష్ట్యా ఐరోపా దేశాలు తమ నిల్వలను పెంచుకోవడం వంటి పరిణామాల వల్ల సరఫరా వ్యయం పెరిగింది. పశ్చిమాసియా సంక్షోభం తలెత్తిన తర్వాత, మే 15 నుంచి ఇప్పటి వరకు సీఎన్జీ ధరలు పెరగడం ఇది ఐదోసారి. ఈ ధరల పెంపు ప్రభావం ప్రైవేట్ కార్లు, ట్యాక్సీలు, ఆటోరిక్షాలు సహా వాణిజ్య వాహనాల నిర్వహణ వ్యయంపై పడనుంది. పెరిగిన ఇంధన ఖర్చుల భారాన్ని వాహనదారులు ప్రయాణికులపై మోపే అవకాశం ఉంది. రవాణా ఛార్జీలు కూడా పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి.



## పుష్కర శోభకు భద్రాద్రి ముస్తాబు

### గోదావరి ఒడిలో పుణ్యవేళకు శ్రీకారం

### రామయ్య చెంతకు లక్షలాది భక్తుల రాకకు రంగం సిద్ధం

### రూ.49 కోట్లతో ఘాట్లు.. రూ.351 కోట్లతో ఆలయాభివృద్ధి

**భద్రాచలం, ఆగస్టు 29, ప్రభాతవార్త:** గోదావరి పుష్కరాల ఆధ్యాత్మిక వైభవానికి భద్రాద్రి ఇప్పటి నుంచే ముస్తాబవుతోంది.2027 పుష్కరాలను పురస్కరించుకుని భద్రాచలంలో ఘాట్ల నిర్మాణ పనులకు శనివారం శ్రీకారం చుట్టారు.జిల్లా కలెక్టర్ అంకిత్, ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించారు.పుష్కర ఏర్పాట్ల కోసం మూడు విడతల్లో దాదాపు రూ.49 కోట్లను వెచ్చించనున్నారు.మొదటి విడతలో రూ.46.65 కోట్లు, రెండో విడతలో రూ.1.75 కోట్లు, మూడో విడతలో రూ.60 లక్షలతో పనులు చేపట్టనున్నారు.వచ్చే ఏడాది మార్చి నాటికి ప్రధాన పనులను పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. భద్రాచలంతో పాటు పర్ణశాల, మోతేపట్టినగర్ తదితర ప్రాంతాల్లోనూ ఘాట్లను అభివృద్ధి చేయనున్నారు. గోదావరి పుష్కరాలకు దేశం నలుమూలల నుంచి భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది.రామయ్య దర్శనం.. గోదావరి పుణ్యస్నానం.. పుష్కర సంకల్పంతో భద్రాద్రి ఆధ్యాత్మిక క్షేత్రంగా మారనుంది.భక్తుల రద్దీకి అనుగుణంగా రహదారులు, పార్కింగ్, తాగునీరు, మరుగుదొడ్ల ఏర్పాటు చేయాల్సి ఉంది.వైద్య శిబిరాలు, పారిశుద్ధం, విద్యుత్, భద్రత, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి అవసరం.కరకట్ట సర్వీస్ రోడ్డును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే అధికారులను సూచించారు.పుష్కరాల నేపథ్యంలో రవాణా, వసతి, అత్యవసర సేవలకు ముందస్తు కార్యాచరణ రూపొందించనున్నారు. మరోవైపు రూ.351 కోట్లతో శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థాన అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. ఒకవైపు రామయ్య ఆలయ అభివృద్ధి.. మరోవైపు పుష్కర ఘాట్ల నిర్మాణం సాగుతోంది.ఇంకోవైపు భక్తులకు మౌలిక వసతుల కల్పనపై అధికారులు దృష్టి సారిస్తున్నారు.దీంతో భద్రాచలం ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది.గోదావరి తల్లి ఒడిలో పుష్కర పుణ్యస్నానం.. రామయ్య సన్నిధిలో దర్శనం..2027 పుష్కర వైభవానికి భద్రాద్రిలో ఇప్పుడే మంగళఘోష మోగుతోంది!

# ఆట



## మాంటెర్రే ఓపెన్‌లో బార్టుంకోవాపై మెర్టెన్స్ విజయం

**మెక్సికో:** బార్టుంకోవాపై విజయం సాధించిన మెర్టెన్స్, మాంటెర్రే ఓపెన్ ఫైనల్‌లో ప్యారీ సరసన చేరింది. ఈ టోర్నీలో బెల్జియంకు చెందిన రెండో సీడ్ ఎలిస్ మెర్టెన్స్ ఒక సెట్ వెనుకబడినప్పటికీ పుంజుకుని చెక్ క్రీడాకారిణి నికోలా బార్టుంకోవాను 1-6, 6-4, 6-2 తేడాతో ఓడించి, దయాన్ ప్యారీతో ఫైనల్ పోరుకు సిద్ధమైంది. 23 ఏళ్ల ఫ్రెంచ్ క్రీడాకారిణి ప్యారీ, అంతకుముందు జరిగిన మొదటి సెమీఫైనల్‌లో అమెరికన్ ఐదవ సీడ్ ఆన్ లీని రెండు గంటల మూడు నిమిషాల పోరులో 7-6(7) 6-4 తేడాతో ఓడించి ఫైనల్‌లో తన స్థానాన్ని ఖాయం చేసుకుంది. రెండవ సెమీఫైనల్‌లో, బార్టుంకోవా అద్భుతమైన ఆరంభం చేసింది. తొలి గేమ్‌లోనే మెర్టెన్స్ సర్వీస్‌ను బ్రేక్ చేసి, 4-1 ఆధిక్యంతో దూసుకుపోయింది. ఆ 20 ఏళ్ల క్రీడాకారిణి రెండోసారి కూడా సర్వీస్‌ను బ్రేక్ చేసి, మెర్టెన్స్‌కు తిరిగి పుంజుకునే అవకాశం ఏమాత్రం ఇవ్వలేదు. చివరి గేమ్‌లో మూడోసారి సర్వీస్‌ను బ్రేక్ చేసి, సెట్‌ను 6-1తో కైవసం చేసుకుంది. తొలి సెట్‌లో వెనుకబడిన తర్వాత, మెర్టెన్స్ రెండో సెట్‌లో 3-0తో వెనుకబడినప్పటికీ పుంజుకుంది. వరుసగా మూడు రిటర్న్ గేమ్‌లలో ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసి, చివరి ఏడు గేమ్‌లలో ఆరింటిని గెలుచుకొని, సెట్‌ను 6-4తో కైవసం చేసుకుని స్కోరును సమం చేశాడు. మెర్టెన్స్ ఆ ఊపును నిర్ణయాత్మక సెట్‌లోకి కొనసాగించి చివరకు 6-2 తేడాతో సెట్‌ను కైవసం చేసుకుంది.




## ఆసియా క్రీడలకు నీరజ్ దూరం

**న్యూఢిల్లీ:** భారతదేశానికి రెండుసార్లు ఒలింపిక్ పతకం అందించిన నీరజ్ చోప్రా, చీలమండకు గాయం కావడంతో రాబోయే 2026 ఆసియా క్రీడలకు దూరమవ్వనున్నాడు. గత వారం లౌసాన్ డైమండ్ లీగ్‌లో సీజన్‌లోనే అత్యుత్తమంగా 88.05 మీటర్ల త్రో నమోదు చేసి రెండో స్థానంలో నిలిచిన చోప్రా, శిక్షణా సెషన్‌లో గాయపడ్డాడు. తన వైద్యుడు, జట్టుతో సంప్రదించిన తర్వాత, 2026 సీజన్ నుండి పూర్తిగా వైదొలగాలని నిర్ణయించుకున్నట్లు రెండుసార్లు ఆసియా క్రీడల ఛాంపియన్ వెల్లడించారు. ఈ సీజన్‌ను ముగించాలన్న చోప్రా నిర్ణయం వల్ల, అతను ఈ వారం ప్రారంభంలో అర్హత సాధించిన 2026 డైమండ్ లీగ్ ఫైనల్‌కు, అలాగే అర్హత సాధించే అవకాశం ఉన్న తొలి వరల్డ్ అథ్లెటిక్స్ అల్టిమేట్ ఛాంపియన్‌షిప్‌కు కూడా దూరంకానున్నాడు.

## కోల్‌కతా ఫుట్‌బాల్ లీగ్.. మోహన్ బగాన్ హ్యాట్రిక్ విక్టరీ

### 3-1 తేడాతో రైల్వే ఓటమి

**కోల్‌కతా:** కలకత్తా ఫుట్‌బాల్ లీగ్‌లో శనివారం నాడు రైల్వే ఎఫ్‌సిపై మోహన్ బగాన్ సూపర్ జెయింట్ విజయం సాధించి, సూపర్ సిక్స్‌లోకి ప్రవేశించడానికి మరో అడుగు వేసింది. అరగంట తర్వాత రైల్వే తరఫున ఉమేష్ మారండీ తొలి గోల్ చేసి ఆధిక్యాన్ని అందించగా, ఎనిమిది నిమిషాల్లోనే బగాన్ తిరిగి పుంజుకుని మోహన్ బగాన్ గ్రౌండ్‌లో 3-1 తేడాతో విజయం సాధించింది. వరుసగా బాగాన్ చేస్తున్న దాడులను రైల్వే అదుపు చేయడంలో విఫలమవగా, ఐదు నిమిషాలలోపే రోబిలాల్ మండి ఆధిక్యాన్ని రెట్టింపు చేసి మెరైనర్స్‌ను ముందుకు నడిపించాడు. ఆ తర్వాత భారత అండర్23 అంతర్జాతీయ ఆటగాడు సుహైల్ అహ్మద్ భట్ గోల్ చేయడంతో, బాగాన్ జట్టు రెండవ అర్ధభాగంలో ఆటను మలుపు తిప్పి, లీగ్‌లో నాలుగో స్థానంలో ఉన్న యునైటెడ్ ఎసిపై తమ ఆధిక్యాన్ని మరింత పెంచుకుని, ఆ రోజును



చిరస్మరణీయంగా ముగించింది. ఒక మ్యాచ్ ఎక్కువగా ఆడినప్పటికీ, తొమ్మిది మ్యాచ్‌లలో 19 పాయింట్లతో ఉన్న ఈస్ట్ బెంగాల్ కంటే బాగాన్ ఒక పాయింట్ వెనుకబడి ఉంది. ఇక సెప్టెంబర్ 1న బిఎస్ఎస్ స్పోర్టింగ్‌తో తదుపరి మ్యాచ్ ఆడనుంది. అదే రోజు రైల్వే, కిడ్డర్‌పోర్‌తో తలపడనుంది. ఇటీవల డ్యూరాండ్ కప్ ఫైనల్‌లో రెడ్‌అండ్‌గోల్డ్ బ్రిగేడ్ చేతిలో ఓడిపోయిన బగాన్, ఈ మ్యాచ్‌లో తమ ప్రధాన జట్టులోని పలువురు ఆటగాళ్లను బరిలోకి దింపింది. విరామం తర్వాత వెంటనే మన్వీర్ సింగ్ గోల్ చేయడంతో స్కోరు 11తో సమమైంది.



## టీమిండియాకు శ్రీలంక ఎఫెక్ట్

### కివిస్‌తో సిరీస్‌కు ఐదుగురు ఔట్

**న్యూఢిల్లీ:** శ్రీలంకతో టెస్ట్ సిరీస్‌ను 1-0తో గెలుచుకున్న టీమిండియా, ఇప్పుడు రాబోయే న్యూజిలాండ్ పర్యటనపై దృష్టి సారించింది. నవంబర్ 19న వెల్లింగ్టన్‌లో తొలి టెస్ట్, అలాగే నవంబర్ 27న క్రైస్ట్ చర్చ్‌లో రెండో మ్యాచ్ జరగనుంది. న్యూజిలాండ్ పరిస్థితులు ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో (డబ్ల్యూటీసీ) భారత జట్టులో కీలక మార్పులు జరిగే అవకాశం ఉన్నాయి.

శ్రీలంక సిరీస్‌లో ఆడిన ఐదుగురు ఆటగాళ్లపై సెలెక్టర్లు పునరాలోచన చేస్తున్నారు. భారత్ ఓపెనర్ యశస్వి జైస్వాల్ ఇటీవల ప్రదర్శన ఆశించిన స్థాయిలో లేదు. లంక రెండు టెస్టుల్లో నాలుగు ఇన్నింగ్స్‌లలో జైస్వాల్ కేవలం 139 పరుగులు మాత్రమే చేశాడు. అందులో 34.75 సగటు మాత్రమే ఉంది. న్యూజిలాండ్‌లో బంతి స్వింగ్ అయ్యే పరిస్థితులు ఉండటంతో ఫుట్‌వర్క్ కీలకం కానుంది. ఈ నేపథ్యంలో ఓపెనింగ్ కాంబినేషన్‌లో మార్పులు జరగాలని మేనేజ్‌మెంట్ భావిస్తోంది. దీంతో జైస్వాల్ స్థానంలో సాయి సుదర్శన్‌కు చోటు దక్కే అవకాశం ఉంది.

అప్పుడు కె.ఎల్. రాహుల్‌తో సుదర్శన్ ఓపెనర్‌గా బరిలోకి దిగనున్నారు. ఇక లంకలో కుల్దీప్ యాదవ్ పెద్దగా ప్రభావం చూపలేకపోయాడు. 25 ఓవర్లలో 103 పరుగులు ఇచ్చి ఒకే వికెట్ మాత్రమే తీశాడు. దీంతో అతన్ని పక్కన పెట్టే అవకాశం ఉంది. అంతేకాకుండా న్యూజిలాండ్‌లో పరిస్థితులు స్పిన్నర్ల కంటే పేసర్లకి ఎక్కువగా అనుకూలించే విధంగా ఉండటంతో ఎక్కువ మంది స్పిన్నర్లతో వెళ్లాల్సిన అవసరం ఉండదు. సాయి సుదర్శన్ స్థానంలో లంక టూర్‌లో సర్ఫరాజ్ ఖాన్‌ని ఎంపిక చేసింది. అయితే రెండు టెస్టుల్లోనూ బ్యాటింగ్ చేసే అవకాశం రాలేదు. కొలంబో టెస్ట్‌లో రిషబ్ పంత్ గాయపడిన సమయంలో సబ్‌స్టిట్యూట్ ఫీల్డర్‌గా సేవలు అందించాడు. అయితే సుదర్శన్ పూర్తి స్థాయి ఫిట్‌నెస్‌తో సర్ఫరాజ్‌కు జట్టులో చోటు కష్టమే. యువ పేసర్ గుర్‌నూర్ బ్రార్ కూడా కీవిస్ టూర్‌లో పోటీ ఎదురుకానుంది. జస్ప్రీత్ బుమ్రా ఫిట్‌గా ఉంటే అతన్ని ఎంపిక చేయడం కష్టమే. సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ పేస్ విభాగంలో బలమైన పోటీదారులుగా ఉన్నారు. అంతేకాదు, హర్షిత్ రాణా గాయం నుంచి కోలుకుంటే అతడు కూడా పోటీలోకి వస్తాడు. దీంతో గుర్‌నూర్ బ్రార్‌కు తుది జట్టులో చోటు దక్కేది అనుమానమే. శ్రీలంకతో రెండో టెస్ట్‌లో 33 ఏళ్ల వయసులో టెస్ట్ అరంగేట్రం చేసిన సారంచ్ జైన్ పెద్దగా రాణించలేకపోయాడు. దీంతో న్యూజిలాండ్ సిరీస్‌కు అతడికి చోటు దక్కడం అనుమానమే.

## మహిళల ఆసియా కప్‌లో నేడు థాయిలాండ్‌తో భారత్ ఢీ

**దుబాయ్:** మహిళల టీ20 ఆసియా కప్ గ్రూప్ ఎ ఆరంభ మ్యాచ్‌లో థాయిలాండ్‌తో హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని టీమిండియా క్రికెట్ జట్టు ఈ నెల 30వ తేదీన దుబాయ్‌లో తలపడనుంది. గత దశాబ్ద కాలంగా మహిళల టీ20 ఆసియా కప్‌లో భారత్ అత్యంత ఆధిపత్యం చెలాయించిన జట్టుగా ఉంది. మహిళల టీ20 ప్రపంచ కప్‌లో నిరాశపరిచిన ప్రదర్శన తర్వాత, ఆస్ట్రేలియాతో జరిగిన అత్యంత కీలకమైన పోరులో హర్మన్‌ప్రీత్ రాణించింది.

అయితే, ఉన్నత ర్యాంకు జట్లపై భారత్ తడబడిన ఈ టోర్నమెంట్‌లో, బ్యాటింగ్‌లో ఆమె నిలకడ లేకపోవడం ప్రధాన చర్చనీయాంశాలలో ఒకటిగా నిలిచింది. ఇక నమ్మకమైన బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ దూరమవడంతో, ఆ స్థానంలో ప్రతీకా రావల్‌ను చేర్చుకుంది. అయితే, ఈ ఎంపిక మిడిల్ ఆర్డర్ ఎన్‌ఫోర్సర్ అవసరాన్ని ఏమాత్రం తీర్చదు. ఓపెనర్లుగా భారత్‌కు స్మృతి మంధాన, షఫాలీ వర్మల పటిష్టమైన ఓపెనింగ్ జోడి కొనసాగుతుంది, కానీ 3వ, ఆ తర్వాతి స్థానాల్లోని బ్యాటర్లకు అదే ఊపును కొనసాగించి, స్కోరుబోర్డుకు మరింత వేగాన్ని అందించడం అతిపెద్ద సవాలుగా నిలుస్తోంది. గతసారి ఈ ఫార్మాట్‌లో భారత్ ఆడినప్పుడు కూడా పేలవమైన ఫీల్డింగ్ ఒక ప్రధాన ఆందోళనగా నిలిచింది.



బౌండరీల సమీపంలో వరుసగా అవకాశాలను జారవిడవడం వారి పతనానికి దారితీసింది. దీంతో ఈసారి జట్టు అటువంటి లోపాలను సరిదిద్దుకోవాల్సి ఉంది. స్పిన్ బౌలింగ్ విభాగానికి నాయకత్వం వహించేందుకు అనుభవజ్ఞురాలైన ఆల్‌రౌండర్ దీప్తి శర్మపై ఆధారపడనుంది. టీ20 ప్రపంచకప్‌లో అత్యధిక వికెట్లు తీసిన శ్రీ చరణీ, రాధా యాదవ్, ప్రేమా రావత్‌లు ఈ బాధ్యతను పంచుకోనున్నారు. మరో అనుభవజ్ఞురాలైన రేణుకా సింగ్ ఠాకూర్‌కు తోడు క్రాంతి గౌడ్, అరుంధతిరెడ్డి, నందినీ శర్మ వంటి వారు బాధ్యతలను పంచుకోవడంతో భారత సీమ్ బౌలింగ్ విభాగం కూడా పటిష్టంగా కనిపిస్తోంది. ఈ టీమిండియాలో హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), భారతీ ఫుల్మాలి, రిచా ఘోష్ (వికెట్‌కీపర్), గుణాలన్ కమలిని (వికెట్‌కీపర్), ప్రతీకా రావల్, షఫాలీ వర్మ, దీప్తి శర్మ, క్రాంతి గౌడ్, ప్రేమ రావత్, అరుంధతి రెడ్డి, రేణుకా సింగ్ ఠాకూర్, నందనీ చార్మ ఉన్నారు.

# వాణిజ్యం

## మళ్లీ సంపాదిస్తా.. ఆత్మవిశ్వాసంతో పైకొస్తా

### జి ఛైర్మన్ సుభాష్‌చంద్ర



**ముంబయి, ఆగస్టు 29:** దేశ మీడియా రంగాన్ని శాసించిన ఎస్సెల్ గ్రూప్ ఛైర్మన్ సుభాష్ చంద్ర, తాను తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ వెనకడుగు వేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. దాదాపు రూ.22,006 కోట్ల రుణాలకు గాను కేవలం రూ.6.5 కోట్లు చెల్లించేలా నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ ఆమోదించిన రుణ పరిష్కార ప్రణాళిక నేపథ్యంలో ఒక వీడియో ప్రకటన విడుదల చేశారు. రుణదాతలకు దాదాపు 99.97 శాతం నష్టం వాటిల్లుతున్న ఈ తరుణంలో, తన భవిష్యత్ ప్రణాళికలను ఆయన ధైర్యంగా ప్రకటించారు. నేను సర్వస్వం కోల్పోయిన వ్యక్తిగా మాట్లాడటం లేదు. నా దగ్గర మిగిలిన చివరి రూ.6.5 కోట్లు కూడా ఆమోదించిన ప్లాన్ ప్రకారమే చెల్లించాల్సి ఉంటుంది. నాకు ఒక చిన్న ఇల్లు ఉంది, దానిని అద్దెకిచ్చి వచ్చే ఆదాయంతోనే నా ఖర్చులు వెళ్లదీస్తున్నాను. నాకేమీ పశ్చాత్తాపం లేదు. నేను మళ్లీ సంపాదిస్తాను. నేను ఒక మార్గదర్శకుడిని. కొత్త విషయాలను ఎలా ప్రారంభించాలో నాకు తెలుసు, ఆ పని కొనసాగిస్తానని 75 ఏళ్ల సుభాష్ చంద్ర తన వీడియో సందేశంలో వివరించారు. ఎస్సెల్ గ్రూప్ ఛైర్మన్‌గా మీడియా నుంచి మౌలిక సదుపాయాలు, అమ్యూజ్‌మెంట్ పార్కుల వరకు ఆయన వ్యాపార సామ్రాజ్యం విస్తరించింది. ఇప్పుడు తన తదుపరి ప్రణాళికల గురించి మాట్లాడుతూ, స్విట్జర్లాండ్‌లో కొత్త కార్యాచరణ షురూచేయనున్నట్లు తెలిపారు. "ప్రస్తుతం, స్విట్జర్లాండ్‌లో ఇన్వెస్ట్‌మెంట్ రంగంలో పనిచేసే నా స్నేహితులతో కలిసి పనిచేయాలని ఆలోచిస్తున్నాను. దీనికి సంబంధించిన పూర్తి వివరాలను ఒకటి రెండు వారాల్లో వెల్లడిస్తాను. అలాగే, కొన్ని స్టార్టప్‌లను ముందుకు నడిపించేందుకు నా కుటుంబం నుంచి రూ.24 కోట్ల వరకు అప్పు తీసుకునే అవకాశం కూడా ఉందని ఆయన పేర్కొన్నారు. ఎన్‌సీఎల్‌టీ ఆమోదించిన ప్రణాళిక ప్రకారం, రుణదాతలు క్లెయిమ్ చేసిన రూ.22,006.57 కోట్లకు బదులుగా కేవలం రూ.6.5 కోట్లు మాత్రమే పంపిణీకి అందుబాటులో ఉంటాయి. ఇది రుణదాతలకు భారీ నష్టాన్ని మిగిల్చినప్పటికీ, సుభాష్ చంద్ర మాత్రం ఆత్మవిశ్వాసంతో కొత్త ప్రయాణానికి సిద్ధమవుతున్నట్లు ప్రకటించడం గమనార్హం.




## జియోబ్లాక్‌రాక్ నుంచి కొత్త ఫండ్ ఆఫర్!


**ముంబయి, ఆగస్టు 29:** మ్యూచువల్ ఫండ్ సంస్థ జియోబ్లాక్‌రాక్ మ్యూచువల్ ఫండ్ మరో కొత్త స్కీమ్‌ను తీసుకురాబోతుంది. జియోబ్లాక్‌రాక్ బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్ పేరుతో ఈ కొత్త ఎన్‌ఎఫ్ఓను (న్యూ ఫండ్ ఆఫర్) సెప్టెంబరులో ప్రారంభించనున్నట్లు ప్రకటించింది. ఈ ఎన్‌ఎఫ్ఓ 2026, సెప్టెంబర్ 11న ప్రారంభం కానుండగా, అదేనెల 26 లాస్ట్ డేట్‌గా ఉంది. ఎన్‌ఎఫ్ఓలో యూనిట్ల కేటాయింపు పూర్తయిన తర్వాత కనీసం 5 పని దినాల్లోపు ఈ స్కీమ్‌ను నిరంతర కొనుగోలు, విక్రయాల కోసం తిరిగి ప్రారంభించనున్నారు. జియోబ్లాక్‌రాక్ బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్ అనేది ఒక ఓపెన్ ఎండెడ్ డైనమిక్ అసెట్ అలోకేషన్ ఫండ్. ఇది ప్రధానంగా ఈక్విటీ, ఇతర ఈక్విటీకి సంబంధించిన సాధనాలు, డెట్, మనీ మార్కెట్ సాధనాల్లో ఇన్వెస్ట్ చేస్తుంది. మార్కెట్ పరిస్థితులు, పెట్టుబడి వ్యూహాన్ని బట్టి ఈక్విటీ, డెట్ మధ్య పెట్టుబడులను నిర్వహించడమే ఈ తరహా ఫండ్లలో ప్రధాన ప్రత్యేకత. ఈ స్కీమ్ లక్ష్యం దీర్ఘకాలంలో మంచి మూలధన వృద్ధితో పాటు ఇన్వెస్టర్లకు ఆదాయం అందించడమే. ఈక్విటీ, ఈక్విటీ రిలేటెడ్ సాధనాల్లో 65 శాతం నుంచి 90 శాతం వరకు పెట్టుబడుల్ని డెట్, మనీమార్కెట్ సాధనాల్లో 10నుంచి 35% వరకు కేటాయించనున్నారు. మార్కెట్ పరిస్థితులు, ఫండ్ వ్యూహాన్ని బట్టి వాస్తవ పెట్టుబడి కేటాయింపుల్లో మార్పులు ఉండొచ్చు. ఈ ఎన్‌ఎఫ్ఓలో లంప్ సమ్ పెట్టుబడికి కనీస మొత్తం రూ. 500 గా నిర్ణయించారు. గరిష్ఠ పెట్టుబడికి పరిమితి అంటూ ఏం లేదు. సిప్ ద్వారా కూడా కనీసం రూ. 500 తో పెట్టుబడిని ప్రారంభించొచ్చు. అయితే కనీసం 6 సిప్‌లైనా చేసి ఉండాలి. అదనపు కొనుగోలు లేదా స్విచ్ ఇన్ కోసం కూడా కనీస పెట్టుబడి మొత్తం రూ. 500 గానే ఉంది.

## టాటా సన్స్‌లో ఎస్పీ గ్రూప్ వాటా విక్రయం!




**ముంబయి,ఆగస్టు 29:** టాటా గ్రూప్‌లో అతిపెద్ద మైనారిటీ వాటాదారుగా ఉన్న శాపూర్జీ పల్లోంజీ (ఎస్పీ) గ్రూప్‌తో టాటా గ్రూప్ చర్చలు జరుపుతున్నట్లు సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ బ్లూమ్‌బర్గ్ నివేదించింది. ఖరీదైన రుణాలను తీర్చేందుకు నిధులు సమీకరించుకోవాలని చూస్తున్న ఎస్పీ గ్రూప్‌కు లిక్విడిటీ అందించే మార్గాలపై ఇరు వర్గాలు చర్చిస్తున్నాయి. ఇందులో టాటా గ్రూప్‌కు చెందిన లిస్టెడ్ కంపెనీల షేర్లను ఎస్పీ గ్రూప్‌కు బదిలీ చేసే 'షేర్ స్వాప్ ప్రతిపాదన కూడా ఉన్నట్లు సమాచారం. టాటా కుటుంబ అధిపతి నోయెల్ టాటా ప్రతినిధులు ఈ అంశంపై పలు అవకాశాలను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రైవేట్ కంపెనీ అయిన టాటా సన్స్‌లో ఎస్పీ గ్రూప్‌కు ఉన్న 18.4 శాతం వాటాలో కొంత లేదా మొత్తం వాటాకు బదులుగా టాటా పవర్ వంటి లిస్టెడ్ కంపెనీల షేర్లను ఎస్పీ గ్రూప్‌కు అందించే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. టాటా సన్స్ స్వయంగా ఎస్పీ గ్రూప్ వాటాను కొనుగోలు చేయడం.

ఇందుకోసం విదేశీ బ్యాంకుల నుంచి నిధులు సమీకరించే అవకాశం ఉంది. మరో ప్రత్యామ్నాయం ఎస్పీ గ్రూప్ వాటాను బయటి పెట్టుబడిదారుడికి విక్రయించడం. ముఖ్యంగా అంతర్జాతీయ పెట్టుబడిదారుడికి విక్రయించే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం జరుగుతున్న చర్చలు తప్పనిసరిగా ఒప్పందానికి దారితీస్తాయని చెప్పలేమని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. చర్చలు ముందుకు సాగుతున్న కొద్దీ ప్రతిపాదిత లావాదేవీ నిర్మాణంలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని తెలిపాయి. ఈ మొత్తం వ్యవహారంలో ప్రధాన సవాలు టాటా సన్స్ విలువను నిర్ణయించడమేనని నిపుణులు భావిస్తున్నారు. టాటా గ్రూప్‌లోని అనేక కీలక సంస్థలను టాటా సన్స్ నియంత్రిస్తోంది. ఎయిర్ ఇండియా, ఐఫోన్ తయారీ సంస్థ టాటా ఎలక్ట్రానిక్స్ వంటి అనేక పెద్ద అన్‌లిస్టెడ్ కంపెనీలు కూడా టాటా సన్స్ పరిధిలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో టాటా సన్స్‌కు సరైన విలువను నిర్ణయించడం, తద్వారా ఎస్పీ గ్రూప్‌కు చెందిన 18.4 శాతం వాటాకు న్యాయమైన విలువ కేటాయించడం అత్యంత క్లిష్టమైన అంశంగా మారే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. న్యాయ, నియంత్రణ అంశాలపై పరిశీలషేర్ స్వాప్ ప్రతిపాదనలో టాటా పవర్ వంటి లిస్టెడ్ టాటా కంపెనీల షేర్లు ఉండే అవకాశం ఉన్నందున, దీనికి సంబంధించిన చట్టపరమైన, నియంత్రణపరమైన అంశాలను కూడా ఇరు వర్గాలు పరిశీలిస్తున్నాయి. ఎస్పీ గ్రూప్‌కు తక్షణం నిధులు సమీకరించి రుణభారం తగ్గించుకోవాల్సిన అవసరం ఉండగా, టాటా గ్రూప్ ప్రయోజనాలు, ఇతర వాటాదారుల ఆందోళనలు, నియంత్రణ సంస్థల నిబంధనలు వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది.



## భారత్ మార్కెట్లకు ఫెడ్ ఛైర్మన్ ఎఫెక్ట్!

**న్యూఢిల్లీ,ఆగస్టు, 29:** అమెరికా ఫెడరల్ రిజర్వ్ ఛైర్మన్ కెవిన్ వార్ష్ జాక్సన్ హోల్ సింపోజియంలో చేసిన తాజా వ్యాఖ్యలు అంతర్జాతీయ మార్కెట్లలో కలకలం రేపుతున్నాయి. వార్ష్ చేసిన కఠిన వైఖరి వ్యాఖ్యలతో సెప్టెంబర్‌లో ఫెడ్ వడ్డీ రేట్ల పెంపు ఉండొచ్చన్న అంచనాలు పెరిగాయి. ఫెడ్ రేట్లు ఎక్కువ కాలం అధిక స్థాయిలో కొనసాగితే భారత్‌పై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులఅంచనా. విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు , రూపాయి మారకం విలువ, భారత బాండ్ రాబడులపై ప్రభావాన్ని నిశితంగా గమనించాల్సి ఉంటుంది. అమెరికాలో వడ్డీ రేట్లు ఎక్కువ కాలం అధికంగా కొనసాగితే అక్కడి ఆస్తులు పెట్టుబడిదారులకు మరింత ఆకర్షణీయంగా మారతాయి. దీంతో భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న మార్కెట్ల నుంచి విదేశీ పెట్టుబడిదారులు నిధులను ఉపసంహరించుకునే అవకాశం ఉంటుంది. ఫలితంగా భారత ఈక్విటీ మార్కెట్లలో విదేశీ నిధుల ప్రవాహం తగ్గే ప్రమాదం ఉంది. అదే సమయంలో బలపడే అమెరికా డాలర్ భారత రూపాయిపై అదనపు ఒత్తిడిని తీసుకురావచ్చు. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ మరింత బలహీనపడే అవకాశం ఉంటుందన్న అంచనాలున్నాయి. అమెరికా బాండ్ రాబడులు పెరిగితే భారత్‌లోనూ బాండ్ రాబడులు పైకి వెళ్లే అవకాశం ఉంది. ఫెడ్ రేట్ల పెంపు అంచనాలు బంగారం ధరలపై కూడా ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది.




## ఐటి రిటర్నులకు గడువు ముంచుకొస్తోంది

**ముంబయి, ఆగస్టు 29:** ఆదాయపు పన్ను రిటర్న్ దాఖలు చేయడానికి వేర్వేరు రకాల పన్ను చెల్లింపుదారులకు వేర్వేరు డెడ్‌లైన్స్ ఉన్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరం లేదా 2026-27 మదింపు సంవత్సరానికి సంబంధించి కొందరు పన్ను చెల్లింపుదారులకు 2026, ఆగస్ట్ 31 గడువుగా ఉంది. ముఖ్యంగా ఎలాంటి టాక్స్ ఆడిట్ అవసరం లేని వారికి, బిజినెస్ లేదా ప్రొఫెషనల్ ఆదాయం ఉన్న పన్ను చెల్లింపుదారులు ఈ తేదీలోపు ఐటీఆర్ దాఖలు చేయాల్సి ఉంటుంది. ఆ గడువు దాటితే తర్వాత బిలేటెడ్ ఐటీ రిటర్న్ దాఖలు చేసే అవకాశం ఉన్నప్పటికీ, ఆలస్య రుసుముతో పాటు ఇతర ప్రభావాలు కూడా ఎదురయ్యే అవకాశం ఉంది. ఈ గడువు ప్రధానంగా కింది వర్గాలకు వర్తిస్తుంది. బిజినెల్ లేదా ప్రొఫెషనల్ ఆదాయం ఉన్న, టాక్స్ ఆడిట్ అవసరం లేని సంస్థల భాగస్వాములు, చట్టంలో పేర్కొన్న కొన్ని ఇతర వర్గాల పన్ను చెల్లింపుదారులు, ట్రస్టులు వంటి వర్గాలకు గతంలో జులై 31 గడువుగా ఉండగా, కొన్ని మార్పుల నేపథ్యంలో ఆగస్ట్ 31 వరకు అదనపు సమయం లభించినట్లు సమాచారం. 2026-27 మదింపు సంవత్సరానికి సంబంధించి సాధారణ ఐటీఆర్ గడువులు ఇలా ఉన్నాయి. వేతన జీవులు, బిజినెల్ లేదా ప్రొఫెషనల్ ఆదాయం లేని నాన్ ఆడిట్ టాక్స్ పేయర్లకు జులై 31 లాస్ట్ డేట్. టాక్స్ ఆడిట్ అవసరం లేని బిజినెస్ లేదా ప్రొఫెషనల్ ఆదాయం ఉన్న వారికి ఆగస్ట్ 31 లాస్ట్ డేట్‌గా ఉంది. కంపెనీలు, టాక్స్ ఆడిట్‌కు లోబడే టాక్స్ పేయర్లకు అక్టోబర్ 31, సెక్షన్ 92ని కింద ట్రాన్స్‌ఫర్ ప్రైసింగ్ రిపోర్ట్ అవసరమైనవారికి 2026, నవంబర్ 30 డెడ్‌లైన్ ఆగస్ట్ 31 లోపు ఐటీఆర్ దాఖలు చేయాల్సిన అర్హత ఉన్న నాన్ ఆడిట్ టాక్స్ పేయర్లు గడువు మిస్ అయితే, నిబంధనలకు లోబడి బిలేటెడ్ ఐటీఆర్ దాఖలు చేయాల్సి ఉంటుంది. దీనికి సాధారణంగా 2026, డిసెంబర్ 31 వరకు అవకాశం ఉంటుంది. అయితే వర్తించే నిబంధనలు, వ్యక్తిగత పరిస్థితులపై ఇది ఆధారపడి ఉంటుంది. ఇంకా గడువు దాటిన తర్వాత ఐటీఆర్ దాఖలు చేస్తే సెక్షన్ 234ఎ కింద రూ. 5 వేల వరకు లేట్ ఫీ పడుతుంది. ఇక్కడ ఆదాయం రూ. 5 లక్షల్లోపు ఉంటే రూ. 1000 ఫైన్, రూ. 5 లక్షలు దాటితే రూ. 5 వేల వరకు జరిమానా పడుతుంది.

Print and Published by Gireesh Sangh, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at 11-37, Moramputi, Rajamahendravaram-533 103. Phone: 24 2460408. RNI No.64863/96, Editor: Damerla Sai Baba, Responsible for selection of News-under the PRB Act. Regd: No.H/SD/337/09-11 . Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ



తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

రాజమహేంద్రవరం | ఆదివారం 30 ఆగస్టు 2026 | I


## ఉచిత మెగా మెడికల్ క్యాంపు



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, ఆగస్టు29, ప్రభాతవార్త.** ఎన్.యానాం లో "వేదాంత" సంస్థ సౌజన్యంతో "కిమ్స్ – ఆయుష్ భరోసా" కార్యక్రమం లో భాగంగా కిమ్స్ హాస్పిటల్ వైద్యులు ఉచిత మెగా మెడికల్ క్యాంపు నిర్వహించినట్లు కిమ్స్ మార్కెటింగ్ మేనేజర్ పి.సురేష్ తెలిపారు. ఈ క్యాంపు లో జెనరల్ మెడిసిన్, స్త్రీల వ్యాధుల విభాగము, కంటి వైద్య విభాగము మరియు విభాగముల వైద్యులు రోగులను పరీక్షించి వైద్య సలహాలు ఇచ్చారు. శస్త్ర చికిత్స అవసరమైన రోగులను కిమ్స్ హాస్పిటల్ కు రిఫర్ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం స్థానిక శాసన సభ సభ్యులు అయితా బత్తుల ఆనందరావు,వేదాంత సంస్థ సి.ఎస్.ఆర్. హెడ్ సోమన్ దేవ్, అయితాబత్తుల రాజ శేఖర్, గ్రామ పెద్దలు బంకి భీమ రాజు, చిలుకూరి రాంబాబు, పలువోలు బుజ్జి, దంగేటి చిట్టి బాబు,పినిశెట్టి నరసింహా రావు, జోగి రాజారామ్, రాజేశ్వరి దేవి ఇతర గ్రామ పెద్దల ఆధ్వర్యం లో జరిగినట్లు తెలిపారు. ఈ మెగా క్యాంపు ద్వారా సుమారు 120 మందికి పైగా స్థానిక ఎన్.యానాం ప్రజలు హాజరై వైద్య సేవలు పొందారు. ఇటువంటి సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న వేదాంత సంస్థ సి.ఎస్.ఆర్. హెడ్ సోమన్ దేవ్ ని క్యాంపు నిర్వాహకులను,సేవలు అందించిన వైద్యులు మరియు వైద్య బృందాన్ని కిమ్స్ చైర్మన్ కె.వి.వి.సత్యనారాయణ రాజు, ఎం.డి రవి కిరణ్ వర్మ అభినందించారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం




**చింతూరు,ఆగస్టు 29 ప్రభాత వార్త.**చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాణిజ్య శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శనివారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.కళాశాల ప్రధానాచార్యులు ఎన్.మణిమాల మాట్లాడుతూ క్రీడాకారుల అంకితభావం,పట్టుదలను, గుర్తించడం,దేశంలో యువతను శారీరక దారుఢ్యం, క్రీడల వైపు ప్రోత్సహించడం ఈ దినోత్సవ యొక్క ముఖ్య ఉద్దేశం అన్నారు. మేజర్ ధ్యాన్ చంద్ పుట్టినరోజు సందర్భంగా ప్రతి సంవత్సరం ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని జరుపుకుంటారన్నారు. వైస్ ప్రిన్సిపల్ ముల్లి శేఖర్, అధ్యాపకులు డాక్టర్ వై. పద్మ, డాక్టర్ జి.ఝాన్సీ, జి.సాయికుమార్, బి. శ్రీనివాసరావు, కె.లక్ష్మీ ప్రసన్న, కె.కీర్తి, ఆర్.కిరణ్మయి, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## రంగురాళ్ల ఇక తవ్వితే కేసులే!

### తపాసికొండ రిజర్వ్ ఫారెస్ట్‌పై అటవీశాఖ నిఘా.. రేంజర్ శ్రీనివాస్ హెచ్చరిక



**అడ్డతీగల, ఆగస్టు 29, ప్రభాతవార్త** తపాసికొండ రిజర్వ్ ఫారెస్ట్‌లో రంగురాళ్ల అక్రమ తవ్వకాలపై అటవీశాఖ అప్రమత్తమైంది. అధికారుల కళ్లుగప్పి తవ్వకాలు జరుగుతున్నాయన్న కథనాల నేపథ్యంలో అటవీశాఖ అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. అక్రమ తవ్వకాలకు పాల్పడితే అటవీ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తప్పవని అడ్డతీగల ఫారెస్ట్ రేంజర్ శ్రీనివాస్ స్పష్టం చేశారు.

**తవ్వకాలు జరుగుతున్నది వాస్తవమే**

అటవీ సిబ్బంది నిరంతర నిఘా కొనసాగిస్తున్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో రంగురాళ్ల తవ్వకాలు జరుగుతున్న మాట వాస్తవమేనని రేంజర్ తెలిపారు. తవ్వకాలకు పాల్పడుతున్న వ్యక్తుల వివరాలను సేకరిస్తున్నామని, త్వరలో వారిపై చర్యలు తీసుకునేందుకు ఆధారాలను సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు.

**దళారులపైనా దృష్టి**

రంగురాళ్ల కోసం అడవుల్లోకి వెళ్లే వారితో పాటు వారిని ప్రోత్సహిస్తున్న దళారులపైనా అటవీశాఖ దృష్టి సారించింది. పక్కా ఆధారాలతో దళారులను గుర్తించి కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామని రేంజర్ హెచ్చరించారు. గతంలో రంగురాళ్ల తవ్వకాలను ప్రోత్సహించిన వారి వివరాలను కూడా సేకరిస్తున్నట్లు తెలిపారు.

**కౌన్సెలింగ్ తర్వాత కూడా తవ్వితే చర్యలు**

గతంలో రంగురాళ్ల తవ్వకాలు, వ్యాపారంతో సంబంధం ఉన్న వ్యక్తులను మరో రెండు రోజుల్లో అడ్డతీగల ఫారెస్ట్ కార్యాలయానికి పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు రేంజర్ తెలిపారు. కౌన్సెలింగ్ అనంతరం కూడా అక్రమ తవ్వకాలకు పాల్పడితే ఎలాంటి ఉపేక్ష ఉండదని స్పష్టం చేశారు.

**అటవీ సంపద నష్టానికి జరిమానా**

అక్రమ తవ్వకాల్లో పట్టుబడిన వారిపై సంబంధిత అటవీ చట్టాల ప్రకారం కేసులు నమోదు చేస్తామని తెలిపారు. తవ్వకాల కారణంగా అటవీ సంపదకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి జరిమానాల రూపంలో నష్టపరిహారం కూడా రికవరీ చేస్తామని పేర్కొన్నారు.

**పోలీసుల కౌన్సెలింగ్‌కు రంగురాళ్ల వ్యాపారులు**

మరోవైపు గతంలో పోలీసు రికార్డుల్లో ఉన్న రంగురాళ్ల వ్యాపారులపై కూడా స్థానిక పోలీసు శాఖ దృష్టి సారించినట్లు సమాచారం. వారిని పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించే ప్రక్రియ కొనసాగుతున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది.

## మేయర్ రేసులో నేను కూడా..



**రాజమహేంద్రవరం, ఆగస్టు 29, ప్రభాతవార్త,** రాజమహేంద్రవరం నగర మేయర్ పదవి రేసులో తాను కూడా ఉన్నానని టీడీపీ నగర అధ్యక్షుడు మజ్జి రాంబాబు ప్రకటించారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలుస్తూ, నగరంలోని 42 వార్డుల్లో నాయకులు, కార్యకర్తల సమన్వయంతో పార్టీ బలోపేతానికి కృషి చేశానని తెలిపారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ అప్పారావు జైల్లో ఉన్న సమయంలో పార్టీ వ్యవహారాలను సమన్వయం చేశానని పేర్కొన్నారు. రాజకీయ, సామాజిక, ప్రజాసేవా రంగాల్లో తన సుదీర్ఘ అనుభవం, పార్టీ పట్ల విధేయతను అధిష్టానం పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. పార్టీ అధిష్టానం ఏ నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు.

## పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

### పోలవరం జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో కలెక్టర్ సమీక్ష.



**పోలవరం జిల్లా ప్రతినిధి ఆగస్టు 29 ప్రభాత వార్త.** పోలవరం జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనులపై శనివారం జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన పోలవరం మాట్లాడుతూ పోలవరం జిల్లాలో రహదారులు, తాగునీరు,భవనాలు,విద్యుత్, విద్య, వైద్యం వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల తదితర మౌలిక వసతుల పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు. గిరిజన ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందేలా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధి, వంతెనల నిర్మాణం, తాగునీటి సౌకర్యాల కల్పన, ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రుల్లో అవసరమైన వసతుల మెరుగుదలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన అన్నారు.పోలవరం జిల్లా లో భవన నిర్మాణ పనుల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని, పనుల పురోగతిని అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉన్న మౌలిక వసతుల్లో లోపాలను గుర్తించి వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం మరింత పెంచి, అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. నరేగా ద్వారా పనిచేసిన వివిధ అభివృద్ధి పనులకు బిల్లులు ఎప్పటికప్పుడు సబ్మిట్ చేయాలని ఆయన అన్నారు. మంజూరైన మెటల్ రోడ్లు వెంటనే పనులు ప్రారంభించాలని ఆయన అన్నారు. ఒక్కొక్క ఇంజనీరింగ్ విభాగానికి మంజూరైన పనులను పూర్తి చేయుటకు ఎంత నిధులు అవసరం కావాల్సి ఉన్నది నివేదికలు సమర్పించాలని ఆయన అన్నారు. అంగన్వాడి భవనాలు, డి ఏ జూగా ద్వారా మరుగుదొడ్లు తదితరవి పురోగతిని ఆయన ఆరా తీశారు. వివిధ రకాలైన అభివృద్ధి పనులు టార్గెట్ ప్రకారం పనులు పూర్తి చేయాలని ఆయన అన్నారు. మంజూరైన పనుల కాంట్రాక్టర్లు చేయుచున్న పనులకు నిర్ణీత గడువులోగా పూర్తి చేయని యెడల పెనాల్టీ వేయాలని ఆయన అన్నారు. పోలవరం జిల్లాలోని ఈఈఆర్ఎంఎస్ పనుల గురించి ఆయన ఆరా తీశారు. సున్నంపాడు, సూరపూడి రోడ్డు పనులపై ఆయన ఆరా తీశారు. గ్రామపంచాయతీ భవనాలు, హెల్త్ సెంటర్లు కొత్తగా ఏర్పాటు చేయుటకు నివేదికలు తయారు చేసి సమర్పించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. రబ్బర్ ప్రాసెసింగ్ స్మోకింగ్ రూములు ఏర్పాటు ఏలా ఉంది అడిగారు. పీఎం జన్మన్ పథకం ద్వారా మంజూరైన అభివృద్ధి పనులను అలాగే చేయాలని సూచించారు. పోలవరం జిల్లాలోని పీఎం జన్మన్ పథకం ద్వారా మంజూరు గృహాలు ఎన్ని, ఇప్పటివరకు ఎన్ని గృహాలు పూర్తి చేశారు. ఇంకా ఎన్ని గృహాలు పూర్తి చేయల్సి ఉంది, కొత్తగా మంజూరైన గృహాలకు భూమి పూజ చేసి గృహ పనులు ప్రారంభించాలని ఆయన అన్నారు. పోలవరం జిల్లాలోని వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన వివిధ ఇంజనీరింగ్ అధికారులు సుమారు 100 కోట్ల రూపాయలు మంజూరు చేయించుటకు నివేదికలు తయారుచేసి సమర్పించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ నర సింగారావు, ఈ ఈ ఐ. శ్రీనివాసరావు, ఏపీ ఈపీడీసీఎల్ ఏడి మహంకాళేశ్వరరావు, డి ఈ లు గౌతమి, భవాని, చైతన్య, పి వెంకటరమణ, రమేష్, సాలెం రాజ్, నాగరాజు, రామచంద్రమూర్తి, సుబ్బారావు, శివ, జేఈఈలు, ఏ ఈలు, తదితరులు పాల్గొన్నారు.

## కత్తిపూడి భాష్యం లో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు



**శంఖవరం ఆగస్టు 29 ప్రభాతవార్త** విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి,తెలుగు భాషా సంస్కృతి సాంప్రదాయాలు పెంపొందించే లక్ష్యంతో కత్తిపూడి భాష్యం బ్రాంచీలో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను ఘనంగా అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఈస్ట్ జోన్ -4 జెడ్ ఈ ఓ పి. వేణు ఈస్ట్ జోన్-1 జెడ్ ఈ ఓ గోవిందరాజులు హాజరై విద్యార్థులను అభినందించారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా విద్యార్థులు తెలుగు భాష గొప్పతనాన్ని తెలియజేస్తూ ప్రసంగాలు, పద్యాలు, పాటలు, నాటికలు, సాంస్కృతిక కార్యక్రమాలు ,భువనవిజయసభ నిర్వహించారు. విద్యార్థులు తమ సొంత స్వరాలతో తెలుగు భాష ప్రాధాన్యతను వివరిస్తూ చేసిన ప్రసంగాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ జయ ధనార్జున,ప్రైమరీ ప్రిన్సిపాల్ అనంతకాత్యాయని , వైస్ ప్రిన్సిపాల్ రాంబాబు ఇతర ఉపాధ్యాయులు మాట్లాడుతూ, "తెలుగు మన మాతృభాష మాత్రమే కాదు.. మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబం. .విద్యార్థులు తెలుగు భాషను ప్రేమించి, గౌరవించి, భావితరాలకు అందించాలి" అని అన్నారు. .విద్యార్థుల్లో క్రీడలతో ఆరోగ్యం.. క్రమశిక్షణ.. విజయస్ఫూర్తి, అదే సందర్భంగా భారత హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకొని విద్యార్థులలో తెలుగు భాష పట్ల, క్రీడలు పట్ల ఆశక్తి కలిగేలా ఉపన్యాసం ఇచ్చారు.

## వాడపల్లి వెంకన్నను దర్శించుకున్న ఏపీ శాసనసభ ఉపాధ్యక్షులు రఘురామకృష్ణంరాజు...



**ఆత్రేయపురం, ఆగస్టు,29,(ప్రభాత వార్త)** ఏడువారాల వెంకన్నగా ప్రసిద్ధి చెందిన కోనసీమ తిరుమల శ్రీ వారిని ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉపాధ్యక్షులు, ఉండి నియోజకవర్గ శాసనసభ్యులు రఘురామకృష్ణంరాజు దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. శ్రీ స్వామి వారి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి దర్శించుకున్నారు. అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావులు రఘురామకృష్ణంరాజు కి శేష వస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ, వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి క్షేత్ర మహిమ విశేషమైనదని పేర్కొన్నారు. ముఖ్యంగా భక్తులు ఆచరించే "ఏడు వారాలు -- ఏడు ప్రదక్షిణాలు" కార్యక్రమం గురించి వివరించి, స్వామి వారి అనుగ్రహంతో అనేక మంది భక్తుల కోరికలు నెరవేరుతున్నాయని తెలిపారు. ఈ క్షేత్రాన్ని మరింత మంది భక్తులు దర్శించి స్వామి వారి కృపను పొందాలని ఆకాంక్షించారు. వారి వెంట ధర్మకర్తల మండలి సభ్యులు, పి ఎస్ రాజు, ఆర్డీఓ సత్యనారాయణ, తహసీల్దార్ రామచంద్రమూర్తి,ఏపుగంటి సుబ్బారావు, ఏపుగంటి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌బీఐ ఆధ్వర్యంలో 3వ బెటాలియన్ పాఠశాలకు కంప్యూటర్లు బహూకరణ



**కాకినాడ రూరల్, ఆగస్ట్ 29 (ప్రభాతవార్త):** సేవా కార్యక్రమాల్లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఎల్లప్పుడూ ముందుంటుందని కాకినాడ రీజినల్ మేనేజర్ ఎం.వి.వి.ఎం. కృష్ణ అన్నారు. ఎస్‌బీఐ సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా కాకినాడ 3వ బెటాలియన్ ఏపీఎస్పీ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌కు 13 కంప్యూటర్లను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ ప్రస్తుత సాంకేతిక యుగంలో విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం ఎంతో అవసరమన్నారు. డిజిటల్ నైపుణ్యాలను పెంపొందించుకుని భవిష్యత్తుకు సిద్ధం కావాలని సూచించారు. ఎస్‌బీఐ డిజిటల్ సేవలైన యోనో, వాట్సాప్ బ్యాంకింగ్‌తో పాటు సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై పాఠశాల సిబ్బందికి అవగాహన కల్పించారు. భవిష్యత్తులో పాఠశాల, బెటాలియన్‌కు అవసరమైన కార్యక్రమాలకు ఎస్‌బీఐ తరఫున సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్ కె. నవీన్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధికి కంప్యూటర్ పరిజ్ఞానం, డిజిటల్ నైపుణ్యాలు ఎంతో కీలకమన్నారు. పాఠశాలకు 13 కంప్యూటర్లు అందించిన ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ ఎం.వి.వి.ఎం. కృష్ణ, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ ఎస్. దేవానందరావు, అసిస్టెంట్ కమాండెంట్లు మురళీకుమార్, గంగారాజు, చంద్రశేఖర్ రావు, స్కూల్ డైరెక్టర్ కమ్ అసిస్టెంట్ కమాండెంట్ మన్మథరావు, ఏఓ మోహన్ రావు, ప్రిన్సిపాల్ కె. ఈశ్వరి దేవి, ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ మనస్వి, ఆర్ఐలు, ఏఆర్ఎస్ఐలు, శిక్షణలో ఉన్న సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## కడియం నర్సరీల వైవిధ్యానికి డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ప్రశంసలు



**కడియం, ఆగస్టు 29 ( ప్రభాతవార్త)** కడియం మండలంలోని శ్రీ సత్యదేవా నర్సరీని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ స్పీకర్ కే. రఘురామకృష్ణరాజు శనివారం సందర్శించారు. నర్సరీ అధినేత పుల్లా ఆంజనేయులు ఆయనకు ఆగ్లోనిమా థాయ్ బటర్‌ఫ్లై మొక్కను అందించి స్వాగతం పలికారు. నర్సరీలోని వివిధ రకాల మొక్కలను పరిశీలించిన డిప్యూటీ స్పీకర్, ముఖ్యంగా అవకాడో చెట్టును చూసి మన ప్రాంతంలోనూ అవకాడో పండ్లు కాయడం ఆశ్చర్యంగా ఉందన్నారు. లక్ష్మణ ఫలం, హనుమాన్ ఫలం మొక్కల ప్రత్యేకతలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేలాది రకాల మొక్కలను ఒకేచోట చూడటం ఆనందంగా ఉందన్నారు. శ్రీ సత్యదేవా నర్సరీ ద్వారా ఇంతటి మొక్కల వైవిధ్యాన్ని అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో విదేశాల నుంచి కొత్త రకాల మొక్కలను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ఉద్యాన పంటల సాగు మరింత విస్తరించే అవకాశం ఉందన్నారు. నర్సరీలో మొక్కల వైవిధ్యం, నిర్వహణ తీరును డిప్యూటీ స్పీకర్ అభినందించారు. నర్సరీ రైతులు పుల్లా వీరబాబు, పుల్లా రాజశేఖర్, సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.

## రాష్ట్ర ఎస్టీ కమీషన్ చైర్మన్ ప్రజా దర్భారుకి ధరకాస్తుల వెల్లువ





**రాజవొమ్మంగి, అగస్టు 29, ప్రభాతవార్త** రాజవొమ్మంగి మండలం పరిషత్ కార్యాలయంలో శనివారం రాష్ట్ర ఎస్టీ కమీషన్ చైర్మన్ సొళ్ళ బొజ్జిరెడ్డి నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమానికి బారీగా ధరకాస్తులు వచ్చాయి. కిర్రాబు పంచాయితీ మడేరు వాగుపై కిర్రాబు ఆనకట్ట నిర్మించాలని గతంలో ధర్నా చేసి పోలీసు కేసులుతో కోర్టులు చుట్టూ తిరిగినా నేటికీ ఆనకట్ట నిర్మాణం జరుగలేదని, ఆనకట్ట అవసరమని ఆదివాసీ నేతలు వంతు బాలకృష్ణ, తాము సూరిబాబు, లొసుల రాజబాబు లు చైర్మన్ కు పిర్యాదు చేశారు. కొండపోడు పట్టాలు ఇచ్చి సర్వే చేసి భూములు ఇవ్వలేదని వంతు బాలకృష్ణ చైర్మన్ కు తెలిపారు. లాగరాయి పి. హెచ్. సి చుట్టూ ప్రహరీ గోడ పూర్తిగా కావాలని ఎంపిపి గోము వెంకటలక్ష్మి అర్జీని ఇచ్చారు. శరభవరం పంచాయితీ 35 కిలోలు రేషన్ కార్డులు అవసరమని మార్కెట్ కమిటీ చైర్మన్ లోతా లక్ష్మణరావు అర్జీని ఇచ్చారు. రాజవొమ్మంగి మండల కేంద్రం నుండి జిల్లా కేంద్రమైన రంపచోడవరం కు ఉదయాన్నే బస్సు సౌకర్యం కావాలని సయ్యద్ జిలానీ చైర్మన్ కు తెలిపారు. రాజవొమ్మంగి మండల కేంద్రంలో ఆర్. టి. సి. శాశ్వత బస్సు షెల్టర్, డిగ్రీ కళాశాల అవసరమని సామాజిక వేత్త నోరి దత్తాత్రేయ అర్జీని ఇచ్చారు. రాజవొమ్మంగి పి. హెచ్. సి ని సి. హెచ్. సి చేయడానికి అనుమతులు రావడం పై చైర్మన్ కు అభినందనలు తెలిపారు. కిమ్మలగడ్డ.. ముర్లవారి వీధి మధ్య అటవీ అభ్యంతరాలు వల్ల 2.50 కి. మీ రహదారి పనులు ఆగిపోతున్నాయని మాజీ ఎంపిటిసి దొడ్డంరెడ్డి చిన్నతల్లి వినతిపత్రంను ఇచ్చారు. కింద్ర పంచాయితీ కొత్తపాలెం గ్రామానికి రహదారి సౌకర్యం కావాలని అర్జీ వచ్చింది. దూసరపాము.. కింద్ర హైవే జంక్షన్ వద్ద ట్రాఫిక్ ఐలాండ్, ఫ్లడ్ లైట్లు లేవని లాగరాయి గ్రామస్తులు పిర్యాదు చేశారు. సూరంపాలెం గ్రామంలో గిరిజనేతరులు తమ పొలం ఆక్రమించారని గిరిజన మహిళ పిర్యాదుని ఇవ్వడం జరిగింది. చికిలింత పంచాయితీ కరుదేవపాలెం గ్రామంలో నకిలీ గిరిజన కులధ్రువపత్రాలతో ప్రభుత్వ పథకంలో ఇల్లు, రేషన్, సోలార్, అనేక రాయితీలు కొండరెడ్లు గా పొందుతున్నారని జిల్లా కలెక్టర్ కు రెండుసార్లు పిర్యాదులు ఇచ్చినా కనీసం విచారణ లేదని రెడ్డి శ్రీను, కొచ్చా భద్రయ్యలు ఎస్టీ కమీషన్ చైర్మన్ కు పిర్యాదు చేశారు. లబ్బర్తి డ్వాక్రా వి. ఓ. ఏ ని తప్పుడు ఆరోపణలుతో ఇబ్బందులు గురించేస్తున్నారని ఎంపిపి గోము వెంకటలక్ష్మి, ఆదివాసీ నేత వంతు బాలకృష్ణ చైర్మన్ కు సమస్యను వివరించారు. కొండపల్లి గ్రామంలో 24 కుటుంబాలకు కొండపోడు పట్టాలు ఇప్పించాలని మాజీ సర్పంచ్ కుంజం జగన్నాధస్వామి ఆధ్వర్యంలో చైర్మన్ కు అర్జీలను ఇచ్చారు. రహదారులు, త్రాగునీరు, భూసమస్యలపై పిర్యాదులు వచ్చాయి. అనంతరం చైర్మన్ ను మండల బిజెపి అధ్యక్షులు లొసుల రాజబాబు, జిల్లా ఉపాధ్యక్షులు తాము సూరిబాబు, వంతు బాలకృష్ణ సన్మానం చేశారు. ఎంపిపి గోము వెంకటలక్ష్మి కూడా చైర్మన్ ను సన్మానం చేశారు. లబ్బర్తి మాజీ సర్పంచ్ మిరియాల సత్యవతి, సయ్యద్ జిలానిలు చైర్మన్ ను సన్మానం చేశారు. ఈకార్యక్రమంలో ఎంపిపి గోము వెంకటలక్ష్మి, తహసీల్దార్ స్వామి, ఎంపిడిఓ లోకుల యాదగిరేశ్వరరావు, ఏ. టి. డబ్ల్యూ. ఓ. కృష్ణమోహన్, మార్కెట్ కమిటీ చైర్మన్ లోతా లక్ష్మణరావు, మండల బీజేపీ అధ్యక్షులు లొసుల రాజబాబు, జిల్లా ఉపాధ్యక్షులు తాము సూరిబాబు, బీజేపీ మహిళా మోర్చ కుంజం సత్యనారాయణమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి తుర్రం బాబూరావుదొర, కార్యదర్శి లోతా భారతి, డివి డి ప్రసాద్, మాజీ సర్పంచ్ కుంజం జగన్నాదస్వామి, ఎం.ఇ. ఓ లు కె. వి. వి. సత్యనారాయణదొర, టి. సూరయ్యరెడ్డి, ఏ. పి. ఓ శ్రీనివాస్, ఏ. ఓ. చక్రధర్, హౌసింగ్ వర్క్ ఇన్ స్పెక్టర్ శ్రీనివాస్, జనసేన సాయి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నేడు వాడపల్లి క్షేత్రంలో వకుళమాత అన్నదాన భవనం కేంద్రం రాష్ట్ర మంత్రులతో ప్రారంభోత్సవం..

### ఒకేసారి మూడువేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించేలా రూపకల్పన.... ఏర్పాట్లు పూర్తి.. ఉప కమిషనర్ ఈఓ, నల్లం.






**ఆత్రేయపురం, ఆగస్టు,29,(ప్రభాత వార్త)** కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం రూ.6.25 కోట్లతో చేపట్టిన వకుళమాత నిత్యాన్నదాన భవనం నేడు కేంద్ర రాష్ట్ర మంత్రులతో ప్రారంభోత్సవం జరుగుతున్నట్లు దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ ఈఓ, నల్లం సూర్య చక్రధర్రావు లు తెలిపారు.సుమారు ఏడాది కాలం నుంచి పనులు కొనసాగుతూనే ఉన్నాయి. ఇటీవల దేవాదాయశాఖ కమిషనర్ రామ చంద్రమోహన్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తదితరులు పరిశీలించి త్వరితగతిన పూర్తిచేసి అందుబాటు లోకి తీసుకురావాలని తెలపడంతో పనులు వేగ వంతం చేశారు. ఒకేసారి మూడువేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించేలా భవనానికి రూపకల్పన చేశారు. "వకుళ మాత అన్నదాన భవనం నిర్మాణం"గత వైసిపి ప్రభుత్వ లో వకుళ మాత అన్నదాన భవనం నిర్మాణానికి ది.23-07-2023 తేదీన శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించి కొన్ని పనులు చేసి, వదిలేశారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ది. 20-12-2024 నాడు శాసన సభ్యులు బండారు సత్యానందరావు చేతుల మీదుగా "వకుళ మార అన్నదాన భవనం" పనులను పునఃప్రారంభించారు. పనులు వేగవంతంగా చేసి నిర్మాణం పూర్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర దేవదాయ ధర్మదాయ మంత్రి వర్యులు ఆనం రామనారాయణ రెడ్డి, స్థానిక శాసన సభ్యులు బండారు సత్యానందరావు వార్ల సహకారంతో వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం శ్రీనివాసా ప్రాంగణం నందు వకుళామాత అన్నదాన భవనం రూ.6.25 నిర్మాణం పూర్తి చేశారు. అలాగే వకుళామాత అన్నదాన భవనంలోని కావలసిన వంట సామాగ్రి, టేబుల్స్, పశ్చిమగోదావరి జిల్లా రైస్ మిల్లర్ అసోసియేషన్ సహకారంతో కోటి 50 లక్షలు తో సమకూర్చారు. అలాగే ఇతర దాతల సహకారంతో 80 లక్షలు సమకూరింది .మొత్తం రూ. 8,55 కోట్లతో వకుళామాత అన్నదాన భవనం నిర్మాణం పనులు పూర్తిచేసుకుని ఆదివారం మధ్యాహ్నం కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర దేవా దాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు తగు ఏర్పాట్లు చేసినట్లు దేవస్థానం డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు .ఇప్పటివరకు ఇక్కడ తాత్కాలిక పందిళ్లు వేసి అన్నప్ర సాదం పంపిణీ చేస్తూ వచ్చారు. అన్నదాన శాల నిర్మాణానికి దాతలు ఇతోధికంగా విరాళాలు ఇచ్చి తోడ్పాటు అందించడంతో పనులు ముందుకు సాగాయి. దీంతో భక్తులకు సౌకర్యవంతంగా అన్న ప్రసాదం స్వీకరించే విధంగా ఏర్పాట్లు చేయడంతో భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.







## వృక్షా బంధన్ ద్వారా ప్రకృతి పరిరక్షణకు పాటుపడదాం...



**గండేపల్లి. ఆగస్టు 29. ప్రభాతవార్త** గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ లో రాఖీ పౌర్ణమి పర్వదినం సందర్భంగా జాతీయ పర్యావరణ మిత్ర అవార్డు గ్రహీత తోటకూర గంగాధర్ చెట్టు కు రాఖీ కట్టి వినూత్నంగా వృక్షా బంధన్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మొక్కలు నాటిన ఆయన మాట్లాడుతూ ఆదిత్య యూనివర్సిటీ ప్రో. ఛాన్సలర్ డా. నల్లమిల్లి సతీష్ రెడ్డి గారి పిలుపు మేరకు ప్రకృతి పరిరక్షణ కొరకు తన వంతు బాధ్యత గా భావించి మొక్కలు నాటడం జరిగింది అని తెలిపారు. రక్షా బంధన్ కార్యక్రమం ద్వారా సోదరా సోదరీ బంధం బలపడుతుంది వృక్షాబంధన్ ద్వారా ప్రకృతి పులకిస్తుంది..కావున ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటడం,పెంచడం వల్ల పర్యావరణ పరిరక్షణకు కృషి చేసినవారు అవుతారు అని పర్యావరణ పరిరక్షణ కొరకు మొక్కలు పెంచడం ఏకైక మార్గం అని అందరికీ అవగాహన కలిగించడానికి ఈ రాఖీ పండుగ రోజున వృక్షాబంధన్ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ తన సోదరి లేదా సోదరుడు పేరిట మొక్కలు నాటి పెంచే విధంగా ప్రయత్నం చేయాలని తద్వారా ప్రకృతి పరిరక్షణ కు మన వంతు కృషి చేయాలని ప్రొఫెసర్ డా.ఎన్.విశాలాక్షి, ప్రో. వి. సునీత లు కోరారు. ప్రకృతి పరిరక్షణ కొరకు మొక్కల పెంపకం పై అవగాహన కలిగిస్తూ వినూత్నంగా వృక్షాబందన్ కార్యక్రమం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించడం అభినందనీయం అని డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ డా.మేడపాటి శ్రీనివాస రెడ్డి అభినందిస్తూ అందరికీ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు.

## అగ్నికి ఆహుతైన ఇల్లు.. కన్నీటిలో కుటుంబం

### -పవన్ కళ్యాణ్ ఆదేశాలతో బాధితులకు దొరబాబు అండ



**పిఠాపురం, ఆగస్టు 29 ( ప్రభాతవార్త )** పిఠాపురంనియోజకవర్గం, పిఠాపురంమండలంలోని పి.దంతమూరు గ్రామంలో శనివారం జరిగిన అగ్ని ప్రమాదం ఓ కుటుంబాన్ని నిరాశ్రయంగా మార్చింది. గ్యాస్ లీకేజీతో ఒక్కసారిగా చెలరేగిన మంటల్లో రాజులమ్మ, వీరబాబు, లక్ష్మీ కుటుంబానికి చెందిన ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఇంట్లోని సామగ్రి, దుస్తులు, నిత్యావసర వస్తువులు మొత్తం మంటలకు ఆహుతయ్యాయి. కళ్లముందే సర్వం కాలిపోవడంతో బాధిత కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. ఈ ఘటనపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందించి, బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబును ఆదేశించారు. దీంతో దొరబాబు వెంటనే పి.దంతమూరు గ్రామానికి చేరుకుని బాధితులను పరామర్శించారు. రూ.5 వేల ఆర్థిక సాయంతో పాటు బియ్యం, పప్పులు, కూరగాయలు అందజేసి కుటుంబానికి అండగా నిలిచారు. ప్రభుత్వం నుంచి అందాల్సిన ఆర్థిక సాయాన్ని తక్షణమే మంజూరు చేయాలని అధికారులను కోరారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ.. పిఠాపురంలో ఏ సమస్య వచ్చినా 'నేను ఉన్నాను' అనే భరోసాతో పవన్ కళ్యాణ్ ప్రజలకు అండగా నిలుస్తున్నారని, బాధిత కుటుంబం కష్టకాలంలో తమ వంతు సహాయం అందించామని తెలిపారు. మహిళా సంక్షేమ భవనం ప్రారంభమల్లాం గ్రామంలోని ఎస్సీ కాలనీలో నిర్మించిన మహిళ సంక్షేమ భవనాన్ని , పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎమ్మెల్యే పెండెం దొరబాబు, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బొర్రా అను బాబు శనివారం ఉదయం ప్రారంభించారు. మహిళల సంక్షేమం, అభివృద్ధికి ఈ భవనం ఉపయోగపడేలా కార్యక్రమాలు నిర్వహించాలని వారు ఆకాంక్షించారు. మహిళలు తమ సమస్యలను చర్చించుకోవడంతో పాటు వివిధ శిక్షణా కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు ఈ భవనం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. అంతకుముందు దొరబాబు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు మరిన్ని అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు మాట్లాడుతూ మహిళల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వడం అభినందనీయమన్నారు. భవనాన్ని సద్వినియోగం చేసుకుని మహిళలు అభివృద్ధి సాధించాలని కోరారు. ఈ కార్యక్రమాలలో పి. దొంతమూరు మాజీ సర్పంచ్ కొత్తపల్లి రమణ బాబ్జి, పిఠాపురం ఎంపీపీ కన్నా బత్తుల కామేశ్వరరావు, బాలిపల్లి రాంబాబు, రెవెన్యూ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ అంతరాయాల నివారణకు పోలీసుల ప్రత్యేక చర్యలు



**గోకవరం: ఆగష్టు 29 ప్రభాత వార్త** మండల కేంద్రమైన గోకవరంలో నిత్యం ఏర్పడుతున్న ట్రాఫిక్ అంతరాయాలను నివారించేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా గోకవరం ప్రధాన రహదారిపై రోడ్డు పక్కన ఇష్టారాజ్యంగా నిలిపిన వాహనాలను పోలీసులు తొలగించారు. గోకవరం మెయిన్‌రోడ్డు నుంచి ప్రధాన రహదారి వరకు పోలీసులు పర్యవేక్షణ చేపట్టి, రోడ్డు పక్కన వాహనాలను పార్కింగ్ చేయకుండా వాహనదారులకు అవగాహన కల్పించారు. రహదారులపై వాహనాలను ఇష్టారాజ్యంగా నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే ఇకపై కేసులు నమోదు చేస్తామని కోరుకొండ సీఐ సత్యనారాయణమూర్తి వాహనదారులను హెచ్చరించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే విధంగా వాహనాలను పార్కింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ స్పష్టం చేశారు. ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పోలీసులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గోకవరం ఎస్ఐ పవన్‌కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

## రాజీవ్ గాంధీ విగ్రహం ధ్వంసంపై కఠిన చర్యలు తీసుకోవాలి

### -హెచ్చరించిన టీకే విశ్వేశ్వర రెడ్డి, బాలేపల్లి మురళీధర్



**రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 29, ప్రభాతవార్త,** రాజమండ్రి జాంపేట వంతెన సమీపంలోని మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహం చేతిని ధ్వంసం చేసిన ఘటన దారుణమని అర్బన్ కాంగ్రెస్ కమిటీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ది రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ రాజమండ్రి పార్లమెంట్ కోఆర్డినేటర్ టికే విశ్వేశ్వర్ రెడ్డి, అర్బన్ జిల్లా అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ మాట్లాడారు. రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని, 15 రోజుల్లో నిందితులను పట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పోలీసులు సీరియస్ గా స్పందించకపోతే ఆ విగ్రహం వద్దనే నిరాహార దీక్ష చేయడానికి కూడా సిద్ధమని ప్రకటించారు. రాజమహేంద్రవరంలో మహిళలకు రక్షణ కల్పిస్తామని చెబుతున్న ప్రభుత్వం, ప్రియాంక హత్య ఘటనపై కనీసం ప్రకటన కూడా చేయకపోవడం బాధాకరమన్నారు. బయట వ్యక్తుల్ని ఎక్కడ పార్లమెంటు సభ్యులుగా ఎన్నుకోవడం వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండటం లేదని ఓటర్లు కూడా ఈ విషయంలో పునరాలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్య విలువలకు, జాతీయ నాయకుల పట్ల గౌరవానికి భంగం కలిగించేలా వ్యవహరించిన దుండగులను వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పిసిసి ఉపాధ్యక్షుడు ఎస్ మార్టిన్ లూథర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ రాజశేఖర్, తాడి సూరిబాబు, బత్తిన చంద్రరావు, బర్రె సుబ్రహ్మణ్యం, సింధియా రాణి, నిల్లా వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

## మృత్యువును ఓడించిన మాతృత్వం

### --ఆగిన గుండెకు ప్రాణం పోసిన యశోద హైటెక్ సిటీ వైద్యులు



**కాకినాడ రూరల్, ఆగస్ట్ 28 (ప్రభాతవార్త):** ప్రసవ సమయంలో గుండె ఆగిపోయి, బహుళ అవయవ వైఫల్యానికి గురైన 23 ఏళ్ల బాలింతను హైదరాబాద్‌లోని యశోద హైటెక్ సిటీ ఆసుపత్రి వైద్యులు అత్యాధునిక చికిత్సతో కాపాడారు. పెరిపార్టమ్ కార్డియోమయోపతి అనే అరుదైన సమస్యతో ప్రాణాపాయ స్థితికి చేరుకున్న ఆమెకు వైద్యులు అత్యవసరంగా ఎక్మో చికిత్స అందించి ప్రాణాలు కాపాడడం జరిగిందని యశోద హాస్పిటల్‌కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ దామోదర్ రెడ్డి గౌని పేర్కొన్నారు. కాకినాడ లో ఏర్పాటు చేసిన పాత్రికేయులు సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాలింతను మృత్యువు నుంచి కాపాడి ప్రాణాలు నిలబెట్టడం కోసం కార్డియాలజీ, క్రిటికల్ కేర్, వాస్క్యులర్ సర్జరీ, ప్రసూతి, స్త్రీరోగ, నెఫ్రాలజీ విభాగాల వైద్యులు సమన్వయంతో చికిత్స అందించారు. అత్యంత విషమ పరిస్థితుల్లో వైద్యం అందించడం జరిగిందన్నారు. ప్రస్తుతం తల్లీబిడ్డలు ఇద్దరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి వెళ్లడం జరిగిందన్నారు. ఈ అరుదైన వైద్య విజయానికి సంబంధించిన వివరాలను విలేకరులకు డాక్టర్ దామోదర్ రెడ్డి గౌని, ఆంధ్రప్రదేశ్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ వి. సాయి కిరణ్ వెల్లడించారు. నిష్ణాతులైన వైద్యుల ప్రతిభకు యశోద హైటెక్ సిటీ లాంటి అత్యాధునిక ఆసుపత్రి సదుపాయాలు తోడైతే వైద్య రంగంలో ఎన్నో అద్భుతాలు సాధించవచ్చని తెలిపారు.

## ఏడువారాల వెంకన్నకు జన నీరాజనం....

### -స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ,60 లక్షలు -వృద్ధులు దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు ఏర్పాట్లు పర్యవేక్షించిన డీసీ, నల్లం ,ఛైర్మెన్, ముదునూరి.



**ఆత్రేయపురం, ఆగస్టు,29,(ప్రభాత వార్త)** ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం శ్రావణమాసం మూడవ శనివారం కావడంతో ఏడు శనివారాల నోము ఆచరించే భక్తులతో పోటెత్తింది. ఉదయం జోరు వాసను సైతం లెక్కచేయ కుండా భక్తులు మాడ వీధులలో ప్రదిక్షణలు గావించారు. వేకువ జామున సుప్రభాత సేవతో ప్రారంభమైన దర్శన కార్యక్రమాలు రాత్రి వరకు కొనసాగాయి. భక్తులు రాత్రి వరకూ క్యూలైన్లలో నిలబడి వెళ్ళి స్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ప్రత్యేక ప్రతిభావంతులు, వృద్ధుల ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. లొల్ల వంతెన నుండీ ఆలయం వరకు ఉచిత వాహన సౌకర్యం కల్పించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో క్యూలైన్లలో నిలబడి స్వామివారి దర్శన భాగ్యాన్ని పొందారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ సూర్యచక్రధరరావు, మరోపక్క ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజులు కూడా ఎక్కడకక్కడ ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా బిస్వామివారి దర్శనం కలిగేలా ఏర్పాట్లు నిర్వహించారు. వర్షంలో తడుస్తూనే.. ఇబ్బందులు లేకుండా సిబ్బందిని అప్రమత్తం చేశారు. క్యూలైన్లు, మాదవీధులు, వాడపల్లి క్షేత్రానికి 70 వేలకు పైగా భక్తులు ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుండి భక్తులు విజయవాడ, కడప, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, జిల్లాలతో పాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, ఒరిస్సా, రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ముఖ్యంగా ఏడు వారాల వెంకన్న వ్రతం ఆచరిస్తున్న భక్తులు అధిక సంఖ్యలో దర్శనానికి రావడం విశేషం. వారంతా అత్యంత భక్తి శ్రద్ధతో స్వామివారిని కనులారా వీక్షించి తరించారు. వర్షం దృష్ట్యా భక్తుల ఆరోగ్య భద్రత కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు, అంబులెన్స్ సేవలు అందుబాటులో ఉంచారు. ఆలయ డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వహణాధికారి నల్లం సూర్య చక్రధర రావు మాట్లాడుతూ.. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమగ్ర చర్యలు చేపట్టినట్లు తెలిపారు. 70 వేల వరకు భక్తులు స్వామివారిని దర్శించుకోగా సుమారు 25 వేల మందికి పైగా అన్నప్రసాదం స్వీకరించారాని స్వామివారి కి వివిధ సేవల ద్వారా రూ,60 లక్షల వరకూ ఆదాయం సమకూరినట్లు వెల్లడించారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు, ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఏర్పాట్లను భక్తులు ప్రశంసించారు. స్వామివారి సేవలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, సూపరింటెండెంట్ పులపర్తి రాంబాబు, సీనియర్ అసిస్టెంట్ కుమార్, మనోజ్, వర్మ, జూనియర్ అసిస్టెంట్ వై శ్రీనివాస్, వరప్రసాద్, గ్రామస్తులు ఏపుగంటి సుబ్బారావు, ఏపుగంటి వెంకటేష్ తదితరులు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సాయంత్రం విశాఖపట్నం వాస్తవ్యులు రాధాకృష్ణ డాన్స్ అకాడమీ వారి వివిధ నృత్య ప్రదర్శనలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

## కామరాజుపేటలో టీడీపీకి మరో ఎదురుదెబ్బ

### -సీనియర్ నాయకులు, కార్యకర్తల రాజీనామా



**గోకవరం: ఆగష్టు 29 ప్రభాత వార్త** తెలుగుదేశం పార్టీకి గోకవరం మండలం కామరాజుపేట గ్రామంలో మరో ఎదురుదెబ్బ తగిలింది. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతున్న పలువురు సీనియర్ నాయకులు, కార్యకర్తలు వరుసగా పార్టీకి రాజీనామాలు చేస్తున్నట్లు తెలిపారు. గతంలో గోకవరం మండల టీడీపీ మాజీ ఉపాధ్యక్షుడు, సీనియర్ నాయకుడు అడపా ఫణీంద్ర కిషోర్ రాజీనామా చేసిన నేపథ్యంలో పలువురు సీనియర్ తెలుగు తమ్ముళ్లు కూడా రాజీనామా బాట పట్టడం చర్చనీయాంశంగా మారింది. కామరాజుపేట గ్రామంలో టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతూ, పార్టీ సభ్యత్వ కార్యక్రమాల నుంచి నేటి వరకు కార్యకర్తలుగా పనిచేసిన పలువురు తమ రాజీనామాలను ప్రకటించారు. ఈ సందర్భంగా తాము టీడీపీ స్థాపించిన నాటి నుంచి, రూ.10 సభ్యత్వం తీసుకున్నప్పటి నుంచి ఇప్పటి వరకు పార్టీలో కొనసాగామని వారు పేర్కొన్నారు. కామరాజుపేట గ్రామ రెండో వార్డు ఎంపీటీసీగా 300కు పైగా ఓట్ల మెజార్టీతో విజయం సాధించిన నడిమింటి నాగమణి వెంకటరమణ టీడీపీకి రాజీనామా చేశారు. అలాగే సుమారు 25 సంవత్సరాలుగా పార్టీలో కొనసాగుతున్న కామరాజుపేట జడ్పీ పాఠశాల చైర్మన్ బూతుకూరి రాధాకృష్ణ కూడా టీడీపీ సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు తెలిపారు. అదేవిధంగా సుదీర్ఘకాలంగా టీడీపీలో కొనసాగుతున్న అడపా సత్తిబాబు, అడపా చంద్రమౌళి, బత్తి శ్రీనివాస్, అడపా శేషగిరి, పిర్ల రాజబాబు, నక్క ఏసుబాబు, అడపా ప్రసాద్, మట్ట కామేశ్వరరావు తదితరులు పార్టీకి రాజీనామా చేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా అడపా ఫణీంద్ర కిషోర్‌తో పాటు పలువురు శ్రేయోభిలాషులు, స్నేహితులు పాల్గొన్నారు. కామరాజుపేటలో టీడీపీకి చెందిన సీనియర్ నాయకులు, కార్యకర్తలు వరుసగా రాజీనామాలు చేయడం స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది

## ప్రాణాపాయ బాలింతకు 'ఎక్మో'తో ఊపిరిపోసిన యశోద వైద్యబృందం

### - డాక్టర్ దామోదర్ రెడ్డి గౌని నేతృత్వంలో అరుదైన ప్రాణరక్షణ



**రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 29, (ప్రభాతవార్త),** ప్రసవ సమయంలో తీవ్ర గుండె సంబంధిత సమస్యతో ప్రాణాపాయ స్థితికి చేరుకున్న 23 ఏళ్ల బాలింతకు హైదరాబాద్ హైటెక్ సిటీలోని యశోద ఆసుపత్రి వైద్యబృందం అత్యాధునిక 'ఎక్మో' చికిత్సతో ప్రాణం పోసింది. 'పెరిపార్టమ్ కార్డియోమయోపతి' కారణంగా గుండె పనిచేయడం నిలిచిపోగా, ఇతర అవయవాలు కూడా ప్రభావితమయ్యాయి. ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ దామోదర్ రెడ్డి గౌని నేతృత్వంలోని బృందం ఎక్మో విధానంతో చికిత్స అందించి బాలింతను కాపాడింది. కార్డియాలజీ, క్రిటికల్ కేర్, వాస్కులర్ సర్జరీ, ప్రసూతి, స్త్రీరోగ, నెఫ్రాలజీ విభాగాలు సమన్వయంతో పనిచేశాయి. ప్రస్తుతం తల్లీబిడ్డలు ఇద్దరూ పూర్తి ఆరోగ్యంతో కోలుకుని డిశ్చార్జ్ అయ్యారని డాక్టర్ దామోదర్ రెడ్డి గౌని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ఎక్మో ప్రాణరక్షణకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

## ఘనంగా మాతృభాషా, జాతీయ క్రీడా దినోత్సవములు..



**సఖినేటిపల్లి ఆగస్టు 29, ప్రభాత వార్త:** మాతృభాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవములను అంతర్వేదికర గ్రామంలో శ్రీ పోతురాజు వెంకట నరసయ్య మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మేజర్ ధ్యాన్ చంద్, గిడుగు రామ్మూర్తి నాయుడు చిత్రపటాలకు పూలమాలలు అలంకరించి, నివాళి అర్పించినారు. తెలుగు భాష కు గిడుగు రామ్మూర్తి నాయుడు చేసిన సేవలను వ్యవహారిక భాష గా అందుబాటు లోనికి తీసుకు రావడానికి వారు చేసిన కృషిని ఎస్.కె షరీఫ్ విద్యార్థులకు తెలియజేశారు. మేజర్ ధ్యాన్చంద్ ప్రపంచ క్రీడాకారుడు గా ఒలింపిక్స్ బంగారు పతకాల విజేతగా క్రీడా రంగానికి ఆయన చేసిన సేవలను పిడికె భాస్కర రావు వివరించారు. ప్రధానోపాధ్యాయిని నారిన ఛాయా ప్రసూనాంబ అధ్యక్షతన జరిగిన వివిధ అంశాలలో గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతి ప్రధానం చేయడమైనది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ ఉమా మందేశ్వర(శనీశ్వర)స్వామి వారికి తైలాభిషేకములు

### -స్వామి వారికి రూ 2 లక్షల 28 వేల ఆదాయం



**కొత్తపేట, ఆగస్టు29(ప్రభాతవార్త)** మండల పరిధిలోని మందపల్లి గ్రామంలో వేంచేసి యున్న పురాణ ప్రసిద్ధిగాంచిన శ్రీ ఉమా మందేశ్వర (శనేశ్వర) స్వామివారికి శనివారం పర్వదినాన్ని పురస్కరించుకుని తైలాభిషేకములు సర్వదర్శనములు ప్రత్యేక పూజలు భక్తుల నిర్వహించారు ధర్మాదాయ దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ అలాగే ఆలయ కార్య నిర్వహణ అధికారి దారపురెడ్డి సురేష్ బాబు భక్తులకు ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు స్వామి వారికి పరోక్ష పూజలు ప్రత్యక్ష పూజలు ద్వారా మొత్తం రు 2 లక్షల 28వేల 484 ఆదాయం వచ్చినట్లు ఈవో సురేష్ బాబు తెలిపారు

## అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆర్ఎల్ఎమ్ కృత్యాలు ఖచ్చితంగా బోధించాలి: ప్రథమ్ కోఆర్డినేటర్ పవన్



**అడ్డతీగల, ఆగస్టు 29, ప్రభాతవార్త** మండల కేంద్రమైన అడ్డతీగలలో అంగన్‌వాడీ కేంద్రాలు చిన్న పిల్లల ప్రీ-స్కూల్ విద్యకు కేంద్ర బిందువుగా నిలవాలని 'ప్రథమ్' సంస్థ పోలవరం జిల్లా కోఆర్డినేటర్ పవన్ ఉద్ఘాటించారు. అడ్డతీగల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అడ్డతీగల, రాయిపల్లి, చవిటిదిబ్బలు సెక్టార్ల సమీక్షా సమావేశాలు శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పవన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలోనూ అభ్యాస మూలలు లర్నింగ్ కార్నర్స్, బోధనా సామగ్రి, తల్లుల కమిటీలు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని ఆయన సూచించారు. రోజువారీగా నిర్దేశించిన ఆర్ఎల్ఎమ్ కృత్యాలను కార్యకర్తలు ఖచ్చితంగా నిర్వహించాలని ఆదేశించారు. సంబంధిత విద్యా వీడియోలను అంగన్‌వాడీ కార్యకర్తలు చూసి, వాటిని తల్లుల వాట్సాప్ గ్రూపుల్లో పంచుకోవాలని, తద్వారా పిల్లల తొలి విద్యలో తల్లులను కూడా భాగస్వాములను చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ అడ్డతీగల ప్రాజెక్ట్ అధికారిణి పి. క్రాంతి కుమారి, సూపర్వైజర్లు పి. అరుణలత, బి. స్వర్ణలత, జి.ఎస్.ఎల్.బి.టి. సుందరి మరియు సెక్టార్ల పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు పాల్గొన్నారు.

## ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారానికి ఎమ్మెల్యే బండారు



**కొత్తపేట, ఆగస్టు 29, (ప్రభాతవార్త)** డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి గ్రామంలో వేంచేసి యున్న శ్రీ విఘ్నేశ్వరస్వామి వారి దేవస్థాన ధర్మకర్తల మండలి ప్రమాణస్వీకార మహోత్సవానికి కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు హాజరయ్యారు నూతనంగా నియమింపబడిన చైర్మెన్ అలాగే సభ్యులకు శుభాకంక్షలు తెలియజేశారు స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు వసతులు కల్పించడానికి కృషి చేయాలని నూతన మండలికి సూచించారు ముందుగా స్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే సత్యానందరావు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు

## ఘనంగా తెలుగు భాషా, క్రీడా దినోత్సవ వేడుకలు



**అడ్డతీగల, ఆగస్టు 29, ప్రభాతవార్త** అడ్డతీగల మండలంఎల్లవరం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు ఎం.ఈ.ఓ పి. శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మ లాంటి మాతృభాషపై ప్రతి ఒక్కరూ మక్కువ పెంచుకోవాలని, గిడుగు రామమూర్తి గారి కృషిని స్మరించుకోవాలని కోరారు. దేశభాషలందు తెలుగు లెస్స అని, తెలుగుపై పట్టు సాధిస్తే ఇతర సబ్జెక్టులు సులభంగా అర్థమవుతాయని చెప్పారు. అలాగే హాకీ దిగ్గజం ధ్యాన్ చంద్ అందరికీ ఆదర్శమని, క్రీడల వల్ల శారీరక దారఢ్యంతో పాటు మానసిక ఒత్తిడి తగ్గి చదువుపై శ్రద్ధ పెరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు పంపిణీ చేశారు. ఈ వేడుకలను చక్కగా నిర్వహించిన తెలుగు ఉపాధ్యాయిని ముర్రం రాజేశ్వరిని ఎంఈఓ అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ హెచ్ఎం ఆర్. వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు కే. గంగరాజు, ఏ. భార్గవ, ఆర్. జ్యోతి పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా సవరణపై బీజేపీ ప్రత్యేక దృష్టి

### -అధికారులకు ఫారం 7ల అందజేత




**గొల్లప్రోలు, ఆగస్టు 29, (ప్రభాత వార్త)** ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా గొల్లప్రోలు పట్టణానికి చెందిన బీజేపీ నాయకులు శనివారం అధికారులను కలిసి పలు దరఖాస్తులను అందజేశారు. బీజేపీ సీనియర్ నాయకుడు,బీఎల్ఏ--1 (బూత్ లెవల్ ఏజెంట్) గండి కొండలరావు ఆధ్వర్యంలో పార్టీ ప్రతినిధుల బృందం గొల్లప్రోలు మున్సిపల్ కమిషనర్ దివిజ సంపతిని,తహసీల్దార్ వెంకట భాస్కర్ ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితాలో మార్పులు,చేర్పులు అనర్హుల తొలగింపునకు సంబంధించి నాలుగు ఫారం 7 దరఖాస్తులను వారికి సమర్పించారు. ప్రస్తుత ఓటర్ల జాబితాలోని పలు అంశాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా తగిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వారు అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఎస్ఐఆర్ సభ్యుడు దాట్ల వెంకట సూర్యనారాయణ రాజు, పిఠాపురం నియోజకవర్గం టోలి సభ్యుడు అడబాల వీర మోహనరావు,జిల్లా కార్యవర్గ సభ్యులు కర్రీ సత్యనారాయణ (అన్నారం) పోసిన సత్యనారాయణ, మలిరెడ్డి నారాయణరావు,కోశెట్టి అడవిరాజు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో "క్వాంటమ్ కంప్యూటింగ్ మరియు ఏజెంటిక్ ఎఐ " అనే అంశంపై మూడు రోజుల వర్క్ షాప్ నిర్వహణ



**గండేపల్లి. ఆగస్టు 29. ప్రభాతవార్త** స్థానిక ప్రగతి ఇంజనీరింగ్ కళాశాల సి ఎస్ ఇ (డి ఎస్) విభాగం వారు తమ ద్వితీయ మరియు తృతీయ సంవత్సరం విద్యార్థిని, విద్యార్థులకు బ్రెయినో విజన్ వారి ఆధ్వర్యంలో ది. 27-08-2025 నుండి 29-08-2026 వరకు "ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఫర్ ఇంటలిజెంట్ డేటా ఆటోమేషన్" అనే అంశము పై మూడు రోజుల పాటు వర్క్ షాప్ నిర్వహిచానుని కళాశాల చైర్మన్ డా॥ పరుచూరి కృష్ణారావు తెలియచేసారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ, తమ కళాశాల ఇటువంటి ఆధునిక టెక్నాలజీల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించడం ద్వారా వారిని భవిష్యత్తు అవసరాలకు ఉపయోగపడే మంచి ఇంజనీర్లుగా తయారుచేస్తోందని పేర్కొన్నారు. అనంతరం బ్రెయినో విజన్ సొల్యూషన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్ వారు మాట్లాడుతూ, క్వాంటంమ్ కంప్యూటింగ్ అనేది సాధరణ కంప్యూటర్ల కంటే ఎన్నో రెట్లు వేగంగా ప్రోసెస్ చేస్తుందని పేర్కొంటూ, వాటి ఉపయోగాలను వివరించారు. భవిష్యత్తులో బ్యాంకింగ్, సెక్యూరిటీ, వాతావరణ మార్పుల అంచనా, అర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ లో ఇది విప్లవాత్మక మార్పులు తీసుకువస్తుంది. ఎజెంటిక్ ఎఐ అనేది మనిషిల" అలోచించి సొంతముగా నిర్ణయాలు తీసుకోని పనులను అటోమెటిక్ గా చేసే తెలివైన ఎఐ ఎజెంట్ దీనిద్వారా పరిశ్రమలలో డేటా ఆటోమేషన్ అనేది కస్టమర్ సర్వీసులో ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమం లో సి. ఎస్. ఇ. (డి ఎస్) విభాగాధిపతి శ్రీ ఎమ్ వి రాజేష్ మాట్లాడుతూ, ఇటువంటి వర్క్ షాప్ నిర్వహించుకునే అవకాశం కలిపించిన ప్రగతి ఇంజనీరింగ్ కళాశాల వారికి తమ కృతజ్ఞతలు తెలియజేస్తూ, రిసోర్స్ పర్సన్స్కి తమ అభినందనలు తెలియచేసారు. ఈ కార్యక్రమానికి ఫ్యాకల్టి కో అర్డినేటర్ గా శ్రీజాను నాయక్ వ్యవహరించారు. ఈ కార్యక్రమం లో కళాశాల డైరెక్టర్ మానేజ్మెంట్ ఎం.వి.హరనాధబాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం.సతీష్, డైరెక్టర్-అకడమిక్స్ డా॥ కె.సత్యనారాయణ, ప్రిన్సిపాల్ డా॥ జి.నరేష్, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్లు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## పెంకు పురుగులతో భయాందోళ



**కాట్రేనికోన ఆగస్టు 29(ప్రభాతవార్త)** కాట్రేనికోనలోని తహసిల్దార్ కార్యాలయం చెంతన ఉన్న ఎఫ్సీఐ గోడౌన్ పరిసరాల ప్రాంతాల్లో పెంకు పురుగులతో తీవ్ర ఇబ్బంది పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ గోడౌన్లో రైస్ మిల్లు నుంచి వచ్చిన బియ్యం బస్తాలు వంటివి నిల్వ చేస్తుంటారు. వాటి మధ్యన వ్యాప్తి చెందిన పెంకు పురుగులు చిలకమ్మ చెరువు ,ఎంపీడీవో ఆఫీస్ రోడ్డు పరిధిలోని ఇళ్లల్లోకి పాకి రావడంతో ఇబ్బంది పడుతున్నామని వారు అంటున్నారు. ఇంటి అవరణలో అరుగులు, గోడల పైకి మంచాల పైకి పాకడంతో శరీరంపై దద్దుర్లు వంటివి ఏర్పడుతున్నాయి అన్నారు. చిన్నపిల్లలైతే మరింత ఇబ్బందిగా ఉందన్నారు నోట్లోకి చెవుల్లోకి వెళ్తే వీటితో ప్రమాదం పొంచి ఉంటుంది సంబంధిత అధికారులు స్పందించి ఇక్కడ పరిసరాల్లో పెంకు పురుగులు వ్యాప్తి చెందకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## గండేపల్లి శ్రీ గీతం. స్కూల్లో ఘనంగా తెలుగు భాషా దినోత్సవ వేడుకలు:



**గండేపల్లి. ఆగస్టు 29. ప్రభాతవార్త** గండేపల్లి శ్రీ గీతం స్కూల్ ఆవరణలో శనివారం తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీ గీతం కరస్పాండెంట్ వి ఎస్ పి చౌదరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిడుగు వెంకట రామమూర్తి పంతులుగారు తెలుగు భాష కోసం ఎంతగానో కృషి చేశారని తెలిపారు. అందుకోసమే ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని తెలుగు వారంతా పండగ వలె జరుపుకుంటారని అన్నారు. సంస్కృత, గ్రాంధిక భాషలు కష్టంగా పలుకుతారని, అందుకే ప్రతి ఒక్కరూ సులభంగా మాట్లాడాలని తెలుగు భాష ప్రత్యేక గుర్తింపును తీసుకు వచ్చిన మహనీయుడుగా రామ్మూర్తి పంతులు గారిని కొలుస్తారు. తెలుగు భాష కన్నతల్లి వంటిదని, దానిని ఎవరు విడిచిపెట్టరాదని సూచించారు. నేటి యువత ఇంగ్లీష్ , ఇతర భాషల పై ఉన్న మోజుతో తెలుగును విస్మరిస్తుందని, మాతృభాషను ఎప్పుడు దూరం పెట్టకుండా ఉంటూనే, ఇతర భాషలను గౌరవించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## చినబొడ్డులో ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవం.

### -భక్తులతో కిటకిటలాడిన మహాలక్ష్మి ఆలయం.



**తాళ్ళరేవు, ఆగస్టు 29 (ప్రభాతవార్త):** కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం కోరంగి పంచాయతీ బొడ్డు చిన వెంకటాయపాలెం లో కొలువై ఉన్న మహాలక్ష్మమ్మ ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవం ఘనంగా జరిగింది. అగ్నికుల క్షత్రియ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బొడ్డు సత్యనారాయణ సుమారు 20 టన్నుల ఏకశిలా గ్రానైట్ ధ్వజస్తంభాన్ని తయారు చేయించి ఈ ప్రతిష్ఠోత్సవం నిర్వహించారు. నంద్యాల లోని ఆళ్లగడ్డ లో ఈ ఏకశిలా ధ్వజస్తంభం ప్రత్యేకంగా తయారు చేయించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మూడు రోజులపాటు ప్రతిష్ఠోత్సవం లో ప్రత్యేక పూజలు నిర్వహించగా వేద పండితుల మంత్రోచ్చారణలు, భక్తుల గోవింద నామస్మరణ మధ్య ధ్వజస్తంభం ప్రతిష్ట ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా చిన బొడ్డు, పెద్ద బొడ్డు వెంకటాయపాలెం గ్రామాల భక్తులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలి రావడంతో చిన బొడ్డు మహాలక్ష్మమ్మ ఆలయం భక్తులతో కన్నుల పండుగగా కనిపించింది. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, పలువురు ప్రముఖులు, ఆలయ కమిటీ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## యానం శ్రీ భూ సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఘనంగా అన్నదాన కార్యక్రమం



**యానాం, ఆగస్టు 29: (ప్రభాతవార్త)** కేంద్రపాలిత ప్రాంతమైన యానంలో రెడ్డి రాజుల కాలం నాటి అతి పురాతన ఆలయంగా ప్రసిద్ధి చెందిన శ్రీ భూ సమేత వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ప్రతి శనివారం నిర్వహించే అన్నదాన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం అన్నదాన దాతలు సిరింగుల రఘురాం, కోన మురళి, ప్రకాష్, దుర్గాపు ప్రసాద్, కే. శ్రీనివాస్, కాపగంటి జగదీష్, ఓలేటి కుమార్ కాటంశెట్టి రామ్మూర్తి, సహ దేవరాజు, వెంకటేష్ తదితర భక్తుల సహాయ సహకారాలతో సుమారు 1,400 మంది భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు. భక్తులకు ఆహారాన్ని అందించి సేవ చేయడం ఎంతో పుణ్యకార్యమని, దాతల సహకారంతో ప్రతి శనివారం అన్నదాన కార్యక్రమాన్ని నిరంతరంగా నిర్వహిస్తున్నామని ఆలయ ప్రధాన అర్చకులు పెద్దింటి రఘురామ వినోద్ ఆచార్యులు తెలిపారు. అన్నదాన కార్యక్రమానికి సహకరిస్తున్న దాతలకు ఆలయ నిర్వాహకులు, అర్చకులు మరియు భక్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు భవిష్యత్తులోనూ నిరంతరం కొనసాగాలని భక్తులు ఆకాంక్షించారు.

మరిన్ని వార్తలు 6లో

# కడియం జెడ్పీ ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడా,, తెలుగు భాషా దినోత్సవం



**కడియం ,ఆగస్టు 29 ( ప్రభాతవార్త)** కడియం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి. సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, మండల విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవ ప్రాముఖ్యతను, హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ భారత క్రీడారంగానికి అందించిన సేవలను వివరించారు. అలాగే తెలుగు భాషా వికాసానికి గిడుగు రామ్మూర్తి పంతులు చేసిన కృషిని కొనియాడారు. విద్యార్థులు క్రీడలు, విద్యతోపాటు భాషా పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వక్తలు ఆకాంక్షించారు.రాష్ట్రస్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరిచిన పాఠశాల విద్యార్థులకు దాత ఉప్పులూరు హనుమంతరావు అందించిన నగదు పురస్కారాలను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థిని విద్యార్థులు, ఉపాధ్యాయ ఉపాధ్యాయునీయులు పాల్గొన్నారు.

# రహదారులు సమస్యలపై రాష్ట్ర ఎస్టీ కమీషన్ చైర్మన్ కు ఏ. పి. ఐ. ఐ. సి. డైరెక్టర్ వినతులు



**రాజవొమ్మంగి, అగస్టు 29, ప్రభాతవార్త** రాజవొమ్మంగి మండలంలో అత్యవసర వంతెనలు, రహదారుల సమస్యలను పరిష్కారంకు సహకారం అందించాలని శనివారం రాజవొమ్మంగి మండల పరిషత్ కార్యాలయంలో ఎస్టీ కమీషన్ చైర్మన్ సొళ్ల బొజ్జిరెడ్డి నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో రాజవొమ్మంగి మండల టిడిపి అధ్యక్షులు, ఏ. పి. ఐ. ఐ. సి. డైరెక్టర్ గొల్లపూడి పెద్దిరాజు వినతిపత్రాలను ఇచ్చి సమస్య అవసరాన్ని వివరించారు. రాజవొమ్మంగి శాంతినగర్, లబ్బర్తి, ఎర్రంపాడు వంతెనలు కావాలని అర్జీని ఇచ్చారు. రాజవొమ్మంగి.. రాజుపేట, జడ్డంగి నుండి వనకరాయి గ్రామం మీదుగా కరుదేవపాలెం, చికిలింత.. పెదగర్రంగి, కొండలింగంపర్తి ఆర్ అండ్ బి రోడ్డు నుండి జి. కొత్తపల్లి, దుర్గా నగర్.. మద్దిబంద.. వనకరాయి రోడ్లు నూతనంగా కావాలని కోరారు. ఉపాధి హామీ పథకం ద్వారా రోడ్లు మంజూరు అయ్యి తారు, సిమెంట్ ధరలు పెరుగుదలతో ఆగిపోయిన రహదారులు పూర్తి అవ్వడానికి సహకారం అందించాలని మరొక అర్జీని ఇచ్చారు. రాజవొమ్మంగి.. బొరుగుపల్లి, ఆర్ అండ్ బి రోడ్డు నుండి డి. మల్లవరం, జడ్డంగి నుండి చిన్నయ్యపాలెం మీదుగా సింగంపల్లి, లోదొడ్డి.. పాకవేల్తి రహదారుల పనులను అసంపూర్తిగా ఆగిపోయాయని అర్జీలో పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో గొల్లపూడి పెద్దిరాజు, మండల బీజేపీ అధ్యక్షులు లోసుల రాజబాబు, జిల్లా ఉపాధ్యక్షులు తాము సూరిబాబు, ఆదివాసీ నేత వంతు బాలకృష్ణ, టిడిపి శ్రేణులు పాల్గొన్నారు.

# కుందూరు పీహెచ్‌సీకి జాతీయ స్థాయి గుర్తింపు



**కె.గంగవరం, ఆగస్టు 29 (ప్రభాతవార్త):** కుందూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం జాతీయ నాణ్యత హామీ ప్రమాణాలు (ఎన్ క్యూ ఏ ఎస్) గుర్తింపునకు ఎంపికైన సందర్భంగా పీహెచ్‌సీలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీపీ పంపన నాగమణి సుబ్బారావు, కుందూరు గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మేడిశెట్టి బాబి పీహెచ్‌సీకి విచ్చేసి వైద్యాధికారులు, వైద్య సిబ్బందిని అభినందించారు.ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ, ఆసుపత్రిలో నాణ్యతా ప్రమాణాలను పాటించడంలో వైద్యులు,సిబ్బంది చేస్తున్న కృషిని వారు ప్రశంసించారు. జాతీయ నాణ్యత హామీ ప్రమాణాలకు ఎంపిక కావడం కుందూరు పీహెచ్‌సీకి, పరిసర ప్రాంత ప్రజలకు గర్వకారణమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా వైద్యాధికారులు డి హేమ సుధీర్, డి వి ఎస్ వి బి రెడ్డి మాట్లాడుతూ ఎన్ క్యూ ఏ ఎస్ ప్రమాణాలకు ఎంపిక కావడం ద్వారా పీహెచ్‌సీలో అందిస్తున్న వైద్య సేవల నాణ్యతకు గుర్తింపు లభించిందని తెలిపారు.భవిష్యత్తులోనూ ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామని వైద్యులు, వైద్యాధికారులు, సూపర్వైజర్లు,ఆశ వర్కర్లు, ఎంపీహెచ్వోలు తదితరులు చెప్పారు.

# క్రీడలతో ఆరోగ్యం, మానసిక పరిపక్వత



**రావులపాలెం, ఆగస్టు 29 (ప్రభాతవార్త) :** క్రీడలు మనిషి ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు జీవితకాలాన్ని పెంచేందుకు దోహదపడతాయని ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ అనుసూరి నరసింహమూర్తి అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల రావులపాలెంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ టి. శ్రీవరం అధ్యక్షతన, ఫిజికల్ డైరెక్టర్ ఎన్. యువరాజ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ నరసింహమూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. యోగా, మెడిటేషన్, వ్యాయామం, నడకతో పాటు క్రీడల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ చిన్నబాబు, ఎన్ఎస్ఎస్ అధికారి ఎస్. అరుణ్‌కుమార్, అధ్యాపకులు నాగేశ్వరరావు, పవన్, రజిని, రాజేంద్ర, శ్రీనివాస్, సౌజన్య, దుర్గాదేవి, సుందరరామిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఏసీబీ వలలో వీఆర్వో....

## -లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ర్యాలి వీఆర్వో నాగేశ్వరరావు



**ఆత్రేయపురం, ఆగస్టు 29,(ప్రభాత వార్త)** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామానికి చెందిన వీఆర్వో నాగేశ్వరరావు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ర్యాలి గ్రామానికి చెందిన చిన్నం లక్ష్మీ ప్రసన్న తనకు సంబంధించిన ర్యాలి గ్రామం సర్వే నంబర్ 381/6లోని ఎకరం 0.09 సెంట్ల భూమి మ్యుటేషన్ దరఖాస్తును ప్రాసెస్ చేసి, తదుపరి చర్యల కోసం పంపించేందుకు వీఆర్వోను సంప్రదించారు. ఈ అధికారిక పని చేయడానికి వీఆర్వో రూ.16,500 లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీకి ఫిర్యాదు అందింది. ఈ మేరకు శనివారం సాయంత్రం సుమారు 4.50 గంటలకు ర్యాలి గ్రామ సచివాలయంలో ఫిర్యాదురు నుంచి రూ.16,500 లంచం స్వీకరించి తన ఎడమ వైపు షర్టు జేబులో పెట్టుకున్న సమయంలో ఏసీబీ అధికారులు దాడి చేసి వీఆర్వోను పట్టుకున్నారు.రూ.16,500 లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ వీఆర్వో రాజమహేంద్రవరం ఏసీబీ రేంజ్ పరిధిలోని క్రైం నం.07/ఆర్ఏ-ఆర్జే/2026, అవినీతి నిరోధక చట్టం (సవరణ)--2018లోని సెక్షన్ 7 కింద కేసు నమోదు చేసినట్లు ఏసీబీ అదనపు ఎస్పీ ఎస్. భవ్య కిషోర్ తెలిపారు. వీఆర్వో షర్టు జేబులో నుంచి రూ.16,500 లంచం సొమ్మును మధ్యవర్తుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు. వీఆర్వో చేతులకు రసాయన పరీక్ష నిర్వహించగా కుడి చేతికి పాజిటివ్ ఫలితం వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఫిర్యాదురుకు సంబంధించిన అధికారిక పని దస్త్రాన్ని కూడా వీఆర్వో వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, పోస్ట్ ట్రాప్ ప్రక్రియ

# ఘనంగా జాతీయ క్రీడ, తెలుగు భాషా దినోత్సవం



**కె గంగవరం, ఆగస్టు 29,(ప్రభాత వార్త):** జాతీయ క్రీడా దినోత్సవం తెలుగు భాషా దినోత్సవం కార్యక్రమాలు భారతీయ జనతా పార్టీ గంగవరం మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి చంద్రరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడినట్లు ఆయన తెలిపారు. బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు అవసరాల వెంకటరమణమూర్తి మాట్లాడుతూ తెలుగు భాషాభివృద్ధి కోసం గిడుగు వెంకట రామమూర్తి విశేష కృషి చేశారని ఈ భాష చాలా ప్రాచీన మైనదని, ప్రస్తుత పరిస్థితిని బట్టి తెలుగు భాష రాబోయే రోజుల్లో కనుమరుగయ్యే అవకాశం ఉందని,పాఠశాలలో తెలుగు మీడియం లేకపోవడం బాధాకరమని కనుక ప్రభుత్వం తెలుగు మీడియం పునరుద్ధరించాలని అన్నారు. గిడుగు వెంకట రామమూర్తి జయంతిని తెలుగు భాషా దినోత్సవం గా ప్రభుత్వం ప్రకటించిందని ప్రముఖ హాకీ నైపుణ్యులు కెప్టెన్ ధ్యాన్చంద్ జయంతిని జాతీయ క్రీడా దినోత్సవం గా జరుపుకుంటున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు గుర్రాల సత్యనారాయణ ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు కౌలూరి వెంకటరమణ మండల ఉపాధ్యక్షులు నున్న సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఏ నారాయణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.క్రీడా దినోత్సవం సందర్భంగా కుందూరు ఉన్నత పాఠశాలలో ఆటల పోటీలు జరిగాయి వ్యాయామ ఉపాధ్యాయురాలు దుర్గాదేవి ఆధ్వర్యంలో బాల బాలికలకు విడివిడి గా కోకో , కబడ్డీ, షార్ట్ పుట్, రన్నింగ్ అంశాల్లో జరిగాయి. అలాగే తెలుగు భాషా దినోత్సవం కూడా ఘనంగా నిర్వహించడం జరిగినట్లు ప్రధానోపాధ్యాయులు. శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భానుకృష్ణమూర్తి, చంద్రశేఖర్ రామ్మోహన్ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదంలో మృతి చెందిన ముగ్గురు జనసైనికుల కుటుంబాలను పరామర్శ..

## -ఎమ్మెల్యే దేవ...



**సఖినేటిపల్లి ఆగస్టు 29, ప్రభాత వార్త:** ఇటీవల కారు ప్రమాదంలో మృతి చెందిన ముగ్గురు జనసైనికుల కుటుంబాలను రాజోలు శాసన సభ్యులు దేవ వరప్రసాద్ నేడు పరామర్శించారు. ఈ ప్రమాదంలో సఖినేటిపల్లి మండలం మోరిపోడు గ్రామానికి చెందిన పోతుల లక్ష్మీ భాను, మోరి గ్రామానికి చెందిన నాగిరెడ్డి దుష్యంత్ సాయి, శృంగవర్పాడు గ్రామానికి చెందిన చెరుకూరి రాజారాం, మృతి చెందగా ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మృతుల కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ముగ్గురు జనసైనికుల అకాల మరణం పార్టీకి, వారి కుటుంబాలకు తీరని లోటని అన్నారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్క్ పెడ్ డైరెక్టర్ జి నరసింహారావు, గుబ్బల ఫణి, తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీపీ రాయుడు సునీతకు పతీ వియోగం.

## -పటవలలో ఘనంగా రాయుడు గంగాధర్ అంతిమయాత్ర.



**తాళ్లరేవు, ఆగస్టు 29 (ప్రభాతవార్త):** తాళ్ళరేవు మండల పరిషత్ అధ్యక్షురాలు రాయుడు సునీత భర్త, సీనియర్ రాజకీయ నాయకుడు డాక్టర్ రాయుడు గంగాధర్ అంత్యక్రియలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రి నుంచి గంగాధర్ పార్థివ దేహాన్ని ఆయన స్వగ్రామమైన పటవల లో ప్రజల సందర్శనార్థం ఉంచారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ప్రజలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు మృతదేహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. పతీ వియోగంతో బాధపడుతున్న ఎంపీపీ సునీతను ఓదార్చి ధైర్యం చెప్పారు. అనంతరం పూల రథంలో ఊరేగిస్తూ వేలాది మందితో గంగాధర్ అంతిమయాత్ర నిర్వహించారు. ఆయనకు నివాళులు అర్పించిన వారిలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, మార్కెటింగ్ కమిటీ మాజీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, జడ్పిటిసి సభ్యులు దొమ్మేటి సామ్యూల్ సాగర్, టిడిపి అమలాపురం పార్లమెంట్ అధ్యక్షులు గుత్తుల సాయి, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ టేకుమూడి లక్ష్మణరావు, టిడిపి మండల అధ్యక్షులు ధూళిపూడి వెంకటరమణ, అత్తిలి బాబూరావు, బోణం శ్రీనివాస్, గుడాల నాని, డిసి వైస్ చైర్మన్ కొత్తూరు కాశి, ఎం డి యు డబ్ల్యూ ఏ అధ్యక్ష, కార్యదర్శులు కన్నీడి వెంకటరమణ, కుసుమ శ్రీనివాస్, కేవిపిస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు విప్పర్తి శ్రీనివాస్, పులపకూర కృష్ణ, జక్కల ప్రసాద్ బాబు, కాశి లక్ష్మణ స్వామి, కమిడి ఈశ్వరీబాయి, విశ్వజన కళామండలి రాష్ట్ర అధ్యక్షులు యడ్ల కుటుంబరావు, తాళ్ళరేవు ప్రెస్ క్లబ్ ప్రతినిధులు, మాజీ సర్పంచ్ పంపన రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు పోతుల రత్నకుమారి, నందికోళ్ల శ్రీదేవి, గుత్తుల శ్రీను, కాదా శ్రీను, ఎంపిడిఓ స్వర్జన్, ఎంఈఓ ఉమ, జగన్, దున్నా మురళి, దంగేటి అన్వేష్, సూరంపూడి శ్రీను, కొప్పిశెట్టి వెంకట్, చిట్టూరి చలపతి, మేకల గోపాలకృష్ణ, డిప్యూటీ ఎంపిడిఓలు విజెవి రమణ, ప్రకాష్, మండల పరిషత్ కార్యాలయ ఎఒ సత్యనారాయణ, అధికారులు, సిబ్బంది ఉన్నారు.


# ఒకే ఒక్కడు..పవన్ కళ్యాణె..

## -అంబాజీపేటలో పవన్ కళ్యాణ్ భారీ కటౌట్ ఏర్పాటు..




**అంబాజీపేట, ఆగస్టు 29,(ప్రభాతవార్త):** నాయకులు వస్తారని ఎదురుచూపు లేదు..ఏదో చేస్తారని ఆశ లేదు.. మేము ఎదురు చూసేది, ఆశించేది పవన్ కళ్యాణ్ నుండే. పవన్ కళ్యాణె మా నాయకుడు.. అంటూ యువత సంబరాలు చేసుకున్నారు. తమ అభిమాన నాయకుడు, జనసేనాని, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా అంబాజీపేటలో చిరు–పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 2న పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించాలని ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. దీనిలో భాగంగా అంబాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదురుగా యువకులు స్వయంగా ఏర్పాటు చేసుకున్న పవన్ కళ్యాణ్ కటౌట్ ను యువకులే శనివారం ప్రారంభించుకున్నారు.ఈ సందర్భంగా యువత మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన డప్పు వాయిద్యాలు, విద్యుత్తు వెలుగులు, బాణాసంచా కాల్పులు అల్లరించాయి.ఈ కార్యక్రమంలో సూదాబత్తుల రమేష్, పిల్లా రాజా, రవణం విజయ్,దున్నాల సురేంద్ర,పళ్ళ సురేష్, పళ్ళ తేజ,పళ్ళ రాము, యాతం మూర్తి, వక్కపట్ల సుభాష్, పోతు సందీప్, పేరా బత్తుల అజయ్,రంకిరెడ్డి రఘురామ్,సూదాబత్తుల వినయ్, కొర్లపాటి అభిషేక్, ప్రేమ్ సాయి,చిన్న తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాతృభాష,జాతీయ క్రీడా దినోత్సవాలు..



**అంబాజీపేట, ఆగస్టు 29,(ప్రభాతవార్త):** తెలుగు భాషోద్యమ పితామహుడు, వ్యవహారిక తెలుగు భాషకు గొడుగై నిలిచిన గిడుగు రామ్మూర్తి భవిష్యత్తు సమాజానికి బాటలు వేసి, ఆధునిక కవులకు స్ఫూర్తిగా నిలిచారని ప్రధానోపాధ్యాయులు కడలి సాయిరామ్ అన్నారు. అంబాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ లో మాతృభాష, జాతీయ క్రీడా దినోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్మూర్తి ధ్యాన చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఎన్ని తరాలు మారుతున్నా తెలుగు భాష గొప్పదనం పెరుగుతుందే తప్ప ఎప్పటికీ తరగదన్నారు. అనంతరం జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా క్రీడాకారులు, ఉపాధ్యాయులతో పిడి కుంపట్ల ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.అలాగే గంగలకుర్రు అగ్రహారం జెడ్పీ హైస్కూల్లో హెచ్ఎం అక్కిరాజు శేషసాయి ఆధ్వర్యంలో తెలుగు భాషా, జాతీయ క్రీడా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎంలు మాట్లాడుతూ వ్యవహారిక భాషను ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి గిడగు రామమూర్తి చేసిన కృషి ఆదర్శనీయమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తెలుగు పద్యాలు, ఉపన్యాస, వకృత్వ పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయుడు అప్పారి శశికుమార్, పీడీ అను శేషవెంకట సూర్యమధు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మాధురిలో ఘనంగా తెలుగు భాషా దినోత్సవ వేడుకలు



**గొల్లప్రోలు,ఆగస్టు29, (ప్రభాతవార్త)** గొల్లప్రోలు పట్టణ పరిధి మాధురి విద్యాలయలో తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మాధురి విద్యాసంస్థల అధినేత కదారి తమ్మయ్యనాయుడు పాఠశాలలో ఏర్పాటు చేసిన గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాల వేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా నాయుడు మాట్లాడుతూ సామాన్యులకు అర్థంకాని గ్రాంధిక భాష స్థానంలో అందరికీ సులువుగా అర్థమయ్యే వ్యవహారిక భాషా మార్పు కోసం ఉద్యమించిన గొప్ప విద్యావేత్త గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు అని కొనియాడారు. రామ్మూర్తి పంతులు చేసిన సేవలను స్మరిస్తూ ప్రతి ఏటా ఆగస్టు 29న ఆయన పుట్టినరోజును ‘తెలుగు భాషా దినోత్సవం’గా జరుపుకుంటున్నామని విద్యార్థులకు తెలిపారు.ఈ వేడుకల్లో భాగంగా మాధురి విద్యాలయ విద్యార్థులు తెలుగు భాష గొప్పతనాన్ని వివరిస్తూ పాడిన పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి.ముఖ్యంగా విద్యార్థులు తెలుగుతల్లి,గిడుగు రామ్మూర్తి పంతులు వేషధారణలలో విచ్చేసి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు,పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మామిడికుదురులో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం



**మామిడికుదురు.ఆగస్టు 29(ప్రభాతవార్త)** మండల కేంద్రమైన మామిడికుదురు గ్రామంలో శనివారం సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి ఎన్.వి.వి. సత్యనారాయణ మాట్లాడుతూ వరి పంటను ఎలుకల బారి నుండి రక్షించుకుని,అధిక దిగుబడులు సాధించేందుకు రైతులందరూ సామూహికంగా ఎలుకల నిర్మూలన చేపట్టాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం వ్యవసాయ శాఖ ద్వారా మండలంలోని 13 రైతు సేవా కేంద్రాల వద్ద ఉచితంగా ఎలుకల మందును పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు.విషపు ఎర తయారీ ఇలా..ఒక ఎకరం వరి పంటకు విషపు ఎరను తయారు చేసే విధానాన్ని ఆయన రైతులకు వివరించారు. 192 గ్రాముల బియ్యపు నూకలు, 4 గ్రాముల బ్రోమోడయోలిన్ ఎలుకల మందు, 4 గ్రాముల నూనెను కలిపి విషపు ఎరను సిద్ధం చేసుకోవాలన్నారు.ఈ మిశ్రమాన్ని 10 గ్రాముల చొప్పున చిన్న పొట్లాలుగా కట్టి ఎలుకల బొరియల వద్ద ఉంచాలని సూచించారు. ఈ అవకాశాన్ని మండలంలోని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు బి. చంద్రశేఖర్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కుడిపూడి జానకి,మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెచ్చెట్టి విజయభాస్కర్,స్థానిక రైతులు కంచి విశ్వనాథం, భూపతి ప్రసాద్,కూన రామకృష్ణారావు,బొడ్డపల్లి వెంకటేశ్వరరావు,నైనాల శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ రామాలయ నిర్మాణానికి రూ. 2 లక్షల విరాళం



**మామిడికుదురు.ఆగస్టు 29(ప్రభాతవార్త)** మండల పరిధిలోని మగటపల్లి గ్రామంలో నూతనంగా పునః నిర్మిస్తున్న శ్రీ రామాలయ నిర్మాణానికి నామన ఫౌండేషన్ భారీ ఆర్థిక సాయాన్ని ప్రకటించింది. ఫౌండేషన్ చైర్మన్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు శనివారం ఆలయ కమిటీ సభ్యులను కలిసి రూ. 2 లక్షల నగదు విరాళాన్ని అందజేశారు.ఆలయాల పునః నిర్మాణానికి, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు తమ ఫౌండేషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. తమ పిలుపునకు స్పందించి పెద్ద మొత్తంలో విరాళం అందించిన నామన రాంబాబుకు ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బొలిశెట్టి వెంకటేశ్వర రావు (తాత), బోలిశెట్టి మాధవ,పిల్లా శ్రీనివాస్,సూరిశెట్టి కాశి విశ్వనాధం,బొలిశెట్టి సత్యనారాయణ మూర్తి, బోలిశెట్టి సతీష్, బోలిశెట్టి ఏసుబాబు,నామన నాగేశ్వరరావు,కుంపట్ల బాబ్జి, చెల్లింగి సింహాచలం,భూపతి శ్రీను,కుంచే శ్రీనివాస్, నామన ఆంజనేయ స్వామి నాయుడు,కట్టా చంటి,కట్టా సంపద రావు తదితరులు పాల్గొన్నారు.

# తీర ప్రాంత క్రీడాకారుల్లో అద్భుత ప్రతిభ

## -ఉప్పాడ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవం



**యు.కొత్తపల్లి, ఆగస్టు 29 (ప్రభాతవార్త) :** తీర ప్రాంత క్రీడాకారులకు అద్భుత ప్రతిభ ఉందని జనసేన పార్టీ సీనియర్ నాయకులు జ్యోతుల శ్రీనివాస్ అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఉప్పాడ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కబడ్డీ, వాలీబాల్, హాకీ, ఖో–ఖో క్రీడా పోటీలను నిర్వహించి విజేతలకు అందించిన బహుమతులు ఉప్పాడ ఎంపీటీసీ మెరుగు ఎల్లాజీ సమకూర్చారు. ప్రతిరోజూ హాకీ, ఇతర క్రీడల్లో తర్ఫీదు పొందే క్రీడాకారులకు ఉప్పాడ జనసేన పార్టీ ఇంచార్జ్ గంట విజయ్‌కుమార్ రన్నింగ్ షఉస్ అందజేశారు. క్రీడలను ఉన్నత స్థాయికి వెళ్ళడానికి విశేష కృషి చేస్తున్న బాలికల వ్యాయామ ఉపాధ్యాయుడు వి.రవిరాజును ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు.అలాగే జాతీయ స్థాయిలో హాకీ, కబడ్డీ మరియు సైక్లింగ్ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన పల్లెటి లక్ష్మీనారాయణ, మెరుగు ఏబేలు, చొక్కా డేవిడ్, పిరమళ్ల మనీష్ తదితర క్రీడాకారులను సన్మానించారు. క్రీడాకారులను ప్రోత్సహిస్తూ జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఇంత ఘనంగా నిర్వహించిన ఉప్పాడ స్పోర్ట్స్ క్లబ్‌ను కార్యక్రమానికి హాజరైన అతిథులు అభినందించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సూరాడ రాజు, వైస్ ఎంపీపీ మాదిరెడ్డి దొరబాబు, ఉమ్మిడి జాన్, ఉప్పాడ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు దోనె ప్రసాద్, ఉపాధ్యక్షులు కారే రవి, గంట కుమార్, కార్యదర్శి వంకా డేనియల్, క్లబ్ సభ్యులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం, డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# లవ్ జిహాద్, బలవంతపు మత మార్పిడులకు అడ్డుకట్ట వేయాలి

## - ప్రత్యేక చట్టం కోసం కడియంలో విశ్వహిందూ పరిషత్ ర్యాలీ- సీఐ, తహసీల్దార్‌కు వినతిపత్రాలు



**కడియం, ఆగస్టు 29 ( ప్రభాతవార్త)** లవ్ జిహాద్, బలవంతపు మత మార్పిడులను అరికట్టేందుకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేస్తూ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శనివారం కడియంలో ర్యాలీ, నిరసన కార్యక్రమం నిర్వహించారు. కాషాయ జెండాలు, ప్లకార్డులు చేతబూని నినాదాలు చేస్తూ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా సాగారు.ఈ సందర్భంగా ప్రేమ పేరుతో మహిళలు, యువతులను మోసగించి మత మార్పిడులకు ప్రేరేపించే చర్యలను అరికట్టేందుకు ప్రభుత్వం కఠినమైన చట్టాన్ని రూపొందించాలని డిమాండ్ చేశారు. మత మార్పిడులను నిరోధించడంతో పాటు, ఇటువంటి ఘటనలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.పిఠాపురం పంచాయతీరాజ్ ఏఈ నూకరాజు కుటుంబాన్ని విషాదంలోకి నెట్టిన ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. నిందితుడిగా ఉన్న షేక్ సాధిక్ ఖాన్‌కు కఠిన శిక్ష విధించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.అనంతరం కడియం పోలీస్‌స్టేషన్‌లో సీఐ వెంకటేశ్వరరావును కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలోనూ వినతిపత్రం సమర్పించి తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.కార్యక్రమంలో బీజేపీ నేత ఆకుల శ్రీధర్, దాసరి ముత్యం, దొడ్డా బుజ్జి, శెట్టి సత్యనారాయణ, మర్రి చంద్రరావు, లావేటి రమేష్, చిలుకూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


# జీజీహెచ్‌లో వైద్య సేవలు మెరుగుపరచాలి

## -వినతి పత్రం అందజేసిన నగర సిపిఎం కమిటీ



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 29(ప్రభాతవార్త):** కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి (జీజీహెచ్)లో వైద్య సేవలను మరింత మెరుగుపరచాలని కోరుతూ సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరీంధర ప్రసాద్, సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్‌తో పాటు ఆసుపత్రి అభివృద్ధి మండలి సభ్యులకు వినతిపత్రాలు సమర్పించారు.ఆసుపత్రి అభివృద్ధి మండలి సమావేశం సందర్భంగా సీపీఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు, మలకా వెంకటరమణ, మేడిశెట్టి వెంకటరమణ తదితరులు 18 అంశాలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. జీజీహెచ్‌లో పడకల సంఖ్యను కనీసం 2,500కు పెంచాలని, వైద్య సిబ్బందిని పెంచాలని, వీల్‌చైర్లు, స్ట్రెచర్లు, పబ్లిక్ టాయిలెట్లు, వేచి ఉండే షెల్టర్లు ఏర్పాటు చేయాలని కోరారు.క్యాజువాలిటీ విస్తరణ, సీటీ స్కాన్ ఏర్పాటు, ఆసుపత్రిలో పార్కింగ్ క్రమబద్ధీకరణ, రోడ్ల అభివృద్ధి, కార్డియాలజిస్ట్, నెఫ్రాలజిస్ట్ వైద్యుల నియామకం వంటి పలు అంశాలను వినతిపత్రంలో పేర్కొన్నారు. శానిటేషన్, సెక్యూరిటీ తదితర థర్డ్ పార్టీ సిబ్బందికి ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.వినతిపత్రంపై ఎమ్మెల్యే కొండబాబు, ఎంపీ ఉదయ శ్రీనివాస్ సానుకూలంగా స్పందించారు. అంశాలను పరిశీలించి సమావేశంలో చర్చిస్తామని ఎంపీ తెలిపారు. పలువురు వైద్యులు, అధికారులు, హెచ్‌డీఎస్ సభ్యులు సీపీఎం కృషిని అభినందించారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ నగర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# విద్యుత్ టవర్ కు ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య.



**చింతూరు ఆగస్టు 29 ప్రభాతవార్త.** చింతూరు మండలం చట్టి గ్రామానికి చెందిన సోడే రాజ్ కుమార్ (30 )అనే యువకుడు శబరి వంతెన సమీపంలో ఉన్న విద్యుత్ టవర్ కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శుక్రవారం రాత్రి ఇంట్లో గొడవ పడ్డ రాజకుమార్ శనివారం తెల్లవారే వరకు ఇంటికి చేరక పోవటంతో కుటుంబ సభ్యులు గాలించగా శబరి వంతెన సమీపంలో ఉన్న విద్యుత్ ట వర్ కు వేళడుతూ కనిపించాడు. విషయం వెంటనే పోలీసులకు సమాచారం అందిచటంతో ఘటన స్థలానికి చేరుకున్న చింతూరు సి ఐ గోపాలకృష్ణ, ఎస్ ఐ. సంతోష్ కుమార్ మృత దెయహాన్ని క్రిందకు దింపించి శవ పంచనామ కోసం ఆసుపత్రికి తరలించ్చారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రజల సమస్యలు పట్టడంలేదంటూ గ్రామ సచివాలయం వద్ద ఆందోళన



**యు.కొత్తపల్లి, ఆగస్టు 29(ప్రభాతవార్త)** :ప్రజల సమస్యలు అధికారులకు పట్టడంలేదంటూ నాగులపల్లి మాజీ సర్పంచ్ వడిశెట్టి గౌరీ రాజేశ్వరి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు వడిశెట్టి నారాయణరెడ్డి ధ్వజమెత్తారు. మండలంలోని నాగులపల్లి గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం గ్రామ సచివాలయం వద్ద మోకాళ్ళపై బైఠాయించి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరీ రాజేశ్వరి మాట్లాడుతూ గత ఐదు నెలలుగా గ్రామంలో తాగునీటి ఉందని, పారిశుద్ధ్య సమస్యతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పారిశుధ్యం లోపం కారణంగా దుర్వాసన వెదజల్లుతూ పురుగులు ఇళ్లలోకి రావడంతో ఉండలేకపోతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. వీధిలైట్లు వెలగకపోవడంతో గ్రామం అంధకారంలో చిక్కుకొందన్నారు. ప్రజలు ఇంటికి వచ్చి త్రాగునీటి, పారిశుధ్య సమస్య కోసం తమకు చెప్పడం జరుగుతుందన్నారు. సమస్యలను పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శి లక్ష్మీదేవికి ఎన్నిసార్లు చెప్పినా కూడా పట్టించుకోవడంలేదన్నారు. నారాయణరెడ్డి మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రి. పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ నియోజకవర్గంలో నాగులపల్లిలోనే కాకుండా చాలా గ్రామాల్లో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే అందుబాటులో లేకపోవడంతో అధికారులు ప్రజలను దోచుకుంటున్నారని ఆరోపించారు. గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేసిన కాంట్రాక్టర్లకు సంవత్సరాల తరబడి బిల్లులు ఇవ్వకుండా కాలయాపన చేస్తూ ఉన్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుర్రాల చిరంజీవి కుమార్, వడిశెట్టి రామకృష్ణా రెడ్డి, నిహాల్ రెడ్డి, అబ్బిరెడ్డి సుబ్బిరెడ్డి తదితరులు ఉన్నారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps